

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 108 • పేజీలు:12+16 • వెల: రూ.5 మంగళవారం • 20-3-2018 www.manamnews.com /manamnews



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల బీభత్సం

6 వాహనాలకు నిప్పు

కాంట్రాక్టర్ కొడుకు హత్య

7లో..

పుతిన్‌కే పట్టం

రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి ఎన్నిక

76 శాతం ఓట్లతో రికార్డు విజయం

7లో..



వాట్సాప్‌లోకి చైనా 'చొరబాటు'

గ్రూపుల్లో దూరుతున్న హ్యాకర్లు.. ఫోన్ సమాచారం దొంగలపాలు

- +89 నంబర్లపై అప్రమత్తమవ్వాలి
- భారత ఆర్మీ, కేంద్రం హెచ్చరిక

బెంగళూరు, మార్చి 19: వాట్సాప్.. స్నేహితులతో నిత్యం టచ్‌లో ఉండేందుకు దోహదపడుతున్న సోషల్ మెసేజింగ్ సైట్. అయితే ఇప్పుడు ఇదే మన భద్రతకు ముప్పుగా మారుతోంది. పొరుగు దేశమైన చైనా భౌగోళిక మిగతా 7లో..



ఫెడ్ 'ఫ్రంట్!'

సంయుక్త కూటమివైపు కేసీఆర్ తొలి అడుగు

- పశ్చిమబెంగాల్ సీఎం మమతతో సమావేశం
- కాంగ్రెస్.. బీజేపీలు విఫలమని తీవ్ర విమర్శ
- జనం ఆశలు.. ఆకాంక్షలు తీర్చలేదని ఎద్దేవా
- ప్రజలు అద్భుతం కోసం చూస్తున్నారని వ్యాఖ్య
- దేశంలో మార్పు.. పునరావిష్కరణకే ఈ ఫ్రంట్
- కోల్‌కతాలో మీడియాతో తెలంగాణ ముఖ్యమంత్రి
- బలీయమైన కూటమి ఏర్పాటే సంకల్పం: మమత
- ఆ దిశగా అన్ని పార్టీలతోనూ చురుగ్గా చర్చిస్తున్నాం
- టీఆర్ఎస్‌తో మాకు చిరకాలంగా సత్సంబంధాలు





కోల్‌కతా/న్యూఢిల్లీ, మార్చి 19: దేశంలో ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీలకు సవాలుగా 'ఫెడరల్ ఫ్రంట్'కు (సంయుక్త కూటమి) పురుడు పోయడానికి ప్రాంతీయ పార్టీల అధినేతలు ఏకమవుతున్నారు. ఇందుకు శ్రీకారం చుట్టిన టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మిగతా 6లో..



సీఎం కేసీఆర్‌ను అభినందిస్తున్న పద్మాదేవేందర్ రెడ్డి తదితరులు

లక్షా నూట పదహార్లు!

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సాయం భారీగా పెంపు
- అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటన
- నా హృదయానికి దగ్గరైన పథకమిది
- మానవీయ విలువలతో పరిపాలనకు ఈ పథకం నిదర్శనం: సీఎం

హైదరాబాద్, మార్చి 19 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు తీపి కబురు. నిరుపేదల ఇంట్లో ఆడపిల్ల పెండ్లి బరువు కావొద్దన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మిగతా 6లో..

4 వేల కోట్లకు టోకరా

- యాక్సిస్ సహా 22 బ్యాంకులకు కుచ్చుటోపీ
- పీఏఎల్ కంపెనీ డైరెక్టర్లు ముగ్గురి అరెస్ట్
- బూటకపు కంపెనీల పేర దొంగ బిల్లులు

ముంబై, మార్చి 19: యాక్సిస్ బ్యాంకు సహా 22 బ్యాంకులను మోసగించిన కేసులో మిగతా 6లో..

ఇదీలోకం!



ఇవాల్టి సభను ఆందోళన చేసి, వాయిదా వేయించే పనిని ఏ మిత్రపక్షానికి కేటాయిద్దాం సార్..!

ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: తదియ సా.4.51 తదుపరి చవితి; నక్షత్రం: అశ్విని రా.7.42 తదుపరి భరణి; వర్జ్యం: మ.3.46-5.21, రా.9.16-10.49; దుర్ముహూర్తం: ఉ.8.48-9.36, మ.2.24-3.12; రాహుకాలం: మ.3.24-సా.4.54; అమృతఘడియలు: మ.12.40-2.14; శుభసమయం: సా.5.22-6.00.

సూర్యోదయం: 6.24

సూర్యాస్తమయం: 6.24

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ శాతం తగ్గుతుంది. రాత్రిపూట గంటకు 9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 23 డిగ్రీలు

గాలిలో తేమ: 51 శాతం



పార్లమెంట్ ద్వారం వద్ద టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన

అదే పట్టు!

రిజర్వేషన్ల కోటా పెంచాలన్న టీఆర్ఎస్

- ఉభయ సభల్లో కొనసాగిన ఆందోళన
- పార్లమెంట్ బయటా ఎంపీల నిరసన
- లోక్‌సభలో చర్చకురాని 'అవిశ్వాసం'
- వెల్‌లోకి దూసుకొచ్చిన 25 మంది ఎంపీలు
- సభ అదుపులో లేదు.. ఏమీ చేయలేం: స్పీకర్
- పార్లమెంటు ఉభయసభలు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19: పార్లమెంటు ఉభయ సభలలో పలు ప్రతిపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో నిరసనలకు దిగడంతో ప్రభుత్వంపై తలపెట్టిన అవిశ్వాసం ఆ నిరసనల జడిలో కొట్టుకుపోయింది. రిజర్వేషన్ల విషయంలో టీఆర్ఎస్ ఎంపీలు సోమవారం కూడా తమ మిగతా 6లో..



మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న దృశ్యాలు

టెన్త్ పేపర్ లీక్

వాట్సప్‌లో ఇంగ్లిష్ పేపర్

ఉదయం 9:30కి పరీక్ష..

ఆపై గంటకే పేపర్ బయటికి

- తాడిపత్రి కేంద్రంలో ఘటన
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో
- నలుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
- విద్యార్థులపై క్రిమినల్ కేసులు
- వనపర్తిలోనూ ప్రశ్నపత్రం లీక్
- లీకేజీ వ్యవహారంపై విచారణ
- డీఈవోలకు విద్యాశాఖ కమిషనర్ ఫోన్
- పరీక్ష రద్దు ఆందోళనలో విద్యార్థులు

హైదరాబాద్, ఆదిలాబాద్/నార్నూర్, మార్చి 19(మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ కలకలం సృష్టిస్తోంది. ఆదిలాబాద్, వనపర్తి జిల్లాల్లో మిగతా 6లో..

'రద్దు'... అమలు వద్దు

- 6 వారాలు నిలుపుదల... హైకోర్టు ఆదేశం
- కోమటిరెడ్డి, సంపత్‌లకు ధర్మాసనం ఊరట
- సీల్డ్ కవర్‌లో వీడియో ఫుటేజీ సమర్పించండి
- తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా
- రద్దుకు స్వామిగౌడ్‌పై దాడి కారణం కాదు: ఏజీ
- సభా గౌరవం మంటగలపలేదు... పిటిషనర్లు





హైదరాబాద్, మార్చి 19 (మనం లీగల్ ప్రతినిధి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వ రద్దు నిర్ణయం అమలును ఆరు వారాలపాటు వాయిదా వేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు తెలంగాణ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ గెజిట్ నోటిఫికేషన్ అమలును నిలిపివేయాలని కేంద్ర మిగతా 6లో..



పొత్తు ముచ్చట లేదు

- టీఆర్ఎస్.. కాంగ్రెస్‌లకు దూరం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- నీ టర్మ్ అయిపోయింది దొరా.. ఇక మా టర్మ్: ప్రజాగాయకుడు గద్దర్
- బీఎల్ఎఫ్ దేశవ్యాప్తంగా విస్తరించాలి
- గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని
- ముగిసిన మహాజన పాదయాత్ర

6లో..

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కళ్యాణ లక్ష్మినిరుపేదల వరం: జోగు
- ఎంబీసీ సంఘం గోడపత్రిక విడుదల

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. సోమవారం సచివాల యంలోని తన చాంబర్‌లో ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గడ్డం సాయి కిరణ్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి జోగు రామన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథాకలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కల్యాణ లక్ష్మి నిరుపేదలకు వరమని, ఇక నుంచి నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద అందించే ఆర్థిక సాయాన్ని రూ.75,116 నుంచి రూ. ఒక లక్షా 116 అందించనున్నట్లు జోగు రామన్న తెలిపారు.


సంక్షేమ పథకాల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జోగురామన్న

దివ్యాంగుల పించన్ పెంచండి

- లక్ష్మణ్‌కు హక్కుల వేదిక వినతిపత్రం

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): వికలాంగుల సమస్యలను శాసనసభలో చర్చించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌కు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు లక్ష్మణ్‌తో మాట్లాడారు. వికలాంగుల పించన్‌ను రూ.5 వేలకు పెంచాలని, వికలాంగుల హక్కుల చట్టం -2016ను రాష్ట్రంలో అమలు చేయాలని వారు లక్ష్మణ్‌ను కోరారు. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విన్నపించారు.


ఫించన్‌ను పెంచాలంటూ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

టీఆర్ఎస్ లీకేజీ ప్రభుత్వం: సండ్ర

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి) : తెలంగాణలో పదో తరగతి ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం లీకేజీపై టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. గత ఏడాది కూడా ఐదుకు పైగా పదో తరగతి ప్రశ్న పత్రాలు లీకయ్యాయని, ప్రభుత్వం దాన్నుంచి గుణ పాఠం నేర్చుకోలేదన్నారు. అందువల్లే ఈసారి ఇంగ్లీష్ ప్రశ్నపత్రం లీకయ్యిందని విమర్శించారు. లీకేజీ బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇది పునరావృతం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తపడాలని ఆయన కోరారు. మెడిసిన్, ఎంసెట్, పీజీ ఎంట్రన్స్ పరీక్ష పత్రాలు కూడా లీకవడం దారుణ మన్నారు. టీఆర్ఎస్ లీకుల ప్రభుత్వంగా మారిందని, విద్యావ్యవస్థపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సండ్ర వ్యాఖ్యానించారు.


మీడియాతో మందకృష్ణ, ఉత్తమ్, కుంతియా

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ఓకే

- అధికారంలోకి రాగానే చేస్తాం:రాహుల్
- కాంగ్రెస్ అధ్యక్షుడితో మందకృష్ణ భేటీ

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సిద్ధమేనని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణ చేస్తుందని హామీ ఇచ్చారని తెలిపారు. మందకృష్ణపై జరిగిన హత్యాయత్నంపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ రామచంద్ర కుంతియా డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రతిపక్షాల వైపు ఉన్నారో, ఎన్డీఏ వైపు ఉన్నారో చెప్పాలని నిలదీశారు. ఎన్డీఏ ను వ్యతిరేకించే పక్షాల్లో చిచ్చు పెట్టేందుకే కేసీఆర్ మూడో ఫ్రంట్ అంటున్నారని కుంతియా ఆరోపించారు. తన స్వార్థం కోసం, మోడీకి ప్రయోజనం చేకూర్చేందుకే కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సస్పెన్షన్లతో కాంగ్రెస్ నేతలను అడ్డుకోలేరన్నారు. కేసీఆర్ మూడో ఫ్రంట్ పేరిట మమతా బెనర్జీ వద్దకు వెళ్లడం ఒక స్టంట్ అని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శాసన సభకు విలువలేకుండా కేసీఆర్ ప్రవర్తిస్తున్నారని ఉత్తమ్ చెప్పారు.

హై కోర్టు ఉత్తర్వులతో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందని సంపత్ చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకుండా ఆరు వారాల పాటు స్టే ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం దళితుల పట్ల కక్ష సాధించే ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. తమ సభ్యత్వ రద్దు కోర్టులో నిలవదన్నారు. సీసీ ఫుటేజీలో అసలు వాస్తవం కోర్టులు తెలుస్తుందని, తమ వైపే న్యాయం ఉందని సంపత్ వ్యాఖ్యానించారు.


వ్యవసాయశాఖ అధికారులతో సీఎస్ ఎస్‌కే జోషి సమీక్షా సమావేశం

ఏప్రిల్ 19న పెట్టుబడి సాయం

- సీఎం చేతుల మీదుగా చెక్కుల పంపిణీ
- వీఆర్‌వోలకు అందుబాటులోకి ఈ-సైన్: సీఎస్ జోషి

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): అన్నదాత అప్పుల పాలవకుండా కాపాడేందుకు రూపొందించిన వ్యవసాయానికి పెట్టుబడి సాయం పథకాన్ని వచ్చే నెలలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని సీఎస్ ఎస్‌కే జోషి వెల్లడించారు. ఏప్రిల్ 19న సీఎం కేసీఆర్ చెక్కుల పంపిణీని ప్రారంభిస్తారని చెబుతూ దీనికి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఖాతాల వారిగా ఆధునీకీకరించిన భూముల వివరాలను రెవెన్యూ శాఖ ఈ నెల 28లోగా వ్యవసాయశాఖకు అందజేయాలని సూచించారు. ఏప్రిల్ 15 నాటికి పూర్తిగా చెక్కులు మండలాల వారిగా, గ్రామాల వారిగా అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల వారిగా రిజిష్టర్లు నిర్వహించాలన్నారు. సోమవారం సచివాలయంలో రైతులకు వ్యవసాయం పెట్టుబడి సహాయంపై రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయ, ఎన్ఐసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... గ్రామాలకు సంబంధించి మొత్తం విస్తీర్ణం, సర్వే నెంబర్లు, ఖాతాల వివరాలు, రైతుల వివరాలు తహసీల్దార్లతో సర్టిఫై చేయించి సమర్పించాలన్నారు. రెవెన్యూశాఖ ద్వారా వ్యవసాయ భూముల వివరాలు అంద గానే వ్యవసాయ శాఖ చెక్కుల ముద్రణకు ఏర్పాట్లపై కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెట్టుబడి సాయం అందాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సమావేశం నిర్వహించి బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంబంధిత వీఆర్ఓలను బాధ్యులను చేయాలన్నారు. భూరికార్డుల వివరాలను కలెక్టర్లు రాండమ్‌గా వెరిఫై చేయాలన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. గ్రామాల వారిగా భూ వివరాలకు సంబంధించి వీఆర్‌వోలకు ఈ-సైన్ సౌకర్యం, ఓటీపీ విధానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఆమోదంతోనే వేతన మినహాయింపు: యూఎస్‌పీసీ

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): మాజీ సైనికుల సంక్షేమానికి సీఎం సహాయనిధికి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఒక రోజు వేతనాన్ని వారి అంగీకారంతోనే మినహాయించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చాయని, ఆ సంఘాల నుంచే మాత్రమే వేతనాన్ని విరాళంగా డీడీఓలు మినహాయించుకోవాలని పేర్కొంది. సైనిక సంక్షేమ నిధికి ఏటా నవంబర్ నెల వేతనాల నుంచి గెజిటెడ్ ఉద్యోగులు రూ.200, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు రూ.100 చొప్పున విరాళం ఇస్తున్నారని, ఇప్పుడు అదనంగా అవసరమని ఎవరూ అడగలేదని వివరించింది.

దళారుల చేతిలో పత్తి రైతు దగా

ఇప్పటికీ సగం పంట రైతుల వద్దే.. ధర పెరుగుతుందనే అట్టేపెట్టుకున్న రైతన్న

- ఫలితంగా సీసీఐ కేంద్రాలు మూత
- లబోదిబోమంటున్న పత్తి రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): ఆరుగాలం శ్రమించి పండించిన రైతన్న మార్కెటింగ్ విషయానికి వచ్చేసరికి దళారుల మాయాజాలాన్ని తప్పించుకోలేకపోతున్నాడు. లోపభూయిష్టమైన ప్రభుత్వ కొనుగోలు విధానంతో రైతులు డీలా పడుతుండగా.. వాటిని అడ్డంపెట్టుకుని దళారులు అందలమెక్కుతున్నారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో అధికారులు ఇంకా కాలం చెల్లిన విధానాలనే అమలుచేస్తుండడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. నిబంధనలో.. పాలకుల విధానమో.. అధికారుల నిర్లక్ష్యమో.. కారణాలేవైనా రైతన్నను మాత్రం కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో విధానపరమైన లోపాలు పట్టిపీడిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు అందుకు తగ్గట్టుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధరలను పెంచకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ కారణాలతో రైతులు ఈ ఏడాది కూడా భారీగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.

రాష్ట్రవ్యాప్తంగా పత్తిసాగు ఇలా..

రాష్ట్రవ్యాప్తంగా 2017-18 సంవత్సరానికి సంబంధించి పత్తి సాగు విస్తీర్ణం 47.72 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఎకరానికి పది క్వింటాళ్ల చొప్పున దిగుబడి లెక్క వేసుకుంటే.. దాదాపు 4.77 కోట్ల క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని అంచనా. ఈ సంవత్సరం గులాబీ పోటు, అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 1.48 కోట్ల క్వింటాళ్ల పత్తి మాత్రమే అమ్మకానికి వచ్చిందని అంచనా. అయితే సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకముందు అమ్మిన పత్తి, సీసీఐ కేంద్రాలు ప్రారంభం అయ్యాక ప్రైవేటుగా అమ్ముకున్న పత్తి దాదాపు 90 లక్షల క్వింటాళ్ల వరకు ఉంటుంది. ఏటుచూసినా మొత్తంగా 2.50 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడులను రాష్ట్రవ్యాప్తంగా రైతులు అమ్ముకున్నారు. ఇంకా రైతుల వద్ద 90 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు పేరుకుపోయాయి.



ధర పెరుగుతుందనే ఆశతో..

పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4320 కంటే ఈసారి బహిరంగ మార్కెట్‌లో రూ.5100 వరకు పలికింది. సీసీఐ కేంద్రాలు సకాలంలో ప్రారంభించకపోవడంతో తడిసి రంగు మారిన పత్తిని చాలామంది రైతులు క్వింటాకు రూ.1500 నుంచి రూ.2 వేలకు దళారులకు విక్రయించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటికి.. చాలా తక్కువ మంది రైతుల వద్ద పత్తి ఉంది. కొద్దిమంది రైతులు మాత్రమే సీసీఐ కేంద్రాల్లో పత్తి దిగుబడులు విక్రయించుకున్నారు. అది కూడా పూర్తిస్థాయి మద్దతు ధర లభించలేదు. రెండో దఫా రైతులు పత్తి సేకరించే సమయానికి సీసీఐ కేంద్రాల్లో కంటే బహిరంగ మార్కెట్‌లోనే అధిక ధర వస్తుండడంతో పాటు క్వింటా పత్తి ధర రూ.6 వేలకు చేరుతుందనే ప్రచారంతో రైతులు ఎవ్వరూ పత్తి విక్రయించలేదు. ధర పెరుగుతుందనే ఉద్దేశంతో ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.5100 చెల్లిస్తామన్న



ఇవ్వలేదు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా కోటి క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లను అనధికారికంగా నిలిపివేశారు. ఈ విషయాన్ని గమనించిన దళారులు పత్తి ధరను 10 రోజుల్లోనే రూ.4300లకు తగ్గించారు. రైతులు అమ్ముదామా? ఆగుదామా? అని ఆలోచిస్తుండగానే క్వింటా ధర రూ.4300లకు పడిపోయింది. ప్రస్తుతం కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో పత్తి క్వింటా రూ.3 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పత్తికి తిరిగి ధర పెరుగుతుందా? లేక తగ్గిన ధరకే అమ్ముకోవాలా? అనే అయోమయంలో రైతులు ఉన్నారు. సీసీఐ కేంద్రాల్లో ఇప్పటికీ కొనుగోళ్లు చేపట్టినా.. తిరిగి ధర పెరిగే అవకాశం ఉంది. అలాకాకపోయినా తూకంతో పాటు ప్రభుత్వ మద్దతు ధర రూ.4320 పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో తిరిగి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే.. వేలాది మంది రైతులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికం..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం క్వింటా పత్తికి రూ.4320 మద్దతు ధరతో సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగానే సీసీఐ కేంద్రాలను తెరిచి కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉండడంతో ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధర క్వింటాకు రూ.4320 కంటే ఎక్కువ ధర పలికింది. అయినా ప్రభుత్వం మాత్రం అదే ధరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం దళారులు క్వింటా పత్తికి రూ.5100 వరకు పెట్టి కొనుగోలు చేశారు. ఫలితంగా రైతులు సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకెళ్లడంమాని ప్రైవేటుగానే పత్తిని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లను నిలిపేసింది.

హెచ్‌ఎండీఏ ప్లాట్లవేలం..!

- 229 ప్లాట్లు..1,16,046 గజాల స్థలం..
- రూ.300కోట్లు సేకరించడమే లక్ష్యం..!
- ఏప్రిల్ 9నుంచి 12 వరకు.. వేలం పాట
- ఈ-టెండర్ బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్
- ఏప్రిల్ 7 లోగా దరఖాస్తులకు అవకాశం
- హెచ్‌ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులు వెల్లడి
- ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ప్లాట్లకు త్వరలో వేలం

హైదరాబాద్‌సిటీ,మార్చి 19(మనం ప్రతినిధి): ఏప్రిల్ 9 నుంచి 12వరకు 3 రోజుల పాటు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఈ-టెండరు / ఈ- వేలం పాట జరుగుతుందని హెచ్‌ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులు తెలిపారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐటీ, మునిసిపల్ శాఖామంత్రి కల్వకుంట్ల తారక రామారావు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్‌ఎండీఏ కమిషనర్ టి. చిరంజీవు ఈ-టెండరు / ఈ- వేలం పాటకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులు మాట్లాడుతూ ఈ-టెండరు, ఈ-వేలంపాట గురించి వివరిస్తూ హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న లే అవుట్స్‌లోని ప్లాట్లు , భూములకు సంబంధించిన వివరాలు బ్రోచర్‌లో పొందుపరిచామని కమిషనర్ తెలిపారు. ఈ-టెండరు మరియు ఈ-వేలం పాటలో మొత్తం వివిధ లే అవుట్లకు1,16,046 చదరపు గజాల విస్తీర్ణముగల చెందిన 229 ప్లాట్లను వేలం వేస్తున్నట్లు వివరించారు.పారదర్శకంగా ఉండేందుకు ఈ వేలం పాట మరియు ఈ - టెండరు ప్రక్రియ ను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ- వేలం మరియు ఈ- టెండరు కు సంబంధించిన అప్లికేషన్(డాక్యుమెంటు)రు. సోమవారం నుంచి ఏప్రిల్ 7లోగా పొందవచ్చని చెప్పారు. ఈ దస్తావేజు హెచ్‌ఎండీఏ వెబ్ సైట్ నుంచి కూడా పొంద వచ్చని చిరంజీవులు తెలిపారు. ఈ వేలం / ఈ - టెండరు లో వివిధ లే-అవుట్లకు చెందిన 88 ప్లాట్లు గతంలో హెచ్‌ఎండీఏ కు గిఫ్ట్ డీడ్‌గా వచ్చినవని చెప్పారు. మిగతా 141 ప్లాట్లు గతంలో హెచ్‌ఎండీఏ లే-అవుట్లలో మిగిలిపోయినవని చెప్పారు. ఈ-వేలం మరియు ఈ-టెండరులో పాల్గొన దలిచినవారు ముందుగా 10 వేల రూపాయలు చెల్లించి తన పేరు నమోదు(రిజిస్టేషన్) చేసుకోవాలని, ఆ తరువాత తాము ఏప్లాటు కొనదలుచుకున్నారో ఆ ప్లాటుకు సంబంధించిన ఈఎండీ మొత్తాన్ని చెల్లించాన్నారు. ఆ తరువాత వేలం పాట సమయంలో ఆన్‌లైన్‌లో హెచ్‌ఎండీఏ పేర్కొన్న ఆప్షనల్ విలువ కన్నా కనీసం 100 రూపాయలు ఎక్కువ పాడాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనటం ఇష్టం లేకపోతే, ఈ-టెండరు విధానంలో కూడా కొనదలచుకున్న ప్లాటు ధరను పేర్కొనవచ్చని చెప్పారు. హెచ్‌ఎండీఏ తాను అమ్మకానికి పెట్టిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ధరకు ఒకటిన్నర రెట్ల ధర నుంచి మూడున్నర రెట్ల ధర ను ఆప్షనల్ ధర గా పేర్కొన్నదని, అది మార్కెట్ రేటు కన్నా తక్కువగానే ఉంటుందని చెప్పారు. అలాగే వేలంలో ఒకే బిడ్డరు పాల్గొంటే హెచ్‌ఎండీఏ ఆ వేలం ను రద్దు చేసి తిరిగి వేలం పాట రెండోసారి నిర్వహిస్తుందని చెప్పారు. ఏ పరిస్థితుల్లోనైనా వేలం పాట రద్దు చేసే అధికారం హెచ్‌ఎండీఏ కలిగి ఉందని చెప్పారు. ఈ-వేలంపాట కాని ఈ-టెండరు కాని మూడు రోజుల్లో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. రోజూ ఉదయం 36 మరియు మధ్యాహ్నం 36 ప్లాట్లు మొత్తం 72 ప్లాట్లు వేలం నిర్వ హించనున్నట్లు చెప్పారు. వేలం ప్రక్రియ కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎంఎస్‌టీసీ లిమిటెడ్ సంస్థ నుంచి థర్డ్‌పార్టీతో నిర్వహిస్తారని హెచ్‌ఎండీఏకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఏ ప్లాటుకు ఎవరు, ఎంతకు పాడుతున్నారు, ఎంతకు అమ్ముడుపోతాయన్న వివరాలు హెచ్‌ఎండీఏకు కూడా తెలియదన్నారు. వేలంలో ఎక్కువ ధరకు ప్లాటు పొందిన వారు వాయిదాల పద్ధతిలో కూడా ప్లాటు ధరను చెల్లించవచ్చునని చెప్పారు. ఈ-వేలం లేదా ఈ-టెండరు ద్వారా ప్లాటు సొంతం చేసుకున్న కొనగోలు దారుడు వారం రోజల లోపు ప్లాటు ధరలో 25 శాతం చెల్లించాలని చెప్పారు. ఈఎండీ ధర 10 శాతం పోను, మిగతా 65 ధరను 60 రోజులలోపు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఒకవేళ వాయిదాల ద్వారా చెల్లించాలనుకున్నా 60 రోజుల అనంతరం నిర్ధారిత వడ్డీ తో ఏడాదిలో చెల్లించవచ్చని, బ్యాంకు నుంచి రుణ సౌకర్యం పొందేందుకు కొనుగోలు దారులకు హెచ్‌ఎండీఏ అవసరమైన ప్రమాణ పత్రాన్ని జారీ చేస్తామని చెప్పారు.


ఈ టెండర్, ఈ-వేలం పాట బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్

లక్ష్యం 300 కోట్లు..

హెచ్‌ఎండీఏ ఈ-వేలం మరియు ఈ- టెండరు ద్వారా వేలం వేయనున్న 229 ప్లాట్ల ద్వారా 250 నుంచి 300 ల కోట్లు సేకరించాలని లక్ష్యం నిర్ధారించుకున్నదని కమిషనర్ టి.చిరంజీవులు చెప్పారు. రానున్న 6 నెలల కాలంలో పలు వేలం పాటలతో మరో 700 కోట్లు సేకరించనున్నట్లు చెపుతూ మొత్తం 1000 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్‌ఎండీఏ చేపట్టిన ఉప్పల్ భగాయత్ లే- అవుట్ లోని ప్లాట్లను కూడా త్వరలో వేలం ద్వారా అమ్మనున్నట్లు చెప్పారు. ప్లాట్లు పోచారం, అంతారం, దూలపల్లి, మంకల్, మామిడిపల్లి, భువనగిరి, బాచుపల్లి, జాల్ పల్లి, శంకర్‌పల్లి, ఘట్‌కేసర్, అమీన్‌పూర్ గ్రామాల్లో ప్రయివేటు లే-అవుటలకు చెందిన గిఫ్ట్ ప్లాట్లుకాగా, గోపన్‌పల్లి, నల్లగండ్ల, చందానగర్, సరూర్‌నగర్, నెక్నాంపూర్, నందగిరి హిల్స్(జూబ్లీహిల్స్), అత్తాపూర్,షేక్‌పేట్, వనస్థలిపురం, ముస్కామహల్, మైలార్ దేవ్‌పల్లి మధబన్ రెసిడెన్సియల్ కాలని, తెల్లాపూర్, మియాపూర్, మాదాపూర్ సెక్టార్-1 మాదాపూర్ సెక్టార్-3 లలో హెచ్‌ఎండీఏ కు చెందిన లే- అవుట్లు కుసంబంధించిన ప్లాట్లు వేలం వేసే వాటిలో ఉన్నాయి ఈ సారి వేలం దారులకు ఉపయోగకరంగా ఉండాలని వేలం వేయబోయే ప్లాట్లను గూగుల్ మ్యాపింగ్ తో క్రోడీకరించామని , ప్రతి ప్లాటును గూగుల్ కోఆర్డినేట్స్ తో వెబ్‌సైట్‌లో పెట్టామని కమిషనర్ చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా!

- టేకులపల్లిలో నలుగురు స్కూలు విద్యార్థుల మృతి



టేకులపల్లి,మార్చి19(మనంన్యూస్): ఈత సరదా నలుగురు పిల్లల ప్రాణంతీసింది. బడి నుంచి ఇంటికి తిరిగొచ్చే క్రమంలో ఈతకు వెళ్లాలన్న కోరిక వారి ప్రాణం మీదికి తెచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలు.. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బానోతు సిద్దు, లావుడ్య సౌజన్, బానోతు సన్వీత్, బానోతు దీలిప్‌లు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఒంటిపూట బడుల నేపథ్యంలో సోమవారం స్కూలు నుంచి మధ్యాహ్నం పూట తిరిగొస్తున్నారు. వచ్చే క్రమంలో బడి దగ్గర ఉన్న సాయమ్మ చెరువులో ఈతకు వెళ్లారు. అయితే, వారు దిగినచోట నీటి లోతు ఎక్కువగా ఉండడంతో నలుగురూ ఇరుక్కుపోయారు. నీటిలో మునిగి ఊపిరాడక చనిపోయారు. చెరువు ఒడ్డునే ఉన్న పిల్లల బట్టలను చూసిన గొడ్లకాపరులు బొమ్మనహల్లి గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు పిల్లలను వెలికితీశారు. పిల్లల మృతదేహాలను చూసి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పిల్లల మృతి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు.

మండలి ప్రశ్నోత్తరాలు..

సమావేశాలు ముగిసే లోపు న్యాయం

- భాషా పండితుల అప్‌గ్రేడేషన్‌పై కడియం

హైద రాబాద్, మార్చి 19 (మనం ప్రతినిధి): భాషా పండితుల అప్‌గ్రేడేషన్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఈ సమావేశాలు ముగిసేలోపు ఆయా టీచర్లకు న్యాయం చేస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఈ అంశంపై ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 2487 మంది భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతి మంజూరు చేస్తూ 2017 ఫిబ్రవరి 3న ఆర్థిక శాఖ జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. దీనికి వ్యతిరేకంగా కొంతమంది ఎన్‌జీటీలు హైకోర్టును ఆశ్రయించారని, నియామక నియమావళిని సవరించే వరకు స్కూల్ అసిస్టెంట్ పదవులను భర్తీ చేయవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిందని వివరించారు. సర్వీస్ రూల్స్‌పై ఉపాధ్యాయుల్లో ఏకాభిప్రాయం లేదని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో చర్చించి భాషా పండితుల అప్‌గ్రేడేషన్‌కు కృషి చేస్తామని వివరించారు.

దివ్యాంగులకు ఉచిత పాసుల్లేవ్:మహేందర్‌రెడ్డి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు వికలాంగులకు ఉచిత బస్సు పాసులను ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అయితే హైదరాబాద్, వరంగల్ నగరాల్లో సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు, వికలాంగులకు బస్సు పాసులను జారీ చేసినట్టు తెలిపారు. జిల్లాల్లో మాత్రం డీలక్స్ సర్వీసుల వరకు 2,40,560 మంది దివ్యాంగులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు.

'సాగు'లో వినూత్న మార్పులు

- బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్యే వేముల వీరేశం



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): గతంలో ఎండిన పైర్లతో అసెంబ్లీకి వచ్చేవారని.. నేడు ఆ పరిస్థితులు కనుమరుగయ్యాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో సోమవారం ఆయన మాట్లాడారు. వ్యవసాయరంగంలో సీఎం కేసీఆర్ వినూత్న మార్పులు తీసుకొచ్చారన్నారు. బడుగు, బలహీనవర్గాలు, రైతుల అభ్యున్నతి ఈ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఆరు దశాబ్దాల ఉమ్మడి పాలనా కాలంలో ఏనాడూ ఈ స్థాయిలో బడ్జెట్ రూపుదిద్దుకోలేదని తెలిపారు. దేశ ఆదాయం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందని, నేడు కేంద్రం వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. ఉమ్మడి పాలనాకాలంలో వ్యవసాయ ఉత్పత్తులు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చేవని, ప్రస్తుతం తెలంగాణలో గ్రామాల నుంచి పట్టణాలకు వ్యవసాయ ఉత్పత్తులు పంపిణీ అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 50 శాతం నిధులు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయించడం గొప్ప విషయమని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారని, దేశం అభివృద్ధి చెందడం అంటే.. పౌరుడు నైతికంగా అభివృద్ధి చెందడమన్న అంబేద్కర్ మాటలను గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను చూసి భయపడి పారిపోయిందన్నారు. గతంలో ఎంబీసీలను గుర్తించిన ప్రభుత్వమే లేదని, సీఎం కేసీఆర్ ఎంబీసీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని వేముల వీరేశం తెలిపారు.

ఎంఎంటీఎస్ రెండోదశకు నిధులెన్ని?: అక్బరుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో రెండో దశ ఎంఎంటీఎస్ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దాని అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారో తెలపాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో నేటికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఉర్దూ మీడియాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి గతంలో ఉర్దూకు ప్రత్యేక డీఎస్సీ వేస్తామని ప్రకటించి.. నేటి వరకు ఆ ఊసెత్తడం లేదని విమర్శించారు. ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యేలు ఒక్కొక్కరి నుంచి ప్రభుత్వం రూ.10 లక్షలు తీసుకుందని, ఇండ్ల స్థలాలు అయినా ఇవ్వాలని, లేకపోతే డబ్బులు వెనక్కి తిరిగి ఇవ్వాలని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన ఎప్పుడు పూర్తవుతుంది?, ఎన్ని నిధులు కేటాయించారో తెలపాలని చెప్పారు. యువత సబ్సిడీ రుణాల కోసం పడిగాపులు కాస్తోందని అక్బరుద్దీన్ పేర్కొన్నారు.


రాష్ట్రంలో 'ఉపాధి హామీ' నిర్వీర్యం

- గిరిజన రైతులకూ పెట్టుబడి సాయం
- ఎంబీసీలకు 2వేల కోట్లు ఇవ్వాలి
- ఎమ్మెల్యే సున్నం రాజయ్య డిమాండ్



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమవుతుందని, పనిదినాలను పెంచాలని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వేతనం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో సామాజికవర్గాలను పూర్తిగా విస్మరించారని, రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారని, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని తెలిపారు. ఎంబీసీలకు గతంలో రూ.వెయ్యి కోట్లు కేటాయించినా అందులో నయా పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. ఎంబీసీలకు గతంలోని రూ.వెయ్యికోట్లతో పాటు మరో రూ.వెయ్యి కోట్లు అదనంగా కేటాయించాలని కోరారు. తెలంగాణలో గిరిజనులు పది శాతం ఉన్నారని, వారికీ ఏ హామీలు అమలు చేయలేదని పేర్కొన్నారు. చేనేత, జౌళి శాఖకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని, బడ్జెట్‌లో అటవీ హక్కుల చట్టం ప్రస్తావన లేకపోవడం బాధకరమన్నారు. ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని వారి భూములకు చట్టబద్ధత కల్పించాలని పేర్కొన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఏడు రకాల దివ్యాంగులకు పింఛన్ ఇస్తున్నారని, మొత్తం 14 రకాల దివ్యాంగులకు పెన్షన్ ఇవ్వాలని గుర్తుచేశారు. షీ టీమ్‌లు హైదరాబాద్ నగరానికే పరిమితం అయ్యాయని, రాష్ట్రంలో మహిళలకు అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని చెప్పారు.

నీరా ఉత్పత్తులపై కమిటీ: పద్మారావు



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): రాష్ట్రంలో నీరా ఉత్పత్తులకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు కమి టీ నియమించామని అబ్కారీ శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. సోమవారం నాడు శాసన సభలో టీఆర్ఎస్ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బీజేపీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అడిగి న ప్రశ్నకు ఆయన బదులిస్తూ, దీనిపై పరిశీలనకు తన ఆధ్వర్యంలో ఉన్న ఈ కమిటీ త్వరలోనే శ్రీలంక, కంబోడియాను సందర్శించనుందని తెలిపారు. మహారాష్ట్ర, కేరళలో నీరా ఉత్పత్తులు చేస్తున్నారని, వారి అనుభవాలను కూడా పరిశీలిస్తామన్నారు. కల్లుగీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం హరిత హారం కార్యక్రమంలో ఇప్పటి వరకు 70 లక్షల తాటి, ఈత చెట్లను నాటించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

భారీ లక్ష్యాలతో ముందుకెళ్తున్నాం: టీఆర్ఎస్

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): బంగారు తెలంగాణ సాధన కోసం భారీ లక్ష్యాలతో టీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీలు భాను ప్రసాద్‌రావు, బోడకుంటి వెంకటేశ్వర్లు, రాములు నాయక్ తెలిపారు. సోమవారం శాసన మండలిలో బడ్జెట్‌పై వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వాల హయాంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లు జీవంలేని అంకెలు, సారంలేని గణాంకాలు, చిట్టాలు లేని పద్దులుగా ఉండేవన్నారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేవపెడుతున్నట్టు పేర్కొన్నారు. అప్పులు తెచ్చి భారీ బడ్జెట్ పెడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నారని, సుదీర్ఘమైన రాష్ట్ర అభివృద్ధి కోసమే అప్పు తెస్తున్నామని తెలిపారు. దేశానికి వెన్నుముకగా పిలుచుకునే రైతన్న ఏ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించని విధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి బడ్జెట్ కేటాయించిందన్నారు.

యునానీ ఆసుపత్రిలో ఖాళీల భర్తీకి చర్యలు

హైదరాబాద్ , మార్చి 19(మనం ప్రతినిధి): హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కాలేజీలో ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి తెలిపారు. దీనిపై ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొయినుద్దీన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ప్రభుత్వ యునానీ డిస్పెన్సరీలు, ఆసుపత్రులోల 54 వైద్య అధికారి పోస్టులు , నిజామియా టిబ్బి కాలేజీలో 8 లెక్చరర్ల పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కాలేజీలో బోధనా సిబ్బంది ఖాళీలు 49 ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ యునానీ ఆసుపత్రుల్లో డాక్టర్ల పోస్టులు 69, కాంపౌడర్ల పోస్టులు 61, నర్సింగ్ పోస్టులు 29 ఖాళీగా ఉన్నాయని మంత్రి వివరించారు.

'మే చివరికి పెట్టుబడి సాయం'

హైదరాబాద్ , మార్చి 19(మనం ప్రతినిధి): రాష్ట్రంలో 1.42 కోట్ల ఎకరాలు సాగులో ఉందని, రైతులందరికీ పెట్టుబడి సాయం చెక్కుల రూపంలో అందిస్తామని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మే చివరి నాటికి రూ.5,680 కోట్లు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ పెట్టుబడి సహాయం పట్టాదారునికే అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రైతులకు కోసం ప్రత్యేక సమావేశ హాళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా 2638 మంది ఏఈవోలతో క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ అంశంపై ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు, భూపాల్ రెడ్డి, కర్నె ప్రభాకర్, మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిచ్చారు.

రాష్ట్రంలో 364 గోదాములు: హరీశ్

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): తెలంగాణ ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 18 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యంతో 364 గోదాములను నిర్మించామని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్ రావు శాసనసభలో చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు గువ్వల బాలరాజు, చల్లా ధర్మారెడ్డి, భానోత్ మదన్ లాల్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ గోదాముల నిర్మాణం కోసం 818.14 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రతి మండలంలోనూ గోదాములు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. దీనిపై నిపుణుల కమిటీని నియమించామని చెప్పారు. కమిటీ నివేదిక వచ్చిన తరువాత దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కోల్డ్ స్టోరేజీల సంఖ్యకూడా పెంచుతామని హరీశ్ రావు వివరించారు. కాంగ్రెస్ కాలంలో గోదాములు లేకపోవడం వల్ల ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోలేకపోయారని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రస్తుతం మన గోదాములు తగినన్ని ఉండటంవల్ల ముందుగానే వీటిని నిల్వ చేసుకుని, రైతులకు సకాలంలో అందిస్తున్నామని చెప్పారు. వాణిజ్య పంటలు సాగు చేస్తున్న ప్రాంతాల్లో ఎక్కువ కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామని మంత్రి హరీశ్‌రావు సభకు వివరించారు.

12 గంటల కరెంట్ చాలు

శాసన సభలో సభ్యుల ప్రస్తావన

- నీళ్లు ఇంకిపోతున్నాయి: ఎర్రబెల్లి
- మద్దతు పలికిన స్పీకర్ మధుసూదనాచారి
- సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని వెల్లడి
- అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయం: హరీశ్







హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి):ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న 24 గంటల విద్యుత్ వల్ల బోర్లన్నీ ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని శాసన సభలో సభ్యులు అభిప్రాయపడ్డారు. తొలుత టీఆర్ఎస్ సభ్యుడు ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం శాసన సభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన వ్యవసాయానికి 12 గంటల కరెంట్ చాలని రైతులు కోరుతున్నారని, ఈ మేరకు తన నియోజక వర్గంలో అన్ని గ్రామాల్లోనూ పంచాయితీలు, మండల స్థాయిలోనూ తీర్మానాలు చేయించి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. తన నియోజక వర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందని స్పీకర్ మధసూధనాచారి కూడా అభిప్రాయపడ్డారు. తాను కూడా ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. సభలో చాలా మంది సభ్యులు కూడా తమకు కూడా 12 గంటల కరెంట్ చాలని కోరారు. 24 గంటల కరెంట్ మూలంగా రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని ఎర్రబెల్లి కోరారు. ముఖ్యమంత్రితో చర్చించి దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు.

గ్రామపంచాయితీ సిబ్బంది వేతనాలు పెంచాలి: కృష్ణయ్య

గ్రామ పంచాయితీల్లో పని చేసే కారోబార్లు, ఇతర సిబ్బంది వేతనాలు పెంచాలని టీడీపీ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కోరారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. వీరిలో సీనియారిటీ ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించాలని, విద్యార్హతలను బట్టి ప్రమోషన్లతో పాటు, వేతనాలు పెంచాలన్నారు. అందరికీ కనీస వేతనం 12 చెల్లించాలన్నారు.



ఫార్మా డీ విద్యార్థులకు న్యాయం చేయండి: సండ్ర

ఫార్మా డి విద్యార్థులకు న్యాయం చేయాలని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రభుతాన్ని కోరారు. శాసనసభ జీరో అవర్‌లో సోమవారం నాడు ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. 2008లో దేశంలో ఫార్మా డి కోర్సును ప్రవేశపెట్టిన ప్రభుత్వం వాటికి ఉన్న ఉద్యోగాలు ఏంటో గుర్తించక పోవడం వల్ల మన రాష్ట్రంలో ఈ కోర్సు పూర్తి చేసిన 12 వేల మంది విద్యార్థులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. కేరళ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు మాత్రమే ఫార్మా డీని నోటిఫై చేశాయని, అక్కడ ఉద్యోగాలు కల్పిస్తున్నారని తెలిపారు. మన ప్రభుత్వం కూడా దీనిపై కమిటీ వేసినా, ఇంత వరకు కమిటీ ఒక్క సారి కూడా సమావే శం కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఫార్మా డి విద్యార్థులను నాయయం చేయాలని సండ్ర కోరారు.

సంస్కృత భాషను కొనసాగించాలి: ఎంవీఎస్ఎస్

ఇంటర్ స్థాయిలో సంస్కృతం, అరబిక్ వంటి భాషలను కొనసాగించాలని బీజేపీ సభ్యుడు ఎంవీఎస్ఎస్ ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శాసన సభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ఇంటర్ పరీక్ష పేపర్లు దిద్దే కార్యక్రమాన్ని ఈ లెక్చరర్లు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారని చెప్పారు. ప్రభుత్వం గతంలోనూ సంస్కృత భాషా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. దీన్ని ఏర్పాటు చేసి భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఆ మంత్రులు ఇక్కడే ఉండాలి

- మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): శాసన మండలికి కేటాయించిన మంత్రులు మండలిలోనే ఉండాలని చైర్మన్ స్వామి గౌడ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రులకు తెలియజేయాలని అటవీ శాఖ మంత్రి జోగు రామన్నకు సూచించారు. సోమవారం మంత్రులు శాసన మండలిలోకి వస్తూ పోతుండడంపై స్వామిగౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో మండలికి కేటాయించిన మంత్రులు తప్పకుండా మండలిలోనే ఉండాలన్నారు. శాసన సభలో కూర్చునే బదులు మండలిలో కూర్చోవాలని సూచించారు. దీంతోపాటు మండలి సభ్యులు కూడా సమయపాలన పాటించడంలేదన్నారు. నిర్దేశిత సమయంలోగా సభ్యులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డికి చైర్మన్ సూచించారు.

50% ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే

- కేసీఆర్ కిట్‌తో మారిన పరిస్థితి: లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల 31 శాతం నుంచి 50 శాతానికి పెరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి శాసన సభలో చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు సునీత, ఆజ్మీరా రేఖ, బోడిగ శోభ, జలగం వెంకట్రావు, టీడీపీ సభ్యుడు సండ్ర, సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేసీఆర్ కిట్ పథకంలో ఇప్పటి వరకు 4,41,554 మంది ప్రయోజనం పొందారని మంత్రి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పది వేల పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటిని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, డిపార్ట్‌మెంట్ సెలక్షన్ కమిటీ ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే ఎన్‌హెచ్ఎం కింద 597 మంది వైద్యాధికారులను, 1561 మంది స్టాఫ్ నర్సులను నియమించినట్లు వెల్లడించారు. కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న గర్భిణీ స్త్రీలకు ఇబ్బంది లేకుండా 231 లేబర్ రూమ్‌లను ఆధునీకరించామన్నారు. గర్భిణీలను ఆసుపత్రికి తీసుకురావడం, ప్రసవం తరువాత ఇంటికి చేర్చేందుకు 241 అమ్మఒడి(102) వాహనాలను సమకూర్చామన్నారు. దక్షత పథకం కి ంద ఇప్పటి ఇరకు 903 మంది వైద్యులకు శిక్షణ ఇచ్చామని, ప్రసూతి సర్వీసుల కోసం మిడ్ వైఫరీ కోర్సును ప్రవేశపెట్టామని మంత్రి లక్ష్మారెడ్డి వివరించారు. సింగరేణి, ఆర్టీసీ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుపుకుంటున్న వారికి కూడా కేసీఆర్ కిట్‌ను వర్తింప చేయాలని కొత్తగూడెం శాసన సభ్యుడు జలగం వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సమాధానం చెప్పారు.

ఏప్రిల్‌లో ఉచిత కంటి పరీక్షలు

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఏప్రిల్ నుంచి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం నాడు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు అజ్మీరా రేఖ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ప్రతి గ్రామంలో కంటి వైద్య క్యాంపులు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని, కండ్ల జోళ్లు ఇస్తామని చెప్పారు. అవసరమైతే ప్రయివేట్ ఆసుపత్రులు, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆసుపత్రుల సహకారం తీసుకుంటామన్నారు.


కేసీఆర్.. అవినీతి సామ్రాజ్యాధినేత

- అవినీతిలో కాంగ్రెస్‌ను మించిన టీఆర్ఎస్
- బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణారావు

హైదరాబాద్, మార్చి 19 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి సామ్రాజ్యానికి అధినేతగా ఉన్నారని, సీఎం హోదాకు తగినట్లుగా ఆయన వ్యవహరించడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణారావు ఆరోపించారు. అవినీతిలో టీఆర్ఎస్ పార్టీ.. కాంగ్రెస్‌ను కూడా మించిపోయిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ తీరు, అవినీతి గురించి సిరిసిల్ల మునిసిపల్ చైర్మన్ సామల పావని బట్టబయలు చేశారని, ఇంతవరకు అధికార పార్టీ నుంచి ఏ ఒక్కరూ ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. టీఆర్ఎస్ దొంగతనం బయటపడగానే సామల పావనిని రాజీనామా చేయించారని, అంటే ప్రభుత్వం తప్పు ఒప్పుకొన్నట్లే కదా అని కృష్ణారావు అన్నారు. టీఆర్ఎన్ విధానాలను బట్టబయలు చేసినందుకే ఆమెను పదవి నుంచి తప్పించారన్నారు. ప్రభుత్వాన్ని అవినీతిమయం చేయడమేనా బంగారు తెలంగాణ అంటే? అని కేసీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల నుంచి మునిసిపల్ చైర్మన్లు మూడు శాతం తీసుకోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ విధానం కాదా? అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నాలుగేళ్ల కాలంలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిందని ఆయన ఆరోపించారు. ఇసుక, మట్టి, సిమెంట్, స్టీలు, ప్రైవేటు బస్సులు, కేబుల్ టీవీ ఇలా అన్నింటిలోనూ అవినీతి రాజ్యమేలుతోందన్నారు.

ఎలక్షన్ స్టంట్‌గా భారీ బడ్జెట్


- కేటాయింపులే తప్ప ఖర్చుల్లేవు
- అప్పులతో రాష్ట్రాన్ని ముంచేస్తున్నారు
- ఒక్కొక్కరి తలపై రూ.54 వేల భారం
- బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఆరోపణ



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే టీఆర్ఎస్ ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు విమర్శించారు. ఈ బడ్జెట్ అంతా అంకెల గారడీ అని ఎద్దేవా చేశారు. సోమవారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. అన్నిరంగాల్లో గత ఏడాది కంటే తాజా కేటాయింపులు ఎక్కువేనని చెప్పారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులే తప్ప పూర్తిస్థాయిలో వాటిని ఖర్చు చేయడంలేదన్నారు. జాతీయ జీఎస్‌డీపీ కన్నా ఎక్కువగా ఉందని చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్రం దేశంలో 8వ స్థానంలో ఉందన్నారు. గత బడ్జెట్‌లో ఎంబీసీలకు రూ.1000 కోట్లు కేటాయించి అందులో రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. ఇంత భారీ మొత్తంలో బడ్జెట్ కేటాయించడానికి తెచ్చిన అప్పులతో తెలంగాణలోని ప్రతి ఒక్కరిపై రూ. 54 వేల చొప్పున భారం పడుతుందని తెలిపారు. అభివృద్ధి కోసమే అప్పులు తీసుకొస్తున్నారని, ఈ అప్పును తిరిగి తీర్చే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 30వేల దళిత కుటుంబాలు ఉంటే కేవలం 9వేల మందికి మాత్రమే భూపంపిణీ చేశారని పేర్కొన్నారు. కేటాయించిన బడ్జెట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల ఇండ్లు మాత్రమే నిర్మించవచ్చని మిగిలిన ఇండ్ల పరిస్థితేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తం 2,72 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు కావాల్సి ఉందని, నాలుగేండ్లలో నిర్మించలేనిది ఏడాది కాలంలో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం నిర్మించాలన్న ఆలోచన స్వాగతించాల్సిన విషయమైనా ఆచరణలో సాధ్యంకాని మాటలతో టీఆర్ఎస్ సర్కారు ప్రజలను మభ్యపెడుతోందన్నారు. విద్యాశాఖకు దాదాపు 14 వేల కోట్లకు పైగా బడ్జెట్‌లో కేటాయించారని, అందులో రూ.12 వేల కోట్లు పాఠశాల విద్యకే కేటాయించారన్నారు. కేవలం సుమారు రూ.3 వేల కోట్లు కళశాల విద్యకు ఎలా సరిపోతుందని ఆయన ప్రశ్నించారు. చాలా గురుకులాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటిలో ఉపాధ్యాయులను నియమించలేదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువగా ఉంటేనే విశ్వవిద్యాలయాలు అభివృద్ధి చెందుతాయన్నారు. యూనివర్సిటీల్లో నాన్‌టీచింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. బడ్జెట్‌లో కేజీ టూ పీజీ ప్రస్తావన లేకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయానికి పెట్టుబడిగా ఎకరాకు రూ.8వేల చొప్పున ఇస్తామని చెబుతున్నారని, కానీ రాష్ట్రంలోని రైతులందరూ రెండు పంటలు వేయరని తెలిపారు. తెలంగాణలో పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయని, కానీ అక్కడ సరైన సౌకర్యాలు లేవన్నారు. పర్యాటక ఆదాయంతోనే చాలా దేశాలు అభివృద్ధి చెందాయని, తెలంగాణలోనూ పర్యాటక ప్రదేశాలను గుర్తించి స్థానికంగా హరిత కాకతీయ భవనాలను నిర్మించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు.

రంగుల కలగా డబుల్ బెడ్ రూం

- అటకెక్కిన దళితులకు మూడెకరాలు
- కేటాయింపులు వ్యయానికి భారీ వ్యత్యాసం
- సమగ్ర సర్వే వివరాలు వెల్లడించండి: సండ్ర



హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు రంగుల కలగా మిగిలిపోనున్నాయని టీటీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శిం చారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పారన్నారు. కానీ నేటికీ కేవలం 9 వేల ఇండ్లను మాత్రమే పూర్తిచేశారని తెలిపారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాటం తప్ప.. క్షేత్రస్థాయిలో నిర్మాణాలు లేవని, మండలానికి ఒకటీ రెండు నిర్మించి వచ్చే ఎన్నికల్లో లబ్ది పొందేందుకు టీఆర్ఎస్ సర్కారు ప్రయత్నిస్తోం దని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని, నాలుగేండ్లలో 9 వేల ఇండ్లు పూర్తిచేస్తే.. వచ్చే ఆరు నెలల్లో ఎన్ని నిర్మిస్తారని సండ్ర ప్రశ్నించారు. బడ్జెట్‌లో కేటాయింపులకు, చేసే వ్యయానికి భారీవ్యత్యాసం ఉంటోందని, అప్పుల ఆధారంతోనే రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునాటి నుంచి ఇప్పటి వరకు ప్రగతి పద్దు కింద రూ.1.99 లక్షల కోట్లు కేటాయించగా.. అందులో 1.30లక్షల కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులకు 10లక్షల మందికి భూమి పంపిణీ చేయాలని ప్రకటించి.. ఇప్పటి వరకు కేవలం 12వేల మంది లబ్ధిదారులకే భూపంపిణీ చేయడమేంటని ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌లో దళితుల భూపంపిణీకి నిధులు కేటాయించలేదని, నియోజకవర్గాల్లోఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఒక్క సీసీరోడ్డు వేసిన దాఖలాల్లేవని తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే టీచర్ల కొరత ఉందని, నాలుగేండ్లలో ఒక్క డీఎస్సీని పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయిం దని, ఉద్యోగ ఖాళీల భర్తీపై స్పష్టతనివ్వాలని పేర్కొన్నారు. పింఛన్ ఉద్యోగుల హక్కు అని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం మీద నెపం వేయకుండా రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, గతంలో తొమ్మిది సరుకులు ఇస్తే.. నేడు బియ్యం తప్ప మరేదీ ఇవ్వడం లేదని తెలిపారు.


మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, మార్చి 20

శాంతికి శ్రీకారం


'మాటలతో రెచ్చగొట్టి, చేష్టలతో చెవులు మూయడం' అమెరికాకు ఆది నుంచీ అలవాటే. అటువంటి దేశానికి డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఈ మాటలు తూలడం మరీ ఎక్కువైంది. స్వతహాగానే మాటల బేహారి అయిన ట్రంప్ ప్రెసిడెంట్‌గిరీ మొదలుపెట్టిన మొదటి రోజునుంచే వివాదాలను సృష్టించడమేకాక, వాటిని మరింత ఎగదోస్తున్నాడు. అలాంటిదే ఉత్తరకొరియాతో వివాదం కూడా. ఏడు దశాబ్దాలుగా ఏవగింపులు, హెచ్చరికలతో కొన సాగుతున్న వివాదం కాస్తా ఈయన వల్ల యుద్ధం అంచులదాకా వెళ్లింది. అణు బాంబులు వేసుకోవడానికి సిద్ధమైనట్లు కన్పించారు కూడా. అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదముండడంతో ప్రపంచమంతా ఆందోళన చెందింది. అయితే ఉ.కొరియా, అమెరికా పంచాయితీ శాంతి చర్చలవైపు సాగుతుండడం మండుటెడారిలో మంచుపవనాలు వీస్తున్నట్లయి గుబగుబలాడిన గుండెలు కుదుటపడుతున్నాయి. ఇటీవలి అంతర్జాతీయ పరిణామాల్లో అత్యంత కీలకమైన దైన ఈ శిఖరాగ్ర సమావేశం మే నెలలో జరుగనుందని వార్తలు వెలువడుతున్నాయి. దీనిలో భాగంగా ఈ నెలాఖరులోనే ఇరుదేశాల మధ్య 'ద్వితీయ శ్రేణి' నాయకత్వం మధ్య 'అణు నిరాయుధీకరణ' అంశంపై చర్చలు జరుగనుందన్న వార్త ఆశలు రేకెత్తిస్తోంది. ద్వైపాక్షిక వైరంలో భాగస్వామిగా ఉన్న దక్షిణ కొరియా ఈ చర్చలకు అవసరమైన ఏర్పాట్లను చేస్తోంది. చైనా, రష్యాలు దీన్ని స్వాగతించాయి. ఈ శాంతి ప్రక్రియకు సహాయమందిస్తానంటూ సింగపూర్ ముందుకు వచ్చింది.

రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమితో కొరియాలో వలస పాలన అంతమైంది. 1948లో కొరియా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా దేశాలుగా విడిపోయింది. ఆవెంటనే ఇరు దేశాల మధ్య 1950–53 మధ్య కాలంలో యుద్ధం జరిగింది. ఉత్తర కొరియాకు సోవియట్ రష్యా మద్దతునివ్వగా, దక్షిణ కొరియాకు అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది. అగ్రరాజ్య వ్యూహంలో భాగంగా కొరియా దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి వచ్చింది. దక్షిణ కొరియాను అమెరికా తన సైనిక స్థావరంగా చేసుకుంది. అందుకు జపాన్ కూడా అంకుల్‌శామ్‌కు వంత పాడింది. దీంతో 1998 నుంచే ఉ.కొరియా మిస్సైల్‌తో మొదలుపెట్టి తన రక్షణ కోసం ఆయుధాలను సిద్ధం చేసుకోవడం ప్రారంభించింది. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం కోసం కృషి చేస్తోంది. ఈ కారణంగా కేంద్రీకరణ అంతా ఆయుధ పాటవంపైనే ఉండడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉ.కొరియాను 'దయ్యాల దేవత'గా అమెరికా అభివర్ణిస్తూ శత్రుత్వాన్ని జాగ్రత్తగా పెంచి పోషిస్తూ వస్తోంది. సోవియట్ యూనియన్ పతనానంతరం మారిన పరిస్థితుల్లోనూ అమెరికా ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. పైపెచ్చు దాడిని పెంచింది. 'క్షుద్రదేశం'గానూ ఉ. కొరియాను వ్యవహరిస్తూ ఆంక్షలు సైతం విధించింది. 2011లో ఉ.కొరియా దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఇల్ మృతితో ఆయన కుమారుడు కిమ్ జోంగ్ ఉన్ దేశ పాలనా పగ్గాలు చేపట్టాడు. అన్ని విషయాల్లో వ్యవహరిస్తున్నట్లుగానే అమెరికా విషయంలోనూ దూకుడును పెంచాడు. హెచ్చరికలను ఏ మాత్రం లెక్కచేయకుండా ధీటుగా సమాధానమిస్తున్నాడు. చేతల్లోనూ వేగం పెంచి క్షిపణులు, రాకెట్లు రూపొందింపజేశాడు. 2013 నుంచీ అణ్వాయుధాలనూ పరీక్షిస్తూ వస్తున్నాడు. మరోపక్క అమెరికాలో ఒబామా శకం ముగిసి ట్రంప్ హయాం మొదలైంది. మధ్యప్రాచ్యంతో పాటు కొరియా ద్వీపకల్పం పైనా 'వ్యూహాత్మకం'గా వ్యవహరిస్తూ ఆ ప్రాంత శాంతికి భగ్నం కలిగించి, ప్రపంచదేశాలను సైతం అశాంతికి గురి చేస్తున్నాడు.

2017 సెప్టెంబర్‌లో ఉ.కొరియా ఆరోసారి అణుపరీక్ష నిర్వహించింది. అమెరికాకు చెందిన గుయామ్‌పై క్షిపణి దాడులు చేస్తామని ఆ సందర్భంగా ప్రకటించింది. అంతేకాదు అవసరమైతే పసిఫిక్ మహాసముద్రంలో హైడ్రోజన్ బాంబును కూడా పరీక్షిస్తామని హెచ్చరించింది. దీనికి ప్రతిగా స్పందించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమెరికాపై గానీ, దాని ఆధీనంలో ఉన్న ప్రాంతాలపై గానీ, మిత్రదేశాలపై గానీ దాడికి సాహసిస్తే తక్షణమే ఉత్తర కొరియాను సర్వనాశనం చేస్తామని ప్రకటించాడు. అంతకు ముందు కూడా ఇద్దరి మధ్యా మాటల తూటాలు పేలాయి. ఒకర్నొకరు 'నువ్వు పిచ్చోడంటే నువ్వే పిచ్చోడు...' అని దూషించుకునే స్థాయికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో జనవరిలో దక్షిణ కొరియాలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్‌లో ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ పాల్గొనడం సరికొత్త పరిణామాలకు మార్గం వేసింది. ద.కొరియా అధ్యక్షుడి ప్రయత్నంతో శాంతి చర్చల దిశగా పయనం మొదలైంది. చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకుంటారనే ప్రపంచమంతా ఆశగా ఎదురు చూస్తోంది. కానీ అమెరికా మాత్రం శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటిస్తూనే షరతులు పెట్టింది. 'ఉత్తర కొరియా అణు నిరాయుధీకరణ దిశగా ప్రయాణిస్తానంటేనే తాను చర్చలకు సిద్ధమని కొర్రీ వేసింది. దీనితో అమెరికా నైజం మరోసారి వెల్లడవడమే కాదు, ట్రంపు చిత్తశుద్ధిపైనా అనుమానాలు వస్తున్నాయి. అయినా ఈ 'శాంతి' ప్రయత్నం అగ్నిగుండాన్ని ఆపేయత్నాల్లో ముందడుగుగానే భావించాలి. ప్రపంచ శాంతికోసం ఈ పరిణామాలను ప్రతి ఒక్కరూ స్వాగతించాలి.



మంచిమాట




'విజయాన్ని నిరంతరం నిలబెట్టుకోవడమే విజేతకు ఎదురయ్యే అసలైన సవాలు'

- స్వామి వివేకానంద

అతి వేగంగా జిల్లాల అభివృద్ధికి పథకాలు!

> రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్ష, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య పరీక్ష, వారి పిల్లలకు ఆరోగ్య పరీక్ష, వ్యాక్సినేషన్, పరిస్థితులు, సందర్భాన్ని బట్టి మరికొన్ని ప్రయోజనాలు కూడా ఐ.సి.డి.ఎస్‌లో భాగమే. దీనివల్ల పథకాలను పునస్సమీక్షించడానికి వీలవుతుంది. అమలు తీరుపై కన్నా ఫలితాలపై ఆధారపడి వీటిని సమీక్షించాల్సి ఉంటుంది. పౌష్టికాహార లోపాల స్థాయిలు తగ్గాయా పెరిగాయా అన్నది పరిశీలించడానికి నెలవారీ లేదా తరచుగా సమీక్షలు జరుపుతూ ఉండాలి. దీనివల్ల పథకం కొత్త పుంతలు తొక్కడానికి అవకాశం ఉంటుంది.



సమీర్ శర్మ, ఐ.ఎ.ఎస్

సమాలోచన

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 135 జిల్లాలను ఆశయ సాధన జిల్లాలుగా ప్రకటించింది. గౌరవనీయ ప్రధానమంత్రి వీటిని ప్రకటిస్తూ, జిల్లాల వారీగా జిల్లాల ఆశయాలు, ఆకాంక్షలు, లక్ష్యాలను గుర్తించి, వాటిని మొదటి కొద్ది నెలలలోనే సాధించడానికి ప్రయత్నాలు సాగించాలని సూచించారు. ఈ జిల్లాలు 28 రాష్ట్రాలలో వ్యాపించి ఉన్నాయి. ఆరు రంగాలలో 48 సూచికలను గుర్తించి, వీటి అభివృద్ధిని పర్యవేక్షించాలని ప్రధాని భావిస్తున్నారు. ఈ ఆరు రంగాలు : ఆరోగ్యం–పౌష్టికాహారం, విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం–అనుబంధ రంగాలు, మౌలికమైన ప్రాథమిక సదుపాయాల కల్పన, ఆర్థిక సౌకర్యాలు. అభివృద్ధి చెందిన జిల్లాల మాదిరిగా కాకుండా ఈ జిల్లాలను పనితీరు ఆధారంగా మదింపు చేసి, ర్యాంకులు నిర్ణయిస్తారు. ఈ మదింపులో రెండు రకాలున్నాయి. అవి : 1) ఇందులో పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంటుంది. 2) పైన పేర్కొన్న ఆరు రంగాల ఆధారంగా సమీక్ష ఉంటుంది. ఈ ఆరు రంగాలకు సంబంధించిన పథకాలను అమలు చేసే వారి నుంచి అభివృద్ధి పథకాల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తారు. తద్వారా వీటి అమలును మరింత మెరుగుపరచడానికి కృషి జరుగుతుంది. ఇందులో పర్యవేక్షణ బాధ్యతను నీతి ఆయోగ్ స్వయంగా భుజాలకెత్తుకున్నందువల్ల, నీతి ఆయోగ్ పంథాలోనే వీటి సమీక్షను ఇక్కడ చేపట్టడం ఈ వ్యాసం ఉద్దేశం.

వీటిని ఎప్పటికప్పుడు సమర్థంగా సమీక్షించడానికి సీనియర్ అధికారులను ప్రభారీలుగా నియమించారు. ప్రభారీలు ఈ సంపూర్ణ, కూలంకష సమీక్షను ఎలా నిర్వహించబోతున్నారు? ఈ జిల్లాల సందర్శన సందర్భంగా ప్రభారీలు అక్కడి సవాళ్లను, అవకాశాలను ప్రత్యేకంగా గుర్తిస్తారు. వీటి నుంచి ఒక్కో పథకానికి ఎంత మేరకు కల్పించుకుని, ఏ మేరకు అమలు చేయాలన్నది నిర్ణయిస్తారు. జిల్లాల సందర్శనకు వెళ్లే ముందే ప్రభారీలు ఈ జిల్లాల స్వరూప స్వభావాల గురించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి సమీక్షిస్తారు. కీలక సూచికలను దృష్టిలో పెట్టుకుని, లోపాలను గుర్తిస్తారు. ఇతర దేశంలోని లేదా రాష్ట్రంలోని ఇతర అభివృద్ధి చెందిన జిల్లాలతో పోల్చి చూసుకుంటారు. చివరికి ఇవే లక్ష్యాలుగా మారుతాయి.

మూడు విధాలుగా సమాచార సేకరణ

ఇక జిల్లాలో మూడు మార్గాల నుంచి సమాచారం సేకరించడానికి క్షేత్రీయ కార్యకలాపాలు జరుపుతారు. ఈ మూడు మార్గాలు : జిల్లా అధికారులతో సంప్రదింపులు జరపడం, పరిశీలించడం, బృంద సమీక్షలు నిర్వహించడం. ఇందులో జిల్లా అధికారులతో సంప్రదింపులు జరపడంతో సమాచార సేకరణ ప్రారంభమవుతుంది. పథకాల అమలులో ఎదురయ్యే సవాళ్ల జాబితా ఈ సంప్రదింపులతో సిద్ధమవుతుంది. ఆశయాల సాధనకు ఉన్న అవకాశాలు కళ్లకు కడతాయి. కీలక సూచికలకు సంబంధించి సత్ఫలితాలు సాధించడానికి అవసరమైతే కార్యక్రమాలను, కార్యకలాపాలను మార్చడానికి అవకాశముంటుంది. ప్రస్తుతానికి, ప్రతి పథకానికి సంబంధించి, ఈ దిగువ ప్రశ్నలకు వారు సమాధానాలు కనుక్కునే ప్రయత్నం చేస్తారు. అవి :

– సూచికలకు సంబంధించి లక్ష్యాన్ని సాధించడంలో ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాం?

– తగినన్ని ఆర్థిక, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయా?

– దేశంలో లేదా రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే ప్రధాన లోపం ఏమిటి? ఎందుకు?

– ఒక్కో పథకంలో సత్వర విజయాలేమిటి? అన్నిటినీ కలపడం వల్ల సత్వర విజయాలు సాధ్యమా?


పథకాలు ఎలా అమలు జరుగుతున్నదీ ప్రభారీలు పరిశీలించాలి. పైన వేసిన ప్రశ్నలకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ధ్రువీకరించాలి. పథకాలపై వెచ్చిస్తున్న వనరులు, పథకాల ఫలితాల సాధనలో సమాచారాన్ని ప్రత్యక్షంగా సేకరించి చూసుకోవడానికి ప్రభారీలకు ఈ పరిశీలన సహాయపడుతుంది. ప్రభారీల ప్రత్యక్ష పరిశీలనకు ఫొటోగ్రఫీ కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఎందుకంటే, వారు పరిశీలించిన పథకాలను ఇది వాళ్ల కళ్లకు కడుతుంది. చివరికి ప్రభారీలు నిర్దిష్ట లబ్ధిదారులతో బృంద సమీక్షలు జరిపినప్పుడు సవాళ్లు, అవకాశాలు, ఆశయాలను పరిశీలించడానికి అవకాశం కలుగు తుంది. ఈ పథకాన్ని ఓ ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడం ఎలా అన్నదాన్ని ఇక్కడ చర్చిద్దాం.

పూర్తి స్థాయి పరిశీలన

ఈ విధంగా తాము సేకరించిన సమాచారంపై ఆధారపడి ప్రభారీలు అంశాలు, సమస్యలు, అవకాశాలను పరిశీలించి సత్వర విజయాలను సాధించడం ఎలా అన్నది ఆలోచిస్తారు. ప్రాంతీయ స్థాయిలో కార్యకలాపాలను కలిపేయాలా, ఆర్థిక, మానవ వనరులను కూడా కలిపి అమలు చేయాలా వంటి అవకాశాలను కూడా పరిశీలిస్తారు. రకరకాల జోక్యాలను, అవరోధాలను మార్గం నుంచి తొలగించడానికి దీనివల్ల అవకాశం కలుగుతుంది. జిల్లాను సంపూర్ణంగా పరివర్తన చేయడానికి ప్రభుత్వం గుర్తించిన రంగాలపై వచ్చిన సిఫార్సులతో ఓ భారీ వ్యూహం సిద్ధమవుతుంది. లక్ష్య సాధనకు ఉద్దేశించిన సిఫార్సులలో ఏం చేయాలి? (ముఖ్యంగా సత్వర లక్ష్య సాధన విషయంలో), జిల్లాలో ఎక్కడ ఎటువంటివి అమలు చేయాలి? ఎవరు చేయాలి? ఎప్పుడు చేయాలి? ఈ సిఫారసులను ఓ ప్రజా ఉద్యమంగా మలచడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ఈ సిఫారసును ఎందుకు చేశారు, ఈ సిఫారసును ఎలా అమలు చేయాలన్నది ప్రతి సిఫారసూ వివరించగలగాలి. వాస్తవ పరిస్థితుల ఆధారంగా పథకాలను అమలు చేయడానికి ఇవన్నీ తోడ్పడతాయి.

ఉదాహరణకు, పునరుత్పత్తి దశలో ఉన్న మహిళల్లో రాష్ట్ర సగటు కంటే రెట్టింపు మంది రక్తహీనత (అనీమియా)తో అవస్థలు పడుతున్నారని ఓ ప్రభారి గుర్తించాడనుకుందాం. అంతేకాక, జిల్లాలో పౌష్టికాహార లోపం వల్ల ఎక్కువ మంది పిల్లలు ఎత్తు పెరగడం లేదని, బరువు పెరగడం లేదని కూడా ప్రభారి గుర్తించాడనుకుందాం. మహిళలకు, పిల్లలకు అందవలసిన ఐ.సి.డి.ఎస్ ప్రయోజనాలు ధాన్యం చోరీ, తక్కువ మొత్తంలో ధాన్యం సరఫరా, చెడిపోయిన ధాన్యం సరఫరా కారణంగా సరిగ్గా అందకపోవడం ఇక్కడ ప్రధాన సవాలుగా కనిపిస్తోంది. అవకాశాలు ఏమిటంటే, 1) నేరుగా రేషన్ సరఫరా చేయడానికి బదులుగా అందుకు సంబంధించిన నగదు మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేయడం, 2) ఈ–కామర్స్ కంపెనీల ద్వారా తల్లులకు వారు కోరుకున్న విధంగా ధాన్యాలు ఇళ్లకే అందజేయడం.

రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్ష, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య పరీక్ష, వారి పిల్లలకు ఆరోగ్య పరీక్ష, వ్యాక్సినేషన్, పరిస్థితులు, సందర్భాన్ని బట్టి మరికొన్ని ప్రయోజనాలు కూడా ఐ.సి.డి.ఎస్‌లో భాగమే. దీనివల్ల పథకాలను పునస్సమీక్షించడానికి వీలవుతుంది. అమలు తీరుపై కన్నా ఫలితాలపై ఆధారపడి వీటిని సమీక్షించాల్సి ఉంటుంది. పౌష్టికాహార లోపాల స్థాయిలు తగ్గాయా పెరిగాయా అన్నది పరిశీలించడానికి నెలవారీ లేదా తరచుగా సమీక్షలు జరుపుతూ ఉండాలి. దీనివల్ల పథకం కొత్త పుంతలు తొక్కడానికి అవకాశం ఉంటుంది. ఈ–కామర్స్ కంపెనీల ద్వారా సరుకులు సరఫరా చేయడం వల్ల కొంత మందికి ఉపాధి లభించడానికి కూడా వీలుంటుంది.



నేరుగా రేషన్ లేదా నగదును బదిలీ చేయడమనే వ్యూహం వల్ల ఇదంతా ఓ ప్రజా ఉద్యమంగా మారడానికి అవకాశం ఉంటుంది. భారతదేశంలో ఇంటి వంట అనేది ఓ గొప్ప సంప్రదాయం. ఈ వంట సమతూకంగా, వైవిధ్యంగా ఉంటుంది. వివిధ కాలాలపై, గృహ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా కుటుంబ సభ్యులు ఈ వంటతోనే రోజును పూర్తి చేస్తుంటారు. ఈ ఆహారం నుంచి పిల్లలకు కూడా పౌష్టికాహారం అందుతుంటుంది. అందువల్ల తల్లులకే నేరుగా నగదు సౌకర్యం లభించినట్టయితే, పౌష్టికాహారాన్ని, సత్ఫలితాలను సాధించవచ్చు.

(రచయిత కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి. ప్రత్యక్షంగా సమీక్షలు నిర్వహించిన వ్యక్తి. అభిప్రాయాలు వ్యక్తిగతం)

ప్రాంతీయ సమానత్వానికే ఫెడరల్ ఫ్రంట్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలకు పైబడుతున్నప్పటికి, రాజ్యాంగ బద్ధంగా పొందుపరుచుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోవుచున్నామనే భావన సగటు భారతీయుడిలో ఉంది. జాతీయ రాజకీయాలు స్వాతంత్ర్య ఫలాలు ప్రజలం దరికీ ఆర్థికంగా, సామాజికంగా సమంగా పంచలేకపోయారనేది వాస్తవం. దేశ సంపద ఒక్కశాతం మంది చేతిలోనే ఉండి పోయింది. ధనవంతులు, కార్పొరేట్ శక్తులు రాజకీయాలను శాసిస్తూ పాలన సాగిస్తున్నారు. రాజ్యాంగ నిర్మాతలు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తొలి దశాబ్దకాలంలోనే ఆర్థికంగా, సామాజికంగా దేశప్రజలందరి వ్యత్యాసాలను రూపుమాపాలని రాసుకున్నప్పటికీ అది వాస్తవంగా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం ఇన్నాళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీల పాలనలలో చూస్తుంటిమి. కాంగ్రెస్ ఎత్తుకున్న ''గరీబీ హఠావో'' నినాదం గాలిలో కలిసింది. బీజేపీ నాలుగు సంవత్సరాల పాలనలలో సైతం నల్లధనం వెలికితీసే పేరుతో కరెన్సీ రద్దు నిర్ణయం, జీయస్‌టీ ఏక పన్ను విధానం సామాన్యున్ని కష్టాల పాలుచేసింది. అంతేకాకుండా కొత్త కరెన్సీ కూడా నల్లధనంగా మారిపోయింది. కరెన్సీ చలామణిలో లేక మధ్య తరగతి ప్రజలు అష్టకష్టాల పాలవుతున్నారు.

ధనవంతులు మాత్రం దర్జాగా వర్ధిల్లుతూ దేశ సంపదను కొల్లగొడుతున్నారు. ఈ దుర్వ్యవస్థకు మూల కారకులు గత కాంగ్రెస్, బీజేపీలే. ఈ విధానాలు మారాలంటే, సామ్యవాద లౌకిక సమసమాజ నిర్మాణానికి ఫెడరల్ భావజాలం గల రాజకీయ వ్యవస్థను నేడు జాతీయ స్థాయిలో ప్రజలు కోరుకుం టున్నారు. ఇలాంటి భావజాలం గల శక్తులు, వ్యక్తులు ఒక వ్యవస్థగా మారి ఒకచోటికి చేరి ఉమ్మడి కార్యాచరణతో ప్రజా ఎజెండా లక్ష్యంగా, నిబద్ధతలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నా య శక్తి ఫెడరల్ కూటమి అవసరం ఉంది అనేది నిజం.

భారత పౌరులు బాగుపడాలంటే చాలా వ్యవస్థలను ప్రక్షాళన చేయవలసి ఉన్నప్పటికీ అన్నింటికి మూలస్థంభం అయిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసుకొన్ననాడే ఈ దేశానికి పట్టిన దరిద్రం వీడుతుంది. పాలకులు మీరు నాయకులు కాదు ప్రజల సేవకులు, పాలేరులు అనే భావన ప్రజల్లో ఏర్పడేలా రాజకీయ పునరేకీకరణ జరగవలసి ఉంది. పార్టీ (నేత)లను మార్చి మార్చి, ప్రజలు విసుగెత్తి ఓటు వేయడానికి రావడం లేదు. అందరూ ఆ తానుముక్కలే అనుకుంటున్నారు. రాజకీయాల్లో విలువలు పెంచే రాజకీయ వ్యవస్థ రావాలి. కేంద్రంలో రాజకీయలు ఫెడరల్ ఫ్రంట్ అడుగులు పడాలని కాంగ్రెసు, బీజేపీ



యేతర పార్టీలు వారి వ్యక్తి(వ్యవస్థా)గత స్వప్రయోజనాలు వీడి ప్రజా ఎజెండాను అందరి ఐక్య ఎజెండాగా భావిస్తూ కలిసి వెళ్లాల్సి ఉంది. బహుజనుల (తాడిత, పీడితుల) పక్షాన నిలిచే కమ్యూనిష్టులతో సహా ముందు నడవాలి. గత పాలకుల విధానాల నుంచి ప్రజలను రక్షించుటకు ప్రజా ఐక్య రాజకీయ వేదిక (వ్యవస్థ) అతికీలకమైన త్యాగాలు చేయవలసిన అవసరం వచ్చిందని గమనించాలి. కమ్యూనిజం అంతిమ లక్ష్యంగాని, ఫెడరల్ భావజాలమున్న పక్షా(పార్టీ)ల లక్ష్యంగాని ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపి సమసమాజాన్ని నిర్మించడమే కదా! ప్రజలు కోరుకునే రాజకీయ మార్పు కోసం అదే జెండా (ఎజెండా)ను అందరూ చేబూనాల్సివుంది. తక్షణమే కమ్యూనిష్టు పార్టీలు వర్గపోరు వీడి ఉమ్మడి కార్యాచరణతో ఈ ఆపద కాలంలో ప్రజల పక్షాన నిలిచి, ఈ దేశానికి దిశదశ నిర్ధేశం చేసే విధానాలతో రావాలి. సిద్ధాంతాల్ని, రాద్ధాంతాల్ని భారత ప్రజల బాగోగులు కోరుకునేవారంతా త్యాగాలు చేయండి. మీ అనైక్యత మూలంగా ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు గత్యంతరం లేక వంతుల వారీగా ఓట్లు వేస్తున్నారు. ప్రజా ఫెడరల్ బావజాల ఐక్యత కోరుకునే వాడిగా ప్రజల పక్షాన వ్యాసకర్తగా అభ్యర్థిస్తున్నాను. ప్రజలు ఆశావాద దృక్పదంతో ప్రజా స్వామ్యంపై నమ్మకంతో ఓట్లు వేస్తూ వెళుతుంటే ప్రజలు ఈ సామాజిక ఆర్థిక అసమానతలు ఇంకెన్నాళ్ళు భరించాలి. మనం తెచ్చుకున్న స్వాతంత్ర్యం ధనవంతుల కోసమేనా! సహజ సంపదలు, పంచభూతాలను కార్పొరేట్ శక్తులకు అమ్మేసే విధానాలను ఆపడానికే ఫెడరల్ ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుకు ఇదే అదనుగా భావించి, ఆవశ్యకతను గమనించి ప్రజల అవసరాలు తీర్చాలి. దేశానికి పట్టెడు అన్నంపెట్టే రైతును 'తల్లిపాలు తాగి రొమ్ములను గుద్దుతున్నారని', రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న వేళ... రైతు ఆత్మహత్యలతో దేశం విలపిస్తుంది. అన్ని రకాల అవినీతి వటవృక్షానికి తల్లివేరు రాజకీయాలే, అందుకని నూతనంగా ఏర్పడబోయే ఫెడరల్ కూటమి అధికారం కోసం కాకుండా ప్రజల ఎజెండా, ప్రజల మేలు కోరే విధానాలతో ప్రజల ముందుకు రావాలి. అసాధ్యం అనుకున్న ప్రతి పనినీ ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు సాధిస్తూనే ఉంటారు. వారే విజేతలుగా నిలుస్తారు. అది ఫెడరల్ ఫ్రంట్ వల్లే జరగాలని ఆశిద్దాం.

మేకిరి దామోదర్
వరంగల్,

అస్తిత్వ ఉద్యమ స్ఫూర్తి 'రానూ'

తెలంగాణ సాయుధ పోరాటంలో లంబాడీల పరిస్థితి చాల దారుణంగా వుండేది. రజాకార్ల, పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఉద్యమకారులు మారుమూల పల్లెలైన తండాల్లో తలదాచుకొనే వారు. తండాల్లోని లంబాడీలు ఉద్యమకారులకు బాసటగా నిలిచి ఆశ్రయం కల్పించేవారు. వారి కోసం నిజాం పోలీసులు, రజాకార్లు గాలించి తండాలపై దాడికి పాల్పడేవారు. ఆ క్రమంలో వారు బంజారా స్త్రీలను, పిల్లలను నానా హింసకు గురిచేసేవారు. ఎన్నో సందర్భాల్లో అనేక మంది స్త్రీలు తమ ప్రాణా లకు ముప్పు ఉన్నదని తెలిసిన లెక్కచేయక పోరాడి, ఉద్యమకారుల ఆచూకి చెప్పకుండా ప్రాణాలు పోగొట్టుకున్నారు ఆనాటి ఉద్యమకారులు. సూర్యాపేట తాలూకా వల్లభాపురంలో భీమ్లా, వాచ్యాల ఇళ్ళు ఉద్యమకారులకు సురక్షిత ప్రదేశాలుగా ఉండేవి. ఆ ఇళ్ళలోని స్త్రీలు ఉద్యమకారులకు తమ అండ దండలను అందించారు. ఇది తెలుసుకొన్న రజాకార్లు భీమ్లా, వాచ్యాలను అరెస్ట్ చేసి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. జనగాం తాలుకా ధర్మాపురం తండా లంబాడీల భూములను విసునూరు దేశ్‌ముఖ్‌లు అన్యాయంగా ఆక్రమించుకొని దౌర్జన్యం చేయసాగారు. వారిని చిత్రహింసలకు గురిచేయడం మొదలు పెట్టారు. ఒకసారి హామూ నాయక్, అతని కొడుకు రానూ నాయక్‌ను పట్టుకోవడానికి విసునూరు దేశ్‌ముఖ్ కొడుకు బాబు దాడిచేసినప్పుడు హాము తల్లి మంగ్లీబాయి వీరోచితంగా పోరాడింది. తమను చంపినా గెరిల్లాల జాడ చెప్పమని తెగేసి చెప్పింది. ఎంతో ధైర్యసాహసాలు కలిగిన మంగ్లీ బాయి తనముందే తనవాళ్లను కాల్చి చంపినా గెరిల్లా ఆచూకీ మాత్రం చెప్పలేదు. విసునూరు బాబును తర్వాత భారత సైన్యాలు హతమార్చాయి. మంగ్లీ 1951 వరకూ జైల్లో ఉండి తర్వాత తనువు చాలించింది. బంజారాల త్యాగానికి మారుపేరని రానూ నాయక్ కుటుంబం నిరూపించింది.

కామ్రేడ్ దొడ్డి కొమరయ్యను రజాకార్లు బలిగొన్నప్పుడు గ్రామ ప్రజలకు ధైర్యం చెప్పి వాళ్ళను మళ్ళీ కూడదీసి కదిలించింది కామ్రేడ్ రానునాయక్ మరియు అతని కుటుంబ సభ్యులే. రాను కుటుంబంలోని వారంతా వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వాళ్ళే. చివరకు 20 మార్చి 1950న కామ్రేడ్ రాను నాయక్ ముండ్రాయి గ్రామంలో వీరమరణం చెందాడు. ఈ విధంగా ఎంతోమంది లంబాడీలు తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి అమరులైనారు. ఎంతోమంది అభాగ్యులు గెరిల్లా దళాలకు అండదండగా నిలిచి షెహభాష్ అనిపించుకున్నారు. అలాంటి అతికొద్ది సంఘటనలను మాత్రమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తన 'వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు' గ్రంథంలో పొందుపరిచారు. ఇంకా అనేక సంఘటనలు చరిత్రపుటలకు ఎక్కనేలేదు. ఎంతోమంది వీరబంజారాల స్మృతులు గతించిన లంబాడీల తాతలతోనే అంతరించిపోయాయి. ఇలాంటివి మరెన్నో చారిత్రక ఉద్యమ ఘటనలు మరుగున పడినాయి. మన దేశంలోని ఏ సామాజిక ఉద్యమాలను, అస్తిత్వ ఉద్యమాలను చూసినా గిరిజనుల పాత్రకీలకమైనది. 2002 సంవత్సరంలో కేంద్రంలో భారతీయ జనత పార్టీ ప్రభుత్వం హయ్యంలోను మూడు రాష్ట్రాలు ఏర్పడిన్నాయి. అవి ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ ఈ రాష్ట్రాల ఏర్పాటు కోసం గిరిజనులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండ పోరాడారు. అదే విధంగా అనేక మంది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమంలో అమరులైనారు. వెనుకడుగు వేయకుండా రాష్ట్రం ఏర్పడే వరకు ముందుండి పోరాడి రాష్ట్రాన్ని సాధించారు.


జి.శంకర్ నాయక్
ఓ.యూ. పరిశోధక విద్యార్థి


(నేడు రానూ నాయక్ వర్ధంతి)

ఇందులో ప్రచురించిన వ్యాసాలు, కథనాలు ఆయా రచయితల అభిప్రాయాలే, వీటితో సంపాదకవర్గానికి గానీ, యాజమాన్యానికి గానీ ఎలాంటి సంబంధం లేదు. – సంపాదకులు

మనం కుటుంబం
మంగళవారం, 20 మార్చి 2018
www.manamnews.com

మన ఆహారాన్ని మనకే పరిచయం చేయాల్సిన పరిస్థితుల్లో న్యూట్రిషనిస్టులు ఉన్నారు. దీనికి కారణం మనం మన సంప్రదాయ పంటలు, వంటలు మరిచిపోవడమేనని అంగీకరించక తప్పదు. మనకు ఓట్స్, అవకాడో, యాపిల్స్, బెర్రీలు వగైరాలు కావాలన్న ధ్యాసలో మనం స్థానికంగా పండించే తిండి గింజలను సేవించడం అరుదుగా మారింది. ఇప్పుడు వైద్యులు, న్యూట్రిషనిస్టులు, జిమ్ ట్రైనర్లు రాగులు, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్నలు, కొర్రలు, పాలిష్ పెట్టని బియ్యం, నువ్వులు, అవిసెలు వంటివన్నీ తినమని పదేపదే ఒత్తిడి చేస్తుంటే మళ్లీ స్థానికంగా పండే, లభించే చిరుధాన్యాలను తినడం మొదలుపెట్టాం. కారణం ఏమైనా మన భూమిలో పండి, మన వాతావరణానికి, మన శరీరానికి అనువుగా ఉండే ఆరోగ్యకరమైన తిండిని తినడం స్వాగతించదగిన పరిణామంగా గర్వంగా చెప్పుకోవలసిందే. ఒంట్లోని కొవ్వు అరగదీసేందుకు మనం ఒబేసిటీ క్లినిక్స్‌ను ఆశ్రయిస్తున్న ప్రస్తుత తరుణంలో మన ఊరు తిండి, మన స్థానిక తిండితో కొవ్వు ఇట్టే మటుమాయం అవుతుందని తెలుసుకుంటే మరీ మంచిది.







అవిసెలు తిన్నారా?



మనం మరిచిన ఫ్లాక్స్

చిన్నప్పుడు మన అమ్మమ్మలు, నాన్నమ్మలు అవిసెల పొడి, అవిసెల కారం, అవిసెల చెట్నీ చేయడం చాలామందికి లీలగానైనా గుర్తుంటుంది. కమ్మని రుచితో, ఘుమఘుమలాడే అవిసెలను చూడగానే నోరూరుతుంది. ఒక్కమారు అవిసెలు తిన్నారో వాటిని మరిచిపోవడం అసాధ్యం. మీరు సిటీల్లో పుట్టినా అవిసెలను వివిధ రూపాల్లో తినే ఉంటారు. ఉదాహరణకు మల్టీ గ్రెయిన్ బ్రెడ్, బ్రౌన్ బ్రెడ్‌లనే తీసుకొండి, కొన్ని బేకరీల్లో వీటి తయారీకి ఫ్లాక్స్ సీడ్స్‌ను ఉపయోగిస్తారు. నిగనిగ మెరుస్తూ ఉలవల్లా కనిపించేవే అవిసెలు. మీరు కూడా వీటి రుచిని ఎంజాయ్ చేశామని ఇప్పుడు గుర్తొచ్చిందా?



ఫైబర్ రిచ్

ఫ్లాక్స్ సీడ్స్ గుండెకు మంచిది, మలబద్ధకానికి మంచిది, సన్నబడేందుకు మంచిది.. ఇలా ఇన్ని రకాల మంచి చేసే అవిసెల్లో ఆఖరుకి ఏముంది? తక్కువ కెలరీలతో ఎక్కువ ఫైబర్ ఉన్న ఫ్లాక్స్ సీడ్స్‌లో పుష్కలంగా పీచు పదార్థం ఉంది. అందుకే ఇది ఆరోగ్యానికి చక్కగా తోడ్పడుతుంది. ఫైబర్‌ను జీర్ణమయ్యేలా చేయాలంటే ఎక్కువ సమయం పడుతుంది, ఎక్కువ కెలరీలు అవసరమవుతాయి, అంతేకాదు కడుపు నిండుగా ఉండే ఫీలింగ్‌ను ఇచ్చే ఫైబర్‌తో సన్నబడేందుకు, బొజ్జ సన్నబడేందుకు ఉపయోగపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు మీకు శ్రీరామరక్షగా నిలుస్తాయి.



ఎలా తినాలి?

మీ ఓపికను బట్టి అవిసెలతో వెరైటీలను చేసుకుని తినవచ్చు. ఒకవేళ పెద్దగా ఓపిక లేదు, కానీ రుచిగానే ఉంటే తింటా అంటారా? అయితే మీకో చిన్న షార్ట్ కట్ ఉంది.. వెరీ సింపుల్.. ఓ గుప్పెడు ఫ్లాక్స్ సీడ్స్ తీసుకుని పల్లీలను వేయించినట్టు వేయించండి, కాస్త ఘుమఘుమలాడేలా మాడకుండా వేయించుకుని, చల్లారాక డైరెక్ట్‌గా వాటిని నమిలి తినేయండి అంతే. ఇది నచ్చకపోతే ఇలా వేయించిన ఫ్లాక్స్ సీడ్స్‌ను మిక్సీలో వేసి పొడి చేసుకొండి. ఈ పొడిని ఒకటి లేదా రెండు స్పూన్లు మజ్జిగలో లేదా నీటిలో కలుపుకుని గుటగుట తాగేయండి. ఈ మాత్రం మీరు చేయగలిగితే సైడ్ ఎఫెక్ట్స్ లేని దివ్యౌషధాన్ని మీరు సేవించినట్టే.

ఎంత తినాలి?

3 టీస్పూన్ల ఫ్లాక్స్ ఆయిల్‌లో 7.6 గ్రాముల ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, 10 టీ స్పూన్ల ఫ్లాక్స్ సీడ్స్‌లో 7.6 గ్రాముల ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మంచిది కదా అని ఎడాపెడా లాగించేయకండి, ఎందుకంటే దీంతో నీళ్ల విరేచనాలు వచ్చే ప్రమాదముంది. అందుకే మితంగా సేవించాలి. మార్కెట్లో ఫ్లాక్స్ సీడ్స్ క్యాప్సుల్స్ కూడా వచ్చాయి. కాకపోతే ఇవి ఆరోగ్యానికి అంత మంచివి కాదు, అవిసెలు డైరెక్టుగా అందుబాటులో ఉన్నప్పుడు ఈ కృత్రిమమైనవి ఎందుకని వైద్యులు పదే పదే హెచ్చరిస్తున్నారు.

రోజూ తినండి


అవిసెలను మీ రొటీన్‌లో భాగం చేసుకోండి. ఇందుకు చేయాల్సిందల్లా ఒక్కటే అవిసెల్లోని రుచిని ఆస్వాదించడం. అచ్చం నువ్వుల్లానే రుచిగా ఉండే ఫ్లాక్స్‌ను ఉపయోగించడం ద్వారా పలు వంటలకు రుచి మరింత పెరుగుతుంది. కాబట్టి ఇవి తినడం ఏమాత్రమూ కష్టం కాదు. ప్రతినెలా సరుకులు తెచ్చుకునే సమయంలో అవిసెలను కూడా తప్పకుండా కొనేలా గుర్తుంచుకోండి. స్నాక్స్, టిఫిన్, భోజనం దేనిలోనైనా మీ అభిరుచికి తగ్గట్టు ఫ్లాక్స్ సీడ్స్ రుచులను వండుకుని నోరారా తినండి.

టేస్టీ వెరైటీస్

అవిసెల గొప్పతనం తెలుసుకున్నారు కదా, ఇక వెరైటీలు కూడా తెలుసుకుంటే మీరు ఈజీగా వీటిని సేవించవచ్చు. కుకీస్, స్మూతీ, చాక్లెట్స్‌తో కలిపి, లడ్డూల్లో, బ్రెడ్, సలాడ్స్, నట్స్‌తో వీటిని హ్యాపీగా లొట్టలేసుకుని తినవచ్చు. స్వీట్స్ అయినా హాట్ అయినా.. స్టార్టర్స్ అయినా మెయిన్ కోర్స్ అయినా కాసిన్ని ఫ్లాక్స్ సీడ్స్ జతచేసి వండితే చాలు అవి కమ్మగా ఉంటాయి. పులిహోర చేసినా, పాయసం చేసినా .. మీరు ఇంట్లో వండే దాదాపు అన్ని స్నాక్స్‌లోకి అవిసెలను చేర్చవచ్చు. ఇవి రుచికరంగా ఉండడంతో మీరు వండిన పదార్థానికి మరింత రుచి తెస్తాయని గుర్తించండి. అప్పుడు ఆరోగ్యం, రుచి అన్నీ మీ వంటింట్లోనే దక్కే అవకాశం ఉంటుంది. సర్టిఫైడ్ ఆర్గానిక్ ఫ్లాక్స్ సీడ్స్ మీల్ కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. ఇది ఖరీదు ఎక్కువ, వీటన్నింటి కంటే శుభ్రంగా అవిసె గింజలను కొని మీకు నచ్చిన రూపంలో తింటే సరిపోతుంది. డయాబెటీస్ ఉన్న వారికి కూడా ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు.. అందుకే చిన్నాపెద్దా ఇంటిల్లిపాదీ నువ్వులు, ఫ్లాక్స్ రెంటినీ ఉపయోగించడం అలవాటుగా పెట్టుకోండి. ఇక మార్కెట్లో బోలెడన్ని ఇన్‌స్టంట్ ఫ్లాక్స్ రెసిపీస్ కూడా లభిస్తున్నాయి, ఎప్పుడైనా వెరైటీ కోసం వీటిని ట్రై



చేయవచ్చు. ఇందులోని ఔషధ గుణాలకు డిమాండ్ పెరుగుతుండడంతో పిజ్జా, బర్గర్లలో కూడా ఫ్లాక్స్ సీడ్స్‌ను యాడ్ చేసి, సరికొత్త మెనూను కస్టమర్లకు అందుబాటులో ఉంచే జెయింట్ ఫుడ్ చైన్స్‌కు గిరాకీ అధికంగా ఉంటోంది. ముఖ్యంగా వ్యాయామం (జిమ్‌కు వెళ్లినా, ఇంట్లో చేసినా) చేసేవారు అవిసెలు తీసుకోవడంతో చాలా వేగంగా లావు తగ్గగలుగుతారు.



కలర్ ఆఫ్ ద ఇయర్



అమెరికాకు చెందిన 'పాన్‌టోన్' అనే కంపెనీ ఏదో ఒక రంగును ప్రతి ఏటా 'కలర్ ఆఫ్ ద ఇయర్'గా ప్రకటిస్తుంది. చాలావరకూ హాలీవుడ్ సెలబ్రిటీలు మొదలు అందరూ క్రేజీగా ఈ రంగును ఉపయోగించేందుకే వెస్ట్రన్ వరల్డ్‌లో ప్రిఫర్ చేస్తారు. అదేమంటే ఇది ఈ ఏడాది స్టైల్ అన్నమాట.



అల్ట్రా వైలెట్ థీమ్

ఈ ఏడాది అల్ట్రా వైలెట్ కలర్‌ను, కలర్ ఆఫ్ ద ఇయర్‌గా పాన్‌టోన్ అధికారికంగా ప్రకటించి రెండు రోజులు కూడా కాలేదు అప్పుడు మార్కెట్‌ను ఈ రంగు ముంచెత్తుతోంది. ఆన్‌లైన్ స్టోర్స్‌లో అల్ట్రా వైలెట్ థీమ్ బెస్ట్ డిజైన్స్, కలెక్షన్స్ అప్పుడే ఊరిస్తున్నాయి. ఫ్యాషన్ ప్రియులంతా ఈ ఏడాది అత్యధికంగా ఈ షేడ్ ఉన్న వస్తువులనే కొనటానికి ఆసక్తి చూపుతారు కనుక కన్నుల విందుగా ఉండే క్రియేటివ్ డిజైన్స్ ఈ రంగులో ప్రత్యక్షమవుతున్నాయి.

ఫ్యాన్సీ కలర్

2018 ఫ్యాన్సీ కలర్ అయిన అల్ట్రా వైలెట్ కలర్ లిప్‌స్టిక్ వేసుకున్న ఐశ్వర్య రాయ్ 2016 కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు హాజరై విమర్శలు ఎదుర్కొన్న సంగతి మరువక ముందే మళ్లీ అదే రంగు లిప్‌స్టిక్ ట్రెండ్ అయి కూర్చోవడంతో అప్పుడు విమర్శించిన వారు ఇప్పుడు నాలుక కరుచుకుంటూ, అదే షేడ్‌ను వేసుకుని తాము ఫ్యాషన్ లవర్స్ అని చాటుకునేందుకు తాజాగా ఆరాటపడుతున్నారు. ఈ ఇయర్ ఫ్యాన్సీ కలర్ అయిన అల్ట్రా వైలెట్ యాక్సెసరీస్‌నే ధరిస్తూ చెప్పులు మొదలు హెయిర్ డై వరకూ అన్నీ ఈ రంగులో ముంచెత్తేందుకు అమ్మాయిలు, అబ్బాయిలు ఆసక్తి చూపుతున్నారు.





ఇంటీరియర్స్ కూడా

హోమ్ డెకర్స్, ఇంటరీరియర్స్‌ను ట్రెండ్ కొద్దీ మార్చే ఉత్సాహవంతులు అప్పుడే తమ సోఫాసెట్ మొదలు, ఫర్నీచర్ అంతా ఇదే రంగులో ఉండేలా సెలెక్ట్ చేసుకుంటున్నారు. ఇక ఇంటీరియర్స్ అన్నీ ఈ ఫ్యాంటసీ రంగులో ఉండేలా కొత్త కలెక్షన్‌ను సెలెక్ట్ చేసుకుని, తాము కలర్ ఆఫ్ ద ఇయర్‌కు అప్‌డేట్ అయినట్టు స్టేటస్ పెడుతూ, ఫేస్‌బుక్‌లో హోం పేజ్ మొదలు మిగతా పోస్టులన్నీ ఈ కలర్ కలెక్షన్‌తో నింపేస్తున్నారు. అంతటితో ఆగని యంగ్‌స్టర్స్ తమ స్మార్ట్ ఫోన్ కవర్స్, హ్యాండ్ బ్యాగ్స్, ఐ ల్యాష్, నెయిల్ పెయింట్ ఇలా ఒక్కటేమిటి అన్నీ అల్ట్రా వైలెట్ రంగులో అద్ది తీసినట్టు నిలువెల్లా కనిపించేలా జాగ్రత్త పడుతూ ఫ్యాషన్‌పై తమ అభిరుచి చాటుకుంటున్నారు. ఇక రెడ్ కార్పెట్‌పై ఈ ఏడాది అంతా దాదాపు అల్ట్రా వైలెట్ రంగులోనే మెరిసిపోయేలా సెలబ్రిటీలు, మోడల్స్, ఫ్యాషన్ డిజైనర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మగవారు కూడా ఈ కలర్‌నే తమ ఫేవరెట్ కలర్‌గా ఎంచుకుంటుండడం హైలైట్. ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో అంత ఇదే రంగు థీమ్‌తో ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచారు. ఇండియాలో కూడా లాక్మే ఫ్యాషన్ వీక్-2018లో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు అల్ట్రా వైలెట్‌నే ప్రిఫర్ చేయడం వెనుకున్న కారణం ఏంటో మీకు ఇప్పుడు అర్థమైందా?



గ్యాడ్జెట్స్ అన్నీ...

పాన్‌టోన్ కలర్‌ను స్టైలిష్ కలర్‌గా గుర్తించే గ్యాడ్జెట్ మేకర్స్, ట్రెండీ గ్యాడ్జెట్స్‌ను మార్కెట్‌లో రిలీజ్ చేస్తున్నారు. సామ్‌సంగ్ గ్యాలక్సీ ఎస్ 9, ఎస్ 9 ప్లస్ అల్ట్రా వైలెట్ రంగులో ఉండడం వెనుకున్న రహస్యం ఇదే. ఐ ప్యాడ్స్, నోట్ ప్యాడ్స్ వంటి వాటి కవర్స్‌ను హాటెస్ట్ కలెక్షన్ కింద అల్ట్రా వైలెట్ కలర్ కేటెగెరీలో అందుబాటులోకి తెచ్చారు. నిజానికి ఒకప్పుడు ఈ రంగును అత్యధికంగా ఇష్టపడ్డవారు మహిళలే అయినప్పటికీ మారుతున్న కాలంకొద్దీ కలర్ ట్రెండ్స్‌లో కూడా మార్పులు భారీగా రావడంతో ఇలాంటి షేడ్స్‌కు మంచి రోజులు వచ్చాయి. ఏది ఏమైనా ప్రతి వస్తువు ఏదో ఒక రంగులో ఉంటుంది, కానీ ఆ రంగు క్రేజీగా ఉంటే మరింత బావుంటుంది కదూ. అన్నట్టు ఇప్పుడు రోజ్ ఫ్లవర్స్ లావెండర్ కలర్స్‌లో లభిం చడం, పలు వంటలు కూడా అల్ట్రా వైలెట్ రంగులో లభి స్తుండడం విశేషం. జ్యూస్‌లు, ఐస్ క్రీమ్‌లు, స్వీట్లు, కుకీస్ అన్నీ ఈ ఏడాదంతా ఈ రంగులోనే నోరూరిస్తాయన్న మాట.

నాలుగు వేల కోట్లకు టోకరా

(మొదటిపేజీ తరువాయి)

అరెస్ట్ చేశారు. ఈ మేరకు భవర్‌లాల్ భండారీ, ప్రేమల్ గోరగంధి, కమలేష్ కనుంగోలను అరెస్ట్ చేసినట్లు ఆర్థిక నేర పరిశోధన విభాగం అధికారులు వెల్లడించారు. వీరు బూటకపు కంపెనీల పేరిట సరుకులు సరఫరా అయినట్లు బిల్లులను, నకిలీ ఇన్‌వాయిస్‌లను సృష్టించి దాదాపు రూ.4వేల కోట్లదాకా మోసానికి పాల్పడినట్లు బ్యాంకులు ఆరోపిస్తున్నాయి. ఈ ఉదంతంలో ఆయా బ్యాంకు అధికారుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలను తోసిపుచ్చలేమని పోలీసులు తెలిపారు. కాగా, ముంబై నగరంలోని ఫోర్ట్ శాఖలో రూ.250 కోట్ల మేర మోసానికి పాల్పడిన ఈ కంపెనీ డైరెక్టర్లలో రాజేంద్ర గోథి, అమితాబ్ పరేఖ్ (2013లో మరణం), దేవాంశు దేశాయ్, కిరణ్ పారీఖ్, విక్రమ్ మోర్దానీ కూడా ఉన్నట్లు యాక్సిస్ బ్యాంకు తమ ఫిర్యాదులో తెలిపింది. అలాగే ఎస్‌బీఐ, ఐఓబీ, తదితర బ్యాంకులు పీఏఎల్‌పై ఇప్పటికే ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ దర్యాప్తు కూడా సాగుతోంది. మరోవైపు తాము దివాలా తీసే పరిస్థితిలో ఉన్నట్లు పేర్కొంటూ ఈ సంస్థ జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్‌లో 'ఆర్థిక అశక్తత' పిటిషన్ దాఖలు చేసింది. తొలుత యాక్సిస్ బ్యాంకు నుంచి మూడు దఫాలుగా రూ.125 కోట్ల మేర స్వల్పకాలిక రుణాలు తీసుకున్న ఈ సంస్థ విశ్వాసం చూరగొనే ఎత్తుగడతో ఆ రుణాలను క్రమం తప్పకుండా చెల్లించేసింది. అటుపైన 2011లో నిర్వహణ మూలధనం కోసం రూ.127.5 కోట్ల రుణం కోరుతూ పీఏఎల్ డైరెక్టర్ల బోర్డు సమావేశం తీర్మానించినట్లు అమితాబ్ పరేఖ్ ఒక లేఖను సమర్పించారు. అయితే, అలాంటి సమావేశమే జరగలేదని దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా ముడిసరుకు కొనుగోళ్లు సరఫరా చేసిన సంస్థలు కూడా కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైన దొంగ కంపెనీలని స్పష్టమైంది.

టెన్త్ పేపర్ లీక్

(మొదటిపేజీ తరువాయి)

ఓ టీచర్.. ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి వాట్సప్ ద్వారా బయటకు పంపారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాశాఖ అప్రమత్తమై.. ఎస్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. నార్పూర్ మండలంలోని తాడిహత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి ఇంగ్లీష్ ప్రశ్న పత్రం లీకైంది. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 10.30కు ప్రశ్నపత్రం బయటికి వచ్చింది. వాట్సప్‌లో పేపర్ క్లిప్పింగ్ బయటకు రావడంతో లీక్ విషయం బయటపడింది. పదో తరగతి పేపర్ లీక్ విషయం తెలిసి విద్యాశాఖ జిల్లా అధికారి(డీఈవో) జనార్థన్ రావు, ఉట్నూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డిలు తాడిహత్నూర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు తాడిహత్నూర్‌లో 240మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. అయితే, ఇంగ్లీష్ పేపర్ మొదటి పరీక్ష మొదలైన కాసేపటికే పేపర్ వాట్సప్‌లో ప్రత్యక్షమైందని వారు తెలిపారు. దీంతో లీకేజీ ఎలా జరిగిందనే విషయాన్ని పరీక్షించేందుకు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించామని వివరించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ ఎలా వచ్చిందన్న దానిపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. కేవలం ఒక్క సెంటర్‌లో మాత్రమే పేపర్ లీకేజీ కావడంతో దీన్ని మాల్ ప్రాక్టిస్ కిందే చూస్తామని, పేపర్ లీకేజీ కిందకు రాదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ భరత్ చౌహాన్‌తో పాటు ఇద్దరు డీవోలు పరీక్ష కేంద్రంలో బాధ్యుడైన ఇన్విజిలేటరుపై శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టంచేశారు. విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా నిర్వహణ అధికారులు చర్యలు తీసుకొని పరీక్ష కేంద్రంలో పోలీసులతో బందోబస్తు నిర్వహించాలని సూచించారు. వారితో పాటు మండల విద్యాధికారి ఆశన్న, సీఐ హనూక్, ఎస్సై కృష్ణకుమార్ తదితరులు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. వనపర్తి జిల్లాలోనూ టెంత్ ఇంగ్లీష్ పేపర్ లీక్ అయినట్లు సమాచారం. కాగా, ఆదిలాబాద్, వనపర్తి జిల్లాల డీఈఓలతో ఫోన్‌లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మాట్లాడారు. పేపర్ లీకైన కేంద్రాలకు సంబంధించిన సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు, విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ లీకేజీ వ్యవహారంపై నాలుగు పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి.

ఇద్దరు ఇన్విజిలేటర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లతో పాటు విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ లీకేజీ ఆయా కేంద్రాలకే పరిమితం అయ్యిందా?, ఇతర కేంద్రాల్లో క్వశ్చన్ పేపర్ వెళ్లిందా? అన్న దానిపై విచారణ కొనసాగుతోంది. విషయం తేలాకే.. పరీక్షను రద్దు చేయాలా? వద్దా? అనేది తేలనుంది. ఈ లీకేజీ తంతు ఇలా ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఒకవేళ పరీక్షను రద్దు చేస్తే.. కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఫెడ్ 'ఫ్రంట్!'



కోల్‌కతా కాళీమాత ఆలయంలో సీఎం కేసీఆర్ పూజలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సోమవారం పశ్చిమబెంగాల్ పర్యటనతో తొలి అడుగు వేశారు. ఆ రాష్ట్ర సీఎం, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ అధినేత్రి మమతా బెనర్జీతో కోల్‌కతాలో సమావేశమయ్యారు. లోక్‌సభకు 2019లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెసేతర సంయుక్త కూటమి ఏర్పాటుపై వారు లోతుగా సంభాషించారు. ఇందులో భాగంగా రెండు గంటలకుపైగా వారిద్దరి మధ్య సమాలోచన సాగింది. ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, కార్యక్రమాలు, ఇతరత్రా అంశాలపై కూలంకషంగా చర్చించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల పాలనపై ధ్వజమెత్తారు. ''పాలనపరంగా ఆ రెండు ప్రధాన పార్టీల తీరు దారుణం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలు తీర్చడంలో ఆ పార్టీల ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. స్వాతంత్ర్యానంతరం 70 ఏళ్లుగా దేశాన్నేలిన ఈ పార్టీలు సాధించిందేమిటి? అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. అదే పరిస్థితులు ఇంకా కొనసాగాలా... వీల్లేదు! దేశం ఒక అద్భుతాన్ని కోరుకుంటోంది. కాబట్టే ప్రజలు అలాంటిది చేసి చూపగల ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ దేశానికి మార్పు, పునరావిష్కరణ అత్యవసరం... ఆ మేరకు 2019 ఎన్నిలకు ముందే కొత్త కూటమి ఏర్పడుతుందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా గుణాత్మక మార్పు వైపు తొలి అడుగు పడింది. ఇది దేశ ప్రజల కోసమేనని నేను ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాను. ఈ కూటమి కేవలం కొన్ని రాజకీయ పార్టీల సమూహంగా ఉండబోదు. ఇదొక ప్రబల ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిర్భవిస్తుంది. దీన్నిగురించే మేమిప్పుడు చర్చలు ప్రారంభించాం'' అని కేసీఆర్ ప్రకటించారు. జాతీయ రాజకీయ నేపథ్యాన్ని సరికొత్తగా ఆవిష్కరించేందుకు ఈ కూటమి కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఇది భావ సారూప్యంగల నేతల సమ్మేళనంగా ఉంటుందని తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్ అన్నది ప్రాంతీయ పార్టీల కోసం కాదని, ప్రజా ప్రయోజనాలే దాని లక్ష్యమని కేసీఆర్ పునరుద్ఘాటించారు. అయితే, ఫెడరల్ ఫ్రంట్‌కు నాయకత్వం వహించేది ఎవరన్న ప్రశ్నకు జవాబు దాటవేశారు. ''ఇది సమష్టి నాయకత్వం. దీన్ని సామూహిక నాయకత్వమే నడిపిస్తుంది'' అని బదులిచ్చారు.

భవిష్యత్తులో ఇదే అతిపెద్ద కూటమి: మమత




రాబోయే ఎన్నికల నాటికి ఏర్పాటయ్యే ఈ కూటమి భవిష్యత్తులో అతిపెద్దదిగా ఆవిర్భవిస్తుందని మమతా బెనర్జీ అన్నారు. కేసీఆర్ మాట్లాడిన తర్వాత ఆమె ఈ మేరకు ప్రకటించారు. ''దేశంలో ఏక పార్టీ పాలనకు కాలం చెల్లింది. ఈ దిశగా ఇదొక ఘనమైన తొలి అడుగు. ఫెడరల్ ఫ్రంట్ ఆవిర్భావ యత్నాల ఆరంభం అద్భుతం. సామూహిక కృషిద్వారా గణనీయ రాజకీయ శక్తిగా ఈ ఫ్రంట్ ఎదగగలదు. మేం చర్చలు ప్రారంభించాం... వివిధ పార్టీలతో మాట్లాడుతున్నాం. మాకు మరింత మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నాం. ఫెడరల్ ఫ్రంట్ అత్యంత బలీయంగా ఉండాలన్నదే మా సంకల్పం. రాజకీయాల్లో కొన్నిసార్లు నాయకులు సమష్టిగా పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. టీఆర్‌ఎస్‌తో మాకు ఎప్పటినుంచో సత్సంబంధాలున్నాయి. వాటిని కొనసాగిస్తాం'' అని వెల్లడించారు. అయితే, ఫెడరల్ ఫ్రంట్‌లో కాంగ్రెస్ తనవంతు పాత్ర పోషించాలని అభిప్రాయపడుతున్నట్లు టీఎంసీ నాయకులు కొందరు చెబుతుండటం గమనార్హం. కర్ణాటకసహా కనీసం ఆరు రాష్ట్రాల్లో బీజేపీని మట్టి కరిపించగల శక్తి కాంగ్రెస్‌కు ఉందని టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ వ్యాఖ్యానించడం విశేషం.

కలసివచ్చే మిత్రులందరితోనూ చర్చలు

ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి అన్ని అంశాలనూ ఒకరిద్దరు నిర్ణయించడం సాధ్యం కాదని కేసీఆర్‌తో భేటీ అనంతరం మమత అన్నారు. తమతో కలసి నడవాలని నిర్ణయించుకున్న మిత్రులందరితో చర్చించాక మిగిలిన అంశాలను వెల్లడిస్తామని చెప్పారు. కాగా, సార్వత్రిక ఎన్నికల (2019)కు ముందే ప్రాంతీయ పార్టీలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ఆయా పార్టీల అధినేతలను కలుస్తానని కేసీఆర్ ఇంతకుముందే ప్రకటించారు. ఇందులో భాగంగా కోల్‌కతా వెళ్లిన ఆయనకు నేతాజీ విమానాశ్రయంలో పశ్చిమబెంగాల్ మంత్రి పూర్ణేందు బసు స్వాగతం పలికారు. అనంతరం మమతా బెనర్జీతో మధ్యాహ్నం 3:30 గంటలకు కేసీఆర్ సమావేశమయ్యారు. అటుపైన కోల్‌కతాలో కాళీమాత ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశాక తిరుగు ప్రయాణమై రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకున్నారు. కేసీఆర్ వెంట టీఆర్‌ఎస్ ఎంపీలు కె.కేశవరావు, కవిత కూడా ఉన్నారు. కాగా, జాతీయ స్థాయిలో మూడో కూటమి ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించిన వెంటనే మమతా బెనర్జీ ఆయనకు ఫోన్‌చేసి మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. అనంతరం భావ సారూప్యంగల పార్టీలు, నాయకులతో సంయుక్త కూటమి ఏర్పాటు దిశగా చర్చలపై దృష్టి సారిస్తామని కూడా వారు ప్రకటించారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం ఈ కూటమి ప్రణాళికలు రచిస్తుందని చెప్పారు. కాగా, బీజేపీకి సవాలు విసరగల ఉమ్మడి కూటమి ఏర్పాటుకు మద్దతు సమీకరణ కోసం మమతా బెనర్జీ నిరుటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఆలోచనలో భాగంగా శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడారు. అంతేకాకుండా ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు తమిళనాడులో డీఎంకే పార్టీ అగ్రనేత, శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు స్టాలిన్‌తోనూ చర్చించారు. అదే సమయంలో తనకెంతో సన్నిహితురాలైన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతోనూ మాట కలిపారు. కానీ, రాహుల్ గాంధీతో మాత్రం ఆమెకు పొరపొచ్చాలున్నాయి. అందుకే వారిద్దరి మధ్య సంభాషణ పలకరింపులకే తప్ప చర్చలకు దారితీయలేదు. మరోవైపు 2017 డిసెంబరులో ఆయన కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు చేపట్టినపుడు కోల్‌కతా నుంచి ఎలాంటి శుభాకాంక్షల సందేశం వెలువడకపోవడం గమనార్హం.

లక్షా నూట పదహార్లు!



(మొదటిపేజీ తరువాయి)

పథకాల కింద అందిస్తున్న సాయం భారీగా పెరిగింది. ఇకపై ఈ పథకం కింద 1,00,116 రూపాయలు సాయం అందించనున్నారు. సోమవారం అసెంబ్లీ వేదికగా సీఎం కేసీఆర్ ఈ ప్రకటన చేశారు ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి దీనిపై ఒక ప్రకటన చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆడపిల్లల తల్లిదండ్రులు, సమాజ హితం కోరే అందరి నుంచి హర్షామోదాలు వ్యక్తమవుతాయని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ పథకంలో తొలుత 51 వేల ఇచ్చే వారమని, గత ఏడాది ఈ మొత్తాన్ని 75 వేల 116 రూపాయలకు పెంచినట్లు సీఎం వివరించారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 3 లక్షల 60 వేల మంది లబ్ది చేకూరిందన్నారు. తమకు అందిన సహాయానికి సంతోషిస్తూ ఆడ పిల్లల తల్లిదండ్రులు ఆనంద బాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారని కేసీఆర్ చెప్పారు. కల్యాణ లక్ష్మి,షాదీముబారక్ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలను సాధించిందన్నారు. ఈ పథకం ప్రయోజనం పొందేందుకు ప్రభుత్వం 18 సంవత్సరాల కనీస వయస్సు పెట్టడంతో బాల్య వివాహాలను నిరోధించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతో పాటు, చట్టబద్ధత లభిస్తుండటం , ఈ పథకం సాధించిన మరో ప్రయోజనమన్నారు. పేదరికం వల్ల ఇంటి మహాలక్ష్మిగా గౌరవించే ఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించే మానసిక స్థితికి తల్లిదండ్రులు గురవుతున్నారని, ఆడపిల్ల పెండ్లి కోసం చేయాల్సిన ఖర్చుకు భయపడి కొంతమంది భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని సీఎం ఆవేదనవ్యక్తం చేశారు. కొన్ని సార్లు పేదల ఇండ్లల్లో ఆడపిల్లలు పెళ్లి కాకుండానే ఉండిపోతున్నారని, కొన్ని కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయన్నారు. పరిపాలనలో మానవీయ విలువలు అడుగడుగునా ప్రతిబింబించాలని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం, ఆడపిల్లల తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనను తీర్చాలని, ఆడ పిల్లల పెళ్లికి ఆర్థికంగా అండదండగా నిలవాలనే ఈ పథకం తీసుకు వచ్చిందని వివరించారు. ఆడపిల్లల కన్నీరు తుడిచి వారి తలపై కల్యాణ అక్షింతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ట పెంచిందని, వ్యక్తిగతంగా తన హృదయానికి ఎంతో దగ్గరైన పథకం ఇదని ముఖ్యమంత్రి చెప్పారు. తొలుత ఎస్సీ, ఎస్టీలకు కల్యాణ లక్ష్మి, మైనారిటీ వర్గాలకు షాదీ ముబారక్ పేరుతో దీన్ని ప్రారంభించినా, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాల వారికి దీన్ని వర్తింప చేయడం జరిగిందన్నారు. కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పెంచినందుకు ముఖ్యమంత్రికి మహిళా ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు బొడిగే శోభ, రేఖా నాయక్, కోవాల లక్ష్మి ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

అదే పట్టు!

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన కొనసాగించారు. సభ లోపల, బయట ఆందోళనలు కొనసాగించారు. అన్నా డీఎంకే సభ్యులు తక్షణం కావేరీ నదీజలాల బోర్డు ను ఏర్పాటుకు ఆందోళనకు దిగారు. దాంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. దాంతో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన, విభజన హామీలు అమలుకాకపోవడం లాంటి అంశాలను సభలో ప్రస్తావించడానికి వీలు కుదరలేదు. రాజ్యసభ ఉదయం సమావేశమైన పది నిమిషాలకే వాయిదా పడగా.. లోక్‌సభ తొలుత మధ్యాహ్నం వరకు, ఆ తర్వాత మంగళవారానికి వాయిదా పడింది. అవిశ్వాస తీర్మానం సహా ఏ అంశంపై అయినా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. సభ ప్రారంభం కావడానికి ముందు వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ తరపున తోట నరసింహం, గల్లా జయదేవ్ అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయం ఎటూ నిరసనలతో కొట్టుకుపోవడంతో తర్వాత జీరో అవర్ చేపట్టేందుకు సభ సమావేశం కాగానే టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే సభ్యులు ప్లకార్డులు చేతపట్టుకుని వెల్ లోకి దూసుకెళ్లారు. టీఆర్‌ఎస్ సభ్యులు రిజర్వేషన్ల కోటా పెంపును డిమాండ్ చేయగా, అన్నాడీఎంకే సభ్యులు తక్షణం కావేరీ నదీజలాల బోర్డును ఏర్పాటు చేయాలంటున్నారు. ప్రభుత్వం అవిశ్వాస తీర్మా నం సహా పలు అంశాలపై చర్చించాలను కుంటోందని, అందువల్ల ఇతర పార్టీలు ఈ చర్చలకు సహకరించాలని రాజ్‌నాథ్ కోరారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ సైతం దాదాపు 25 మందికి పైగా ఎంపీలు వెల్‌లో నినాదాలు చేస్తుండటంతో వారిని తమ స్థానాల్లోకి వెళ్లాల్సిందిగా కోరారు. తన విధులు నిర్వర్తించడానికి తాను అవిశ్వాస తీర్మానం చేపట్టాలని, కానీ సభ అదుపులో లేనందున అలా చేయలేకపోతున్నానని స్పీకర్ పదే పదే చెప్పారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ, టీఆర్‌ఎస్, అన్నాడీ ఎంకేలకు చెందిన సభ్యులు బ్యాంకింగ్ స్కాం సహా పలు అంశాలపై నిరసనలు తెలపడంతో సభ మధ్యాహ్నం వరకు వాయిదా పడింది.

రాజ్యసభలోనూ...

ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సభ్యులు తమ తమ డిమాండ్లపై గట్టిగా పట్టుబట్టడంతో రాజ్యసభ ఎలాంటి కార్య కలాపాలు చేపట్టకుండానే మంగళవారానికి వాయిదా పడింది. సభ ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీలతో పాటు కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు వెల్‌లోకి దూసుకెళ్లి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేశారు. మరోవైపు తమిళనాడుకు చెందిన డీఎంకే, అన్నాడీఎంకే సభ్యులు కూడా వెల్‌లోకి వెళ్లి కావేరీ జలాల అంశాన్ని లేవనెత్తారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై జీరో అవర్‌లో చర్చించాల్సి ఉన్నందున సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని చైర్మన్ వెంకయ్యనాయుడు పలుమార్లు కోరినా ప్రయోజనం లేకపోయింది. దాంతో పది నిమిషాల అనంతరం ఆయన సభను మంగళ వారానికి వాయిదా వేశారు. అంతకు ముందు పార్లమెంటు ఇలా పదే పదే వాయిదాలు పడటం దేశ ప్రయోజనాలు, పార్లమెంటు ప్రయోజనాల దృష్ట్యా మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నప్పుడు ఇలా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిం చారు. ఇలా ఎంతకాలం కొనసాగుతుందని, ప్రజలు ఇప్పటికే పార్లమెంటును నిశితంగా విమర్శిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వరుసగా 11వ రోజు..

పార్లమెంటు రెండోవిడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి వరుసగా 11వ రోజు కూడా నిరసనల పర్వం.. వాయిదా పర్వం కొనసాగాయి. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ, టీఆర్‌ఎస్ పార్టీలతో పాటు తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే సభ్యులు తమ తమ డిమాండ్లపై సభలో నినాదాలు హోరెత్తిస్తున్నారు. ఇటు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, అటు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ఇద్దరూ సభను అదుపులోకి తేవడంలో తమ అశక్తతను ప్రదర్శిస్తూ సభను వాయిదా వేస్తున్నారు.

పొత్తు ముచ్చట లేదు: తమ్మినేని

హైదరాబాద్, మార్చి 19 (మనం ప్రతినిధి):

టీఆర్‌ఎస్ లేదా కాంగ్రెస్ పార్టీలతో పొత్తు ముచ్చటే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో తొమ్మిది మందితో కూడిన బృందం సామాజిక న్యాయం- సమాగ్రాభివృద్ధి పేర రాష్ట్రంలో చేపట్టిన మహాజన పాదయాత్ర ముగింపు సభను సోమవారం ఎస్వీకేలో కాకి మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో బీఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందని ఈ సందర్భంగా తమ్మినేని తెలిపారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయం అవసరమే గానీ.. కేసీఆర్‌లాంటి థర్డ్‌ఫ్రంట్ కాదన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ సామాజిక న్యాయమే లక్ష్యంగా రాష్ట్రంలో ఏర్పడిన బీఎల్‌ఎఫ్ లాంటి కూటములు ఏర్పడాలన్నారు. అవన్నీ కలిపి ఒక ఫ్రంట్‌గా ఏర్పడితే మంచి రాజకీయ ప్రత్యామ్నాయం రూపొందే అవకాశం ఉందన్నారు. కేసీఆర్, చంద్రబాబు ఏర్పాటుచేసే ఫ్రంట్‌లన్నీ ప్రజలను మోసం చేసేందుకేనని విమర్శించారు. రాష్ట్రాలకు అధికారాలుండాలని, రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరిస్తోందని ఆయన ఆరోపించారు. ''నీ టర్మ్ అయిపోయింది దొరా... ఇక మా టర్మ్ రానుంది'' అంటూ సీఎం కేసీఆర్‌నుద్దేశించి ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. లాల్, నీల్ జెండాల కలయికతో టీమాస్ ముందుకు సాగుతుందని తెలిపారు. ''మన నీళ్లు, మన నిధులు, మన వనరులు, మన ఉద్యోగాలు మనకే. ఊరారా తెలంగాణ ఉద్యమంలో తిరిగాం.. చివరకు దొర గద్దెను సొంతం చేసుకున్నారు. గిదే దొరల స్వామ్యం'' అంటూ కేసీఆర్‌ను విమర్శించారు.

దేశవ్యాప్తంగా విస్తరించాలి : జిగ్నేశ్ మేవాని

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ దేశవ్యాప్తంగా విస్తరించాలని గుజరాత్ ఎమ్మెల్యే, సామాజిక కార్యకర్త జిగ్నేశ్ మేవాని ఆకాంక్షించారు. సామాజిక న్యాయంతో బీఎల్‌ఎఫ్ ఏర్పడటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కరిజం- పూలే- మార్క్స్ సిద్ధాంతాలతో సంఘ్‌పరివార్, బీజేపీల దూకుడుకు మంగళం పాడాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) రాష్ట్ర కార్యాలయాన్ని జిగ్నేశ్ ప్రారంభించారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా వామపక్ష భావజాలంతో బీఎల్‌ఎఫ్ ఏర్పడటం అభినందనీయమన్నారు. అంబేద్కర్ భావజాలం, పూలే స్ఫూర్తి, మార్క్స్ సిద్ధాంతాలతో ఏర్పడిందే బీఎల్‌ఎఫ్ అని ఫ్రంట్ చైర్మన్ సూర్యప్రకాశ్ అన్నారు. తమ్మినేని పాదయాత్ర నుంచే పుట్టిందే టీ మాస్, బీఎల్‌ఎఫ్ అని తెలిపారు. కార్యక్రమంలో నేతలు కంచ ఐలయ్య, ఊసా, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

'రద్దు'.. అమలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సంఘాన్ని జస్టిస్ బి.శివశంకరరావు ఆదేశించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజున ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించారు. ఆ సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ హెడ్‌ఫోన్‌ను విసరడంతో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ గాయపడ్డారని, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభా వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు తీర్మానం ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఆ మేరకు నిర్ణయం ప్రకటించగా... కోమటిరెడ్డి, సంపత్ హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై సోమవారంనాటి విచారణ అనంతరం వారిద్దరికీ స్వల్ప ఊరటనిస్తూ స్పీకర్ నిర్ణయాన్ని 6 వారాలపాటు అమలు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అనంతరం విచారణను ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

మాపై ఆరోపణల్లో వాస్తవం లేదు: పిటిషనర్లు

హెడ్‌ఫోన్ విసిరినప్పుడు గాయపడ్డానన్న స్వామిగౌడ్ ఆరోపణలో వాస్తవం లేదని వాదనల సందర్భంగా పిటిషనర్లు వివరించారు. గవర్నర్‌తో కలిసి ఉండగా స్వామిగౌడ్ మాట్లాడారని, ఆయనకు వీడ్కోలు కూడా చెప్పారని పేర్కొన్నారు. అయినప్పటికీ తమపై సభా గౌరవం మంటగలిపామంటూ కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తూ సభ్యత్వ రద్దు నిర్ణయం తీసుకోవడం తగదని కోర్టుకు విన్నవించారు. దీంతో మార్చి 12నాటి సదరు సంఘటనపై సభలోగల ఆరు కెమెరాల ఒరిజినల్ వీడియో ఫుటేజీని సీల్డ్ కవర్‌లో ఈ నెల 22లోగా తమ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శిని న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే ప్రతివాదులైన అసెంబ్లీ కార్యదర్శి, శాసన-న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

సభా గౌరవాన్ని మంటగలిపినందుకే: ఏజీ

మండలి చైర్మన్‌కు గాయమైందన్న కారణంతో శాసనసభ్యత్వాల రద్దు నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి తమ వాదనలో వివరించారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా సభా గౌరవాన్ని మంటగలిపినందుకే సభ్యత్వ రద్దుకు సభ నిర్ణయించిందని, తదనుగుణంగా తీర్మానం మేరకే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. రాజ్యాంగ పరిరక్షకుడైన గవర్నర్ సభలో ఉన్నపుడు సభా గౌరవాన్ని మంటగలిపితే చర్యలు తీసుకునే అధికారం సభకు ఉంటుందన్నారు. కాగా, తప్పు చేసినవారు పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో చర్యలు తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో సమర్థించిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ- సభ తీర్మానం ప్రతి ఇంతవరకూ అందలేదని పిటిషనర్లు చెప్పడాన్ని ప్రస్తావించారు. దీనిపై అది వెబ్‌సైట్‌లో ఉందని ఏజీ బదులివ్వగా... తీర్మానం ప్రతి ఇచ్చారో లేదో చెప్పాలని న్యాయమూర్తి నిలదీయడంతో తక్షణమే ఇస్తామని చెప్పారు. సభ్యులిద్దరి బహిష్కరణపై నిర్ణయాన్ని వారు ప్రశ్నించలేదు కాబట్టి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే వీలుండదని ఏజీ వాదించారు. గవర్నర్ ప్రసంగ సమయంలో వీడియోను పిటిషనర్లు కోరుతున్నప్పటికీ తమ వద్ద ఉన్నది మాత్రమే ఇస్తామని చెప్పారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాది అభ్యంతరం చెబుతూ- గవర్నర్ పక్కనే స్వామిగౌడ్ కూర్చున్నప్పుడు గాయపడ్డారని చెబుతున్నందున ఆ వీడియోను కోర్టుకు ఇవ్వాలని కోరుతున్నట్లు వివరించారు. దీంతో అందుబాటులో ఉన్న వీడియో పుటేజీలన్నింటినీ ఇస్తామని ఏజీ బదులిచ్చారు. కాగా, గవర్నర్ ప్రసంగం రోజున కాకుండా మరునాటినుంచి మాత్రమే సభ స్పీకర్ అధీనంలోకి వస్తుందని అందువల్ల 12నాటి సంఘటనలో తమపై చర్య తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉండదని కాంగ్రెస్ వాదిస్తోంది.

గెజిట్ నోటిఫికేషన్‌పై న్యాయమూర్తి ప్రశ్న

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంపై న్యాయమూర్తి ప్రశ్నించారు. అయితే, నోటిఫికేషన్ తర్వాత చర్యల బాధ్యత



కేంద్ర ఎన్నికల సంఘానిదేనని ఏజీ వివరించారు. దీంతో తమ అభిప్రాయం తెలిపేందుకు వీలుగా విచారణను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లాయర్ అవినాశ్ దేశాయ్ కోరారు. దాంతో సాయంత్రం 4 గంటలకు తిరిగి విచారణ ప్రారంభం కాగా పది రోజులపాటు ఎన్నికల నోటిఫికేషన్‌పై నిర్ణయం తీసుకోరాదని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ సందర్భంగా చట్టసభ సభ్యుల అనర్హత వేటు పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి సుప్రీంకోర్టు లోగడ కేంద్ర ఎన్నికల సంఘం-భజరంగ్ బహదూర్‌సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ప్రతిని ఈసీ లాయర్ అందజేశారు.

పుతిన్‌కే పట్టం



రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి ఎన్నిక.. 76% ఓట్లతో రికార్డు విజయం

మాస్కో, మార్చి 19: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ (65) తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకున్నారు. ఆ దేశ ప్రజలు పుతిన్‌కే మళ్లీ పట్టం కట్టారు. రష్యా అధ్యక్షుడిగా ఆయన వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకంగా 76.67 శాతం ఓట్లతో రికార్డు విజయం సాధించారు. పుతిన్ సమీప ప్రత్యర్థి, కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పావెల్ గ్రుడినిన్‌కు కేవలం 11.79 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. సోమవారం రష్యా ఎన్నికల సంఘం అధికారికంగా ఈ విషయం ప్రకటించింది. మరో ఆరేళ్ల పాటు అంటే 2024 వరకూ పుతిన్ పదవిలో కొనసాగనున్నారు. 19 ఏళ్ల క్రితం 1999లో ఆయన తొలిసారిగా దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. సోవియెట్ నియంత జోసెఫ్ స్టాలిన్ తర్వాత రష్యాను సుదీర్ఘ కాలం పాలించిన నేత పుతిన్ కావడం విశేషం. ఆదివారం జరిగిన ఎన్నికల్లో 99.80 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పుతిన్‌తో పాటు మరో ఏడుగురు అభ్యర్థులు బరిలోకి దిగారు. అయితే న్యాయపరమైన కారణాలతో పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీ బరిలో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో పుతిన్ ఎన్నిక లాంఛనప్రాయమైంది. మొత్తం 10.70 కోట్ల మందికి పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పుతిన్ భారీ ఆధిక్యంతో ఘనవిజయం సాధించగా, సమీప అభ్యర్థి గ్రుడినిన్ దరిదాపులకు కూడా రాలేదు. ఇక అతివాద జాతీయవాద ఫైర్‌బ్రాండ్ వ్లాదిమిర్ జిరినోవికీకి 5.66 శాతం, మాజీ రియాల్టీ టీవీ సమర్పకుడు సెనియా సోబ్‌చక్‌కు 1.67 శాతం, సీనియర్ రాజకీయ నేత గ్రిగోరి యవ్లిన్‌కీకి 1 శాతం ఓట్లు వచ్చాయి. కాగా ఎన్నికలు, ఫలితాల్లో రిగ్గింగ్ జరిగిందని, మోసం చేశారని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణల్ని పుతిన్ కొట్టిపారేశారు. ప్రజలకు తనపై ఉన్న నమ్మకానికి, విశ్వాసానికి ఈ ఎన్నికలు నిదర్శనమని అనారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తరహాలో జీవితకాలం రష్యా అధ్యక్షుడిగా కొనసాగుతారన్న ఊహాగానాలను పుతిన్ తోసిపుచ్చారు. ఈ వ్యాఖ్యలు హాస్యాస్పదమని అన్నారు. 'నాకు 100 ఏళ్లు వచ్చే వరకూ నేనే పదవిలో కొనసాగుతానా? లేదు' అని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా పండుగ వాతావరణం ప్రతిబింబించేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద సెల్ఫీ పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్, చిన్నారుల వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తప్పనిసరిగా ఓటు వేసేలా ఒత్తిడి తెచ్చినట్టు వార్తలు వెలువడ్డాయి. పుతిన్‌కు ప్రపంచ దేశాధినేతలు అభినందనలు తెలిపారు శాంతి కోసం పుతిన్‌తో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మడురో, బొలీవియా అధినేత ఈవో మోరలెస్ పుతిన్‌కు అభినందనలు తెలిపారు.

రెండోసారి లీ కెకియాంగ్



చైనా ప్రధానిగా ఎన్నిక.. 26 మందితో కొత్త కేబినెట్

చైనా మిస్సైల్ మ్యాన్‌కు రక్షణ శాఖ బాధ్యతలు.. విదేశాంగ మంత్రిగా వాంగ్

బీజింగ్, మార్చి 19: చైనా ప్రధానమంత్రిగా లీ కెకియాంగ్ వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. అధికార కమ్యూనిస్టు పార్టీలో రెండో స్థానంలో ఉన్న లీ (62) మరో ఐదేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. చైనా అధ్యక్షుడిగా నిరవధికంగా తానే కొనసాగేలా రాజ్యాంగంలో మార్పులు చేసుకున్న జిన్‌పింగ్ చేసిన ప్రతిపాదన మేరకు లీ ప్రధానిగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడి ప్రతిపాదనను ఆ దేశపు రబ్బరుస్టాంప్ పార్లమెంటు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆదివారం ఆమోదించింది. అనంతరం ప్రధాని లీ తన నూతన కేబినెట్‌లో కొలువు దీరారు. నలుగురు ఉప ప్రధానులుగా హాన్ జెంగ్, సన్ చున్‌లాన్, హూ చున్‌హువా, ల్యూ హేలు సహా మొత్తం 26 మందితో తన కేబినెట్‌ను నియమించుకున్నారు. దీనికి సంబంధించి కూడా పార్లమెంటులోని 3 వేల మంది సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దేశ ప్రధానిగా ఉన్న లీ ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్నారు. విదేశాంగ శాఖ మంత్రిగా వాంగ్ యీ (65)ని నియమించారు. ఆయనను స్టేట్ కౌన్సిల్‌గానూ ఎన్నుకొన్నారు. ఇది విదేశాంగ మంత్రిత్వ బాధ్యతల కన్నా పెద్ద పదవిగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా వర్గాలు పేర్కొంటున్నారు. చైనా ప్రభుత్వ విధివిధానాలు దారి తప్పకుండా చూడాల్సిన బాధ్యత ఈ స్టేట్ కౌన్సిలర్లపై ఉంటుంది. ఇక ఆ దేశ మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన లెఫ్టినెంట్ జనరల్ వీ ఫెంఘ్(63)ను రక్షణ శాఖ మంత్రిగా నియమించారు. చైనా మిటలరీని అత్యాధునిక ఆయుధ సంపత్తితో బలోపేతం చేయడంలో ఆయన పాత్ర ఎంతో ఉంది. గతంలో చైనా ఆర్మీ మిస్సైల్ యూనిట్ కమాండర్‌గా పని చేసిన ఆయన అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయనకు తొలి అతిథిగా భారత రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ కానున్నారు. డోక్లాం సమస్యపై చర్చించేందుకు వచ్చే నెలలో చైనా వెళ్లనున్నట్లు ఆమె ఇటీవల ప్రకటించారు. ఇదిలా ఉండగా, ప్రధాని లీ తన కేబినెట్‌లో కొన్ని సంస్కరణలనూ చేపట్టారు. ఇప్పటి వరకు వేర్వేరుగా ఉన్న చైనా సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖలను విలీనం చేశారు. కాగా, చైనా నూతన అవినీతి నిరోధక వ్యవస్థ (జాతీయ పర్యవేక్షణ కమిషన్)కు అధిపతిగా ఆ దేశ పార్లమెంటు ఆదివారం యాంగ్ షియోడును ఎన్నుకుంది. పర్యవేక్షణ మంత్రిగా కొనసాగుతున్న యాంగ్ అధికార పార్టీ నేతృత్వంలోని అవినీతి నిరోధక వ్యవస్థ (సీసీడీఐ)కు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆర్థిక సంస్కరణవేత్తగా పేరొందిన యీ గాంగ్‌ను చైనా సెంట్రల్ బ్యాంకు (పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా) గవర్నర్‌గా నియమించారు. చైనాను ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడంలో కీలకంగా వ్యవహరించిన షియోచౌన్ స్థానాన్ని గాంగ్ భర్తీ చేస్తున్నారు. పదిహేనేళ్లుగా గవర్నర్‌గా చేసిన షియోచౌన్ వద్ద గాంగ్ డిప్యూటీ గవర్నర్‌గా ఉన్నారు.



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల బీభత్సం

- **6 వాహనాలకు నిప్పు.. కాంట్రాక్టర్ కొడుకు హత్య**



రాయ్‌పూర్, మార్చి 19: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. తుంనార్ కోయిట్ పల్లి మధ్య రహదారి నిర్మాణంలో వినియోగిస్తున్న ఆరు వాహనాలను తగులబెట్టడంతో పాటు రోడ్ కాంట్రాక్టర్ కొడుకు విశాల్ కుమార్‌ను హత్యచేశారు. వాస్తవానికి..ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయొద్దని గత నెలలోనే కాంట్రాక్టర్‌కు మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగిస్తుండటంతో.. ఆదివారం రాత్రి దాడికి దిగారు.జ బస్తర్ జిల్లా మారుడూమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధానమంత్రి సడక్ నిర్మాణ్ యోజనలో భాగంగా రోడ్డును నిర్మిస్తున్నారు. మొదకాపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భటపల్లి– సంకనపల్లి రహదారి నిర్మాణంలో వినియోగిస్తున్న వాహనాలకు మావోయిస్టులు నిప్పు పెట్టారు. ఈ దాడిలో 100 మంది వరకు మావోయిస్టులు పాల్గొన్నట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా.. కొండగావ్ జిల్లాలో పది మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు.



లింగాయత్ ప్రత్యేక మతమే

- **గుర్తించిన కర్ణాటక ప్రభుత్వం**
- **ఆమోదించాలని కేంద్రానికి విజ్ఞప్తి**

బెంగళూరు, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద సంఖ్యలో ఉన్న లింగాయత్‌ల ఓట్లను కొల్లగొట్టే దిశగా అడుగు ముందుకేసింది. లింగాయత్‌ను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ కర్ణాటక మంత్రివర్గం సోమవారం తీర్మానించింది. ఈ మేరకు సిఫారసును కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. లింగాయత్‌లకు ప్రత్యేక మతం హోదా ఇవ్వాలన్న జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫారసును సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదించింది. అనంతరం మంత్రి, లింగాయత్ నేత ఎంబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ.. లింగాయత్‌లపై కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. '' లింగాయత్‌లు హిందువులు కాదని ఎప్పటి నుంచో చెబుతున్నాం. ఇప్పుడు మా డిమాండ్ ఓ తార్కిక ముగింపు దిశగా అడుగు వేసింది. కేంద్రం కూడా దీనిని ఆమోదిస్తుందని భావిస్తున్నాం'' అని పాటిల్ పేర్కొన్నారు. అయితే ఆరెస్సెస్ ఇప్పటికే ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది హిందూ మతాన్ని చీల్చే చర్యే అవుతుందని ఆరెస్సెస్ స్పష్టంచేసింది. బీజేపీ కూడా తీవ్ర విమర్శలు గుప్పించింది. లింగాయత్‌ల ఓట్లను ఆకర్షించే చర్య ఇదని, కాంగ్రెస్ సమాజాన్ని చీల్చుతున్నదని బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్ విమర్శించారు. అయితే.. కర్ణాటకలో బీజేపీకి లింగాయత్‌ల మద్దతు పెద్ద ఎత్తున ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో బీజేపీ చిక్కుల్లో పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మతాన్ని లింగాయత్‌గా పిలవాలని కొందరు, వీరశైవ లింగాయత్‌గా పిలవాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. నిపుణుల కమిటీ మాత్రం లింగాయత్‌గా పిలవాలని సిఫారసు చేసింది. లింగాయత్‌లు 12వ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త బసవేశ్వరుని అనుచరులు.

మోదీ ముక్త్ భారత్: రాజ్‌ఠాక్రే

ముంబై, మార్చి 19: ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చే ఎన్నికలలో మోదీ ముక్త భారత్ కోసం కృషిచేయాలంటూ మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే పిలుపునిచ్చారు. ఆదివారం సెంట్రల్ ముంబైలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీలతో దేశ ప్రజలు విసుగుచెందారని తెలిపారు. భారతదేశానికి 1947లో మొదటిసారి స్వాతంత్ర్యం వచ్చిందని, ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత 1977లో నిర్వహించిన ఎన్నికలలో మరోసారి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. రేపు రాబోయే 2019 ఎన్నికలలో మోదీ ముక్త భారత్ ఏర్పడితే మూడో స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు.

ఒకే క్లిక్‌తో బర్త్ సర్టిఫికెట్!

ఆన్‌లైన్ దరఖాస్తు ద్వారా 15 రోజుల్లో ఇంటికే.. తొలగనున్న పౌరుల కష్టాలు

- **సివిల్ రిజిస్ట్రేషన్ పాలసీని ప్రవేశపెట్టిన కేంద్రం**

న్యూఢిల్లీ, మార్చి 19: ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు ప్రభుత్వం నుంచి ఎలాంటి సేవలు పొందాలన్నా.. ప్రతి ఒక్కరికీ జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారింది. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలోనూ బర్త్ సర్టిఫికెట్ లేకుండా ఎలాంటి పని ముందుకు సాగదు. ఇలాంటి జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందాలంటే అవస్థలు తప్పడం లేదు. ఓ వ్యక్తి మరణించిన తరువాత అతడికి సంబంధించిన ఆస్తులు, వారసత్వంపై లీగల్ ఆథారిటీ పొందాలంటే.. ఆ వ్యక్తి చనిపోయినట్లు ప్రభుత్వం జారీచేసిన మరణ ధ్రువీకరణ పత్రం ఉండాలి. అయితే ప్రస్తుతం ఈ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకోసం ప్రజలు నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే అదునుగా దళారులు జేబులు నింపుకుంటున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రం పొందలంటే రూ.3 వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తూ.. కేంద్రం ప్రభుత్వం సివిల్ రిజిస్ట్రేషన్ పాలసీ (సీఆర్ఎస్) విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా జనన, మరణ ధ్రువీకరణపత్రాలు ఇంటివద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు.. 15 రోజుల్లో పత్రాలు అందజేస్తారు. ప్రభుత్వం నుంచి అందించే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుంది.

రిజిస్ట్రేషన్ ఇలా...


కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఆర్ఎస్ విధానంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సులభంగా పొందవచ్చు. దీనికోసం ముం దుగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఆర్ఎస్ఓఆర్‌జీ.జీఓఐ.ఇన్ వైబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. అందులో జనన లేదా మరణ ధ్రువీకరణకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. 15 రోజుల వ్యవధిలో విచారణ ప్రక్రియ పూర్తిచేసి ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రేషన్ వివరాల్లో పొందుపరిచిన అడ్రస్, ఈ మెయిల్‌కు పంపిస్తారు. 15 రోజుల్లో పత్రాలు అందక పోతే ఇదే వైబ్‌సైట్ ద్వారా 'సర్టిఫికేషన్ డిలే'కు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. అప్రూవల్ అయితే సీఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారానే సర్టిఫికెట్‌ను పొందే అవకాశం ఉంది.



లాలుకు మరో షాక్

- **నాలుగో కేసులోనూ దోషిగా నిర్ధారణ**
- **డిసెంబరు నుంచి జైల్లో ఆర్జేడీ అధినేత**
- **తాజా కేసులో 19 మంది దోషులు**
- **జగన్నాథ మిశ్రా సహా పలువురు నిర్దోషులు**
- **కోర్టు వద్ద పెండింగులో 139 కోట్ల కేసు**

రాంచీ, మార్చి 19: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్‌కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. దాణా స్కాంకు సంబంధించిన నాలుగో కేసులో కూడా సీబీఐ ప్రత్యేక కోర్టు లాలును దోషిగా తేల్చింది. మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రాను మాత్రం నిర్దోషి అని చెప్పింది. ఈ కేసులో లాలు (69)తో పాటు మరో 18 మందిని దోషులుగా తేల్చి, 12 మందిని నిర్దోషులని సీబీఐ జడ్జి శివపాల్ సింగ్ తీర్పు చెప్పారు. మరో రెండు రోజుల్లో శిక్షపై వాదనలు వినడం ప్రారంభిస్తారు. 1990ల తొలినాళ్లలో డుమ్కా ఖజానా నుంచి రూ. 3.13 కోట్లు అక్రమంగా డ్రా చేసుకున్న కేసులో తాజాగా లాలు, ఇతరులను దోషులుగా నిర్ధారించారు. ఈ తీర్పుపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని లాలు చెప్పగా, తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని పార్టీ ఉపాధ్యక్షుడు రఘువంశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. లాలు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన దాణా స్కాంకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసుల్లో ఇప్పటికి నాలుగింటిలోనూ లాలు దోషిగా తేలారు. దేవ్‌గఢ్ ఖజానా నుంచి డబ్బు డ్రా చేసిన కేసులో శిక్ష కూడా నిర్ధారణ కావడంతో గత సంవత్సరం డిసెంబరు 23 నుంచి ఆయన రాంచీలోని బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఐదేళ్ల జైలుశిక్ష పడటంతో లోక్‌సభ నుంచి అనర్హత వేటు పడటంతో పాటు.. జైలు శిక్ష ముగిసిన తర్వాత ఆరేళ్ల పాటు ఎన్నికలలో పోటీ చేయడానికి కూడా వీల్లేకుండా పోయింది. దాణా స్కాంలో మొత్తం 47 మంది నిందితులున్నారు. వారిలో 14 మంది విచారణ సమయంలో మరణించగా, ఇద్దరు అప్రూవర్లుగా మారారు. లాలుకు తొలి కేసులో మూడున్నరేళ్లు, రెండో కేసులో ఐదేళ్ల శిక్ష పడింది. మరో మాజీ సీఎం జగన్నాథ మిశ్రా రెండు కేసుల్లో దోషిగాను, మరో రెండు కేసుల్లో నిర్దోషిగాను తేలారు. సోమవారం నాటి కేసుల ప్రజాపద్దుల కమిటీ మాజీ చైర్మన్లు జగదీశ్ శర్మ, ధ్రువ భగత్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌కే రాణా, మాజీ మంత్రి విద్యాసాగర్ నిషాద్ నిర్దోషులుగా ఊరట పొందారు. ఆదాయపన్ను శాఖ మాజీ కమిషనర్ ఏసీ చౌదరి, మాజీ ఐఏఎస్ అధికారులు బెక్ జూలియస్, మహేశ్ ప్రసాద్, మాజీ డివిజనల్ కమిషనర్ ఎంసీ సుబర్నో కూడా నిర్దోషులని సీబీఐ కోర్టు చెప్పింది. మరో మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌ను మాత్రం దోషి అని నిర్ధారించింది. రాంచీలోని దొరాండా ఖజానా నుంచి రూ. 139 కోట్లను అక్రమంగా డ్రా చేసుకున్న కేసు మాత్రం ఇంకా కోర్టులో పెండింగులో ఉంది.



వారి విడుదల అసంబద్ధం

- **రాజా.. కనిమొళిలకు ఊరట సరికాదు**
- **2జీ కేసు తీర్పుపై సీబీఐ సవాలు**

న్యూఢిల్లీ, మార్చి 19: టెలికం శాఖ మాజీమంత్రి రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళి తదితరులను 2జీ స్పెక్ట్రం కేటాయింపుల స్కాం కేసులో విడుదల చేయడాన్ని సీబీఐ సవాలు చేసింది. వారిపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయంలో సీబీఐ ఘోరంగా విఫలమైందంటూ సీబీఐ ప్రత్యేక కోర్టు గత సంవత్సరం డిసెంబరులో రాజా, కనిమొళి తదితరులను నిర్దోషులుగా విడుదల చేసిన విషయం తెలిసిందే. స్పెక్ట్రం కేటాయింపు విషయంలో టెలికం కంపెనీల నుంచి లంచాలు తీసుకున్న రాజా.. వారికి కారుచవగ్గా స్పెక్ట్రం వచ్చేలా చేయడంతో ఖజానాకు రూ. 1.76 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ ఆరోపించింది. కానీ ప్రాసిక్యూషన్ తన ఆరోపణలను రుజువు చేయడంలో ఘోరంగా విఫలమైందని చెప్పడానికి తాను ఏమాత్రం మొహమాటపడటం లేదని సీబీఐ జడ్జి ఓపీ సైనీ తన తీర్పులో పేర్కొన్నారు. 2010లో వచ్చిన ఆరోపణల కారణంగా రాజా తన మంత్రిపదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది, 15 నెలల పాటు ఆయన జైల్లో కూడా ఉన్నారు. తాజాగా సీబీఐ మళ్లీ కోర్టు తీర్పును సవాలు చేయడంతో దీనిపై మరోసారి విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది.

సంపూర్ణ యోగా గ్రామాలు!

- **జూన్ 21 నాటికి 500 పల్లెలను తీర్చిదిద్దడమే లక్ష్యం: కేంద్రం**

న్యూఢిల్లీ, మార్చి 19: రోగాలు వచ్చాక చికిత్స చేయించుకోవడం కన్నా.. రాక ముందే నివారించడం మేలు!! ఈ ఆరోగ్య సూత్రాన్ని నిజ జీవితంలో సాకారం చేసుకోవాలంటే 'యోగా' ఉత్తమ మార్గమని కేంద్ర ఆయుష్ శాఖ చెబుతోంది. అందుకే దేశంలోని పల్లెలను సంపూర్ణ యోగా గ్రామాలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. జూన్ 21 జరగబోయే అంతర్జాతయ యోగా దినోత్సవం నాటికి కనీసం 500 గ్రామాలను యోగా పల్లెలుగా మార్చాలని నిర్ణయించుకుంది. ఆయా ఊర్లలో కనీసం ఇంటికి ఒకరు చొప్పున యోగా నేర్చుకుని ఉండేలా చూడాలని భావిస్తోంది. ఇప్పటికే సంపూర్ణ యోగా గ్రామంగా మారిన కేరళలోని కున్నంతనం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయుష్ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కాగా, ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ప్రధాన వేదికగా జైపూర్, హైదరాబాద్, అహ్మదాబాద్, మైసూర్ నగరాల్లో ఒకదానిని ఎంపిక చేయనున్నట్లు ఆ అధికారి తెలిపారు.

వాట్సాప్‌లోకి చైనా 'చొరబాటు'

మొదటిపేజీ తరువాయి



సరిహద్దుల్లోకే కాదు 'డిజిటల్ హద్దులూ దాటుతోంది. ఆ దేశానికి చెందిన కొందరు హ్యాకర్లు వాట్సాప్‌ను హ్యాక్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా భారత ఆర్మీ ప్రకటించింది. వాట్సాప్‌ను దేశ ప్రజలు భద్రంగా, సురక్షితంగా వాడుకోవాలని సూచించింది. వాస్తవాధీన రేఖ వెంబడి విధులు నిర్వర్తించే సైనికులు వాట్సాప్ వాడకంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన నాలుగు నెలలకే.. కేంద్ర ప్రభుత్వం ఈ తాజా హెచ్చరికను జారీ చేసింది. దానికి సంబంధించి ఆర్మీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇంటర్ ఫేస్ ట్విటర్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. డిజిటల్ ప్రపంచంలోకి చైనా హ్యాకర్లు చొరబడుతున్నారని, హ్యాక్ చేసి సమగ్ర సమాచారాన్ని దోచేస్తున్నారని ఆ వీడియోలో హెచ్చరించారు. అలా చొరబడేందుకు చైనా హ్యాకర్లు అందుబాటులో ఉన్న అన్ని ప్లాట్‌ఫాంలను వాడుకుంటున్నారని



పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో చేరిపోయి ఫోన్లను, వాట్సాప్‌ను హ్యాక్ చేస్తున్నట్టు తెలిపారు. +86 కోడ్‌తో గ్రూపుల్లో కొత్తగా చేరే ఫోన్ నంబర్లు చైనాకు సంబంధించినవని, అలా గ్రూపుల్లోకి చొచ్చుకొచ్చిన తర్వాత వారికి కావాల్సిన సమాచారాన్ని మొత్తం దొంగిలిస్తున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రూప్ అడ్మిన్లు ఎప్పటికప్పుడు గ్రూపులను చెక్ చేసుకుంటూ ఉండాలని, చైనా కోడ్‌తో వచ్చే నంబర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఒకవేళ సిమ్ కార్డు మారిస్తే పాత సిమ్‌ను పూర్తిగా విరగ్గొట్టేయాలని వీడియోలో సూచించారు.

గడ్కరీ... వెరీ వెరీ సారీ!

- **కేంద్రమంత్రికి ఢిల్లీ ముఖ్యమంత్రి క్షమాపణ లేఖ**
- **కేజ్రీవాల్‌పై పరువు నష్టం కేసు ఉపసంహరణ**
- **అమిత్ సిబల్‌నూ మన్నింపు వేడిన ఆప్ అధినేత**



న్యూఢిల్లీ, మార్చి 19: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణల పరంపరను కొనసాగిస్తున్నారు. పలువురు నాయకులపై తాను చేసిన ఆరోపణలు, తీవ్ర విమర్శలతో కూడిన ప్రకటనలను ఉపసంహరించుకుంటూ వారికి లేఖలు రాస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తాజాగా మన్నింపు కోరారు. దేశంలోని అత్యంత అవినీతిపరులైన రాజకీయ నాయకులలో ఒకరుగా గడ్కరీని అభివర్ణిస్తూ 2014లో కేజ్రీవాల్ ఆరోపణలు గుప్పించారు. దీంతో అవాస్తవ సమాచారం ప్రాతిపదికగా నిరాధార ఆరోపణలు చేశారంటూ గడ్కరీ ఆయనపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తన పొరపాటుకు చింతిస్తూ కేజ్రీవాల్ ఒక లేఖలో మన్నింపు కోరారు. తదనుగుణంగా పరువు నష్టం కేసు ఉపసంహరణ కోసం వారిద్దరూ సంయుక్తంగా ఢిల్లీ హైకోర్టులో అభ్యర్థన సమర్పించారు. కాగా, ఇప్పటికే పలువురిపై ఆరోపణలకు దిగి 33 పరువు నష్టం కేసులను ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ వాటన్నిటినీ పరిష్కరించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే పంజాబ్ మంత్రి విక్రమ్ మజీతియా 2016లో దాఖలు చేసిన పరువు నష్టం కేసులోనూ గతవారం కేజ్రీ క్షమాపణ చెప్పడం గమనార్హం. కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ తనయుడు అమిత్ సిబల్ 2013లో దాఖలు చేసిన పరువునష్టం కేసులోనూ కేజ్రీతోపాటు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా క్షమాపణలు చెప్పారు.



పంచె కట్టులో మహేష్

మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రంలో మహేష్ ట్రెడిషనల్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. సర్‌ప్రైజింగ్‌గా మహేష్ మొదటిసారి పంచె కట్టుతో కనిపించడం సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన టీజర్ ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వ్యూస్ సాధించింది. ఈ సందర్భంగా దానయ్య డి.వి.వి. మాట్లాడుతూ ''మన తెలుగు సంవత్సరాది పండగ కళ ఉట్టిపడే పంచె కట్టుతో ఉన్న పోస్టర్‌ను ఈరోజు విడుదల చేశాం. ప్రస్తుతం రాజు సుందరం నేతృత్వంలో పాట చిత్రీకరణ జరుగుతోంది. భారీ టెంపుల్ సెట్‌లో 100 డాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో చాలా గ్రాండ్ లెవల్‌లో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం ఈనెల 25 నుంచి స్పెయిన్‌లో షెడ్యూల్ ఉంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా 'భరత్ అనే నేను' చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు.



తండ్రిగా గర్వపడుతున్నా.. ఆర్టిస్ట్‌గా ఈర్ష్య పడుతున్నా..

– చిరంజీవి

రామ్‌చరణ్, సమంత హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రంగస్థలం'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సి.వి.ఎం(మోహన్) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో చిరంజీవి, సురేఖ, రామ్ చరణ్, ఉపాసన, సమంత, పూజా హెగ్డే, ఆది పినిశెట్టి, సుకుమార్, రామ్ లక్ష్మణ్, చంద్రబోస్‌తోపాటు నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ''ఈ చిత్రంలో సుకుమార్ అద్భుతమైన పనితనాన్ని చూపించాడు. ప్యూర్ విలేజ్ నేపథ్యంలో తెరకెక్కిన సినిమా ఇది. ఫస్ట్ సీన్ నుండి లాస్ట్ సీన్ వరకు ప్రేక్షకులను సినిమా కట్టి పడేస్తుంది. సినిమాను నేను ఎంజాయ్ చేసి చూశాను. ప్రేక్షకులందరినీ అలరించే సినిమా అవుతుంది. సుకుమార్.. చరణ్‌తో ఇంత మంచి సినిమా చేసినందుకు ఆర్టిస్ట్‌గా ఈర్ష్య పడుతున్నాను. ఓ తండ్రిగా గర్వపడుతున్నాను'' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ''రత్నవేలుగారు ఒక ఊరు ఎంత అందంగా ఉండాలో అంత అందంగా చూపించారు. ఆర్ట్ డైరెక్టర్ రామకృష్ణగారికి, మోనిక గారికి థాంక్స్. సమంతతో నటించేటప్పుడు ఓ ఎనర్జీ వస్తుంది. తను మంచి కో ఆర్టిస్ట్. అనసూయగారికి థాంక్స్. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని ఇచ్చాడు. చంద్రబోస్‌గారు అందరికీ అర్థమయ్యే రీతిలో సాహిత్యాన్ని అందించారు. ఇంత మంచి సినిమా చేయడానికి కారణమైన సుకుమార్‌గారికి హ్యాట్సాఫ్. నాకే ఓ కొత్త చరణ్‌ని పరిచయం చేశాడు. సుకుమార్‌గారి వల్ల నాపై నాకే గౌరవం పెరిగింది. మా అమ్మానాన్నలతోపాటు ఫ్యాన్స్ గర్వపడే సినిమాను సుకుమార్ నాకు ఇచ్చారు'' అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ ''ఈ సినిమా చూసిన చిరంజీవిగారు ఎంతో బాగా అప్రిసియేట్ చేశారు. నిర్మాతలు గురించి చెప్పాలంటే.. మా టీంను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. రత్నవేలుగారి సినిమాటోగ్రఫీ కారణంగా నేను మంచి దర్శకుడ్ని కాగలిగాను. దేవిశ్రీ ప్రసాద్ సిచ్యువేషన్స్ విని.. కేవలం మూడున్నర రోజుల్లోనే గొప్ప మ్యూజిక్ అందించాడు'' అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ ''చిరంజీవిగారికి, గంటా శ్రీనివాసరావుగారికి, వైజాగ్ కమిషనర్‌గారికి స్పెషల్ థాంక్స్. ఈ సినిమాలో రామ్‌చరణ్‌గారి విశ్వరూపం చూస్తారు'' అన్నారు. సమంత మాట్లాడుతూ ''ఈ టీంతో కలిసి పనిచేయడం నా అదృష్టం. సుకుమార్‌గారు మంచి వ్యక్తి. ప్రతి విషయాన్ని ప్రేమతో చేశారు. ఆయన ఎంతో ప్రేమతో రాసుకున్న ఈ క్యారెక్టర్‌కు న్యాయం చేయాలని చాలెంజ్‌గా తీసుకుని ఈ పాత్ర చేశాను. చరణ్‌గారి గురించి చెప్పాలంటే... చిరంజీవిగారికి స్వయంకృషి ఎలాగో.. చరణ్‌కి రంగస్థలం అలా మంచి పేరు తెస్తుంది. చాలా కాలం పాటు చరణ్ పోషించిన చిట్టిబాబు పాత్ర గుర్తుండిపోతుంది. దేవిశ్రీగారు సూపర్‌హిట్ మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ''నాకు ఎప్పటి నుండో ఫోక్ మ్యూజిక్ ఉన్న విలేజ్ బ్యాక్ డ్రాప్ మూవీ చేయాలనే కోరిక ఉండేది. ఆ కోరిక సుకుమార్ వల్ల తీరింది. సుకుమార్‌గారు నాపై నమ్మకంతో నా మ్యూజిక్‌లో డిఫరెంట్ యాంగిల్‌ను ప్రెజంట్ చేస్తూ వస్తున్నారు. బోస్‌గారు తన సాహిత్యంతో అందమైన ఎమోషన్స్‌ను క్రియేట్ చేశారు. నిర్మాతలకు చాలా థాంక్స్'' అన్నారు.

కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ త్వరలో ఒక చిత్రాన్ని ప్రారంభించనుంది. ప్రముఖ నిర్మాత జెమిని కిరణ్ నిర్మించనున్న ఈ చిత్రానికి 'ఉయ్యాలా జంపాలా', 'మజ్ను' ఫేమ్ విరించివర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సంవత్సరం ద్వితీయార్థంలో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్తుంది. ''ఉగాది పర్వదినాన నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా, విరించివర్మ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మించనున్నాం. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఈ చిత్రం ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని నిర్మాత జెమిని కిరణ్ తెలిపారు.

మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో..



సుమంత్ 25వ చిత్రం 'సుబ్రహ్మణ్యపురం' హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఇషా హీరోయిన్. సంతోశ్ జాగర్లపూడి దర్శకుడు. ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్ రెడ్డి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశాని నాగచైతన్య క్లాప్ ఇచ్చారు. ప్రశాంత్ వర్మ కెమెరా స్విచ్చాన్ చేయగా.. చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. జె.సి.దివాకర్‌రెడ్డి, డా.రాజశేఖర్, జీవిత సినిమా లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ''మానవాతీత అంశాలు నేపథ్యంలో సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది. కథ వింటున్నప్పుడే చాలా ఆసక్తిగా అనిపించింది'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''ఈ సినిమాకు ముందు మూడు షార్ట్ ఫిలింస్‌ను డైరెక్ట్ చేశాను. ఈ సినిమాను డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చిన హీరో సుమంత్, నిర్మాతలకు థాంక్స్. ఏప్రిల్ మూడో వారం నుండి షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అన్నారు.

మల్టీస్టారర్‌లో..



రష్మిక మండన్న

నాగార్జున, నాని కాంబినేషన్‌లో వైజయంతి మూవీస్ పతాకంపై శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సి.అశ్వనీదత్ నిర్మాత. ఉగాది రోజున ఈ సినిమా షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవు తుంది. 'ఛలో' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన రష్మిక మండన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనుంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన ఓ చిత్రంలో నటిస్తున్న రష్మిక.. ఈ మల్టీస్టారర్‌తో హీరోయిన్‌గా తన రేంజ్ పెంచుకునే అవకాశం కనిపిస్తోంది.

నాగశౌర్య @ నర్తనశాల



ఛలో సక్సెస్ తర్వాత ఐరా క్రియేషన్స్ పతాకంపై నాగశౌర్య నటిస్తున్న చిత్రం '@ నర్తనశాల' ఈ చిత్రరం ఉగాది సందర్భంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో వంశీ పైడి పల్లి, నందిని రెడ్డి, శ్రీనివాస్ అవసరాల, అజయ్, గౌతమ్, ఈ వేడుకలో పాల్గొన్నారు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో హీరో నాగశౌర్య మాట్లాడుతూ 'మా నర్తనశాల చిత్రంతో శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడిగా పరిచయమౌతున్నారు. మా సంస్థ నుంచి మరో కొత్త డైరెక్టర్ ను పరిచయం చేస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. నా డెసిషన్ ను నమ్మిన మా అమ్మకు థాంక్స్. మంచి ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో హీరోయిన్స్ ఇంకా ఫైనల్ కాలేదు. సాగర్ మహతి సంగీతం అందిస్తున్నారు'' అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ ''ఈ తరహా కథని పర్ ఫెక్ట్ గా జడ్జ్ చేసి సినిమా చేద్దామని ఒప్పుకున్న నిర్మాతలకు థాంక్స్. 'ఛలో'ని మించేలా సినిమా రూపొందిస్తాననే నమ్మకం ఉంది'' అన్నారు.

వరుణ్‌తో సాగర్ చంద్ర



ఈ ఏడాది 'తొలిప్రేమ' సినిమాతో సక్సెస్ అందుకున్న మెగా హీరో వరుణ్ తేజ్ తను చేయబోయే కొత్త సినిమా వివరాలను ప్రకటించారు. 'అయ్యారే', 'అప్పట్లో ఒకడుండేవాడు' చిత్రాల దర్శకుడు సాగర్ చంద్ర ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన వివరాలను ప్రకటిస్తామని చిత్ర బృందం ప్రకటించింది. వరుణ్‌తేజ్ త్వరలోనే సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో స్పేస్ మూవీ చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

బన్నీ డాన్స్‌కి పెద్ద అభిమానిని..



ఎల్లీ అవ్రమ్

తెలుగు హీరో అల్లు అర్జున్ డాన్స్ అంటే తనకెంతో ఇష్టమనీ, తను అతన్ని ఫాన్‌ని అని బాలీవుడ్ హీరోయిన్ ఎల్లీ అవ్రమ్ అన్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా రామలక్ష్మి సినీ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడు. అను ఇమ్మానుయేల్ కథానాయిక. ఈ చిత్రానికి విశాల్ శేఖర్ సంగీతాన్నందిస్తున్నారు. ఈ చిత్రంలోని ఓ పాటలో ఎల్లీ అవ్రమ్ నటిస్తున్నారు. ఈ సందర్భంగా ''బన్నీ డాన్స్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయనతో కలిసి నటించడం నా అదృష్టం. నేను ఈ చిత్రంలో చేస్తున్న పాట స్పెషల్ సాంగ కాదని ఎల్లీ అవ్రమ్ స్పష్టం చేశారు. ఈ చిత్రాన్ని మే 4న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

స్టూడెంట్ స్ట్రగుల్స్‌తో...



శ్రీవిష్ణు

విభిన్నమైన కథాంశాలతో సినిమాలను చేస్తున్న హీరో శ్రీవిష్ణు. ఈ నెల 23న 'నీది నాది ఒకే కథ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ''ఈ సినిమాలో స్టూడెంట్ లైఫ్‌లో స్ట్రగుల్స్‌ను చూపించాం. ఇంటర్ అయ్యాక ఇంజనీరింగ్ చేయకపోతే పిల్లను ఇవ్వరనో, పిల్లాడు దొరకడనో చాలా మంది ఇంజినీరింగ్ చదువుతారు. సొసైటీ కూడా ఇంజినీరింగ్ చదివేవారిని ఒక రకంగా చూస్తుంది. డిగ్రీ చదివే వాళ్లని ఇంకో రకంగా చూస్తుంది. చచ్చీ చెడి ఇంజినీరింగ్ పాస్ అయినా, నచ్చింది చేయలేకపోయామనే బాధతో ప్రతి రోజూ దాన్ని తలచుకుని బాధపడే వాళ్లు చాలా మందే ఉంటున్నారు. వాళ్లు జీవితంలో 80 శాతం శాటిస్‌ఫైడ్‌గా ఉండరు. అది తప్పు అంటాను. మనం ఏం కావాలనుకుంటున్నామో ముందు మనకొక క్లారిటీ ఉంటే, దాన్ని గట్టిగా పేరెంట్స్ దగ్గర చెప్పవచ్చు. కొన్నిసార్లు మనం అనుకున్నది త్వరగా సాధించగలం. కొన్నిసార్లు కాస్త ఆలస్యమవుతుంది. అయినా నచ్చిందే చేస్తున్నామనే తృప్తి ఉంటుంది. ఇక ఈ సినిమా విషయానికి వస్తే రూరల్‌గా మిడిల్ క్లాస్ నేపథ్యంలో నేచురల్‌గా సాగే సినిమా. దేవీప్రసాద్‌గారు మా నాన్న పాత్ర చేశారు. సినిమా చూసే కుర్రాళ్లకు నా పాత్ర కనెక్ట్ అయితే, తండ్రులకు దేవీ ప్రసాద్‌గారి పాత్ర కనెక్ట్ అవుతుంది. పెద్ద దర్శకులతో చేయకూడదనేం కాదు.. ప్రస్తుతం కొత్త దర్శకులతో చేస్తున్నాం. కొత్త దర్శకులు ప్యాషన్‌తో పాటు.. నా బడ్జెట్‌కు తగ్గ కథలతో ఉంటారు. నాకూ కంఫర్ట్ ఉంటుంది. సినిమా కోసం డొగ్నే 95 టెక్నిక్‌ను వాడాం. సినిమా బాగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది. 'వీరభోగ వసంతరాయులు' సినిమా చేస్తున్నాను. ఓ పోలీస్ స్టోరీ అంగీకరించాను. అలాగే కృష్ణ విజయ్ దర్శకత్వంలో 'తిప్పరా మీసం' సినిమా చేయబోతున్నాను'' అన్నారు.

నారా రోహిత్ 'శబ్ధం'



నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'శబ్ధం'. ''హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్'' అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్. పి.బి.మంజునాథ్ దర్శకుడు. శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణ రావు అట్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా అమరావతిలో ప్రారంభమైంది. నారా రోహిత్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి మినిస్టర్ ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్ కొట్టగా.. పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ దర్శకుడు పి.బి.మంజునాథ్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా మినిస్టర్ ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. '''శబ్ధం' సూపర్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ.. ''అమరావతిలో ఈ సినిమా ప్రారంభోత్సవమే కాదు.. ఆడియో వేడుకను కూడా నిర్వహిస్తాం. కథకు సూటయ్యే టైటిల్ ఇది'' అన్నారు. చిత్ర నిర్మాత నారాయణరావు అట్లూరి మాట్లాడుతూ ''అమరావతిలో ఈ చిత్ర ప్రారంభోత్సవం జరుపుకోవడం సంతోషం. సినిమా తప్పకుండా అందర్నీ అలరించే విధంగా ఉంటుంది'' అన్నారు. చిత్ర దర్శకుడు పి.బి.మంజునాథ్ మాట్లాడుతూ '''లేడీస్ అండ్ జెంటిల్‌మేన్' సినిమా తర్వాత చేస్తున్న సినిమా ఇది. ఏప్రిల్ చివరివారం నుంచి వైజాగ్, కాకినాడ, హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. కథను నమ్మి అవకాశాన్నిచ్చిన నిర్మాత నారాయణరావుగారికి ధన్యవాదాలు'' అన్నారు.





తుంగభద్రలో తోడేళ్లు

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు.. రీచ్‌ల్లో కాకుండా ఎక్కడపడితే అక్కడే.. సరిహద్దులు దాటుతున్న వందల ట్రాక్టర్లు

- **ప్రభుత్వ ఆదాయానికి రూ. లక్షల్లో గండి**
- **దగ్గరుండి నడిపిస్తున్న అధికార పార్టీ నేతలు**
- **అధికారులకు నెలనెలా లంచాలు.. ఒత్తిడి**
- **గుల్ల అవుతున్న నది.. అడుగంటుతున్న బోర్లు**

కర్నూలు, మార్చి 19 (మనం న్యూస్ బ్యూరో): ఆ నది సీమ ముఖద్వారమైన కందెనవోలుకు జీవనాడి. లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందించడమే కాకుండా.. లక్షల మంది గొంతు తడిపే మహానది. అలాంటి నదిలో తోడేళ్లు పడ్డాయి. రైతుల, ప్రజల ప్రయోజనాల కంటే తమ ప్రయోజనాలే మిన్నగా భావించి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతించిన చోట కాకుండా ఎక్కడపడితే.. అక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టి వందల ట్రాక్టర్లు సరిహద్దులు దాటించి సొమ్ముచేసుకుంటున్నారు. రాత్రికి రాత్రే కోట్లకు పడగలెత్తుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కూడా నెలనెలా ఆమ్యామ్యాలు అందుతుండడంతో చూసి చూడనట్టు వ్యవహరిసున్నారు. దీంతో ఇసుకాసురుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమ తవ్వకాల వల్ల నదీతీర ప్రాంతాల్లో బోర్లు, బావులు అడుగంటి పోతున్నాయి. అయినా అధికారుల్లో చలనం కరువైంది. కృష్ణా ఉప నదుల్లో తుంగభద్ర ఒకటి. రామాయణ కాలంలో పంపానదిగా పిలిచిన ఈ నది కర్ణాటకలోని పడమటి కనుమల్లో జన్మించింది. తుంగ, భద్ర అను రెండు నదుల కలయిక వల్ల ఏర్పడిన ఈ నది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో ప్రవహిస్తోంది. ఈ రెండు రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా.. వేలాది గ్రామాల ప్రజల గొంతు తడుపుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ నదిపై ఇసుకాసురుల కన్ను పడింది.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు..

తుంగభద్ర నదిలో మేలైన ఇసుక లభిస్తుండడంతో అక్రమార్కులు ఈ ఇసుకపై కన్నేశారు. అధికార పార్టీకి చెందిన పెద్దల అండతో నదిలో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంది. కర్నూలు ప్రాంతంలో పూడూరు, నిడ్జూరు రీచ్‌ల్లో మాత్రమే ఇసుక తవ్వుకోవడానికి అనుమతులు ఉన్నాయి. కానీ ఇసుకాసురులు మాత్రం రీచ్ కాకుండా తిప్పమ్మ కొట్టం, మునగాలపాడు హైవే బ్రిడ్జి కింద, మునగాలపాడు మర్రిచెట్టు తదితర ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా పొక్లైయిన్లు వినియోగిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపట్టి వందల ట్రాక్టర్లు ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు.

అడుగంటిపోతున్న బోర్లు, బావులు..

తుంగభద్ర నదిలో అక్రమ తవ్వకాల వల్ల నదీతీరంలోని బోర్లు, బావులు అడుగం టిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వాల్టా చట్టం ప్రకారం బోర్లు, బావులకు సమీపంలో తవ్వకాలు చేపట్టరాదు. అలాగే వంతెనలకు, చారిత్రక కట్టడాల సమీపంలో కూడా తవ్వకాలు చేయరాదు. తవ్వ కాలు చేపట్టినా.. ఎక్కువ లోతు తవ్వరాదు. కానీ అక్రమార్కులు ఏవీ పట్టించుకోవడంలేదు. తుంగభద్ర గర్భాన్ని తోడేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ తవ్వకాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

నిద్రపోతున్న నిఘా..

తుంగభద్ర నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టి రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారు. తుంగభద్ర నదిలోని ఇసుకకు బహిరంగ మార్కెట్లో మంచి రేటు పలుకుతోంది. గ్రేడ్ ఏ ఇసుక ఒక ట్రాక్టర్ రూ.7వేలు.. గ్రేడ్ బి ఇసుక రూ.5 వేలు పలుకుతోంది. దీంతో జిల్లా వాసులేకాకుండా తెలంగాణకు చెందిన బిల్డర్లు కూడా ఈ ఇసుక కోసం పోటీపడుతుంటారు. ప్రతి రోజు వందల ట్రాక్టర్ల ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అడ్డుకునేందుకు ఈ తాంద్రపాడు సమీపంలో చెక్ పోస్టు ఏర్పాటు చేసినా అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. చెక్‌పోస్టుకు చెందిన కొంత మంది సిబ్బందికి నెలనెలా అమ్యామ్యాలు అందుతుండడంతో చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతల అండ..

తుంగభద్రలో ఇసుక అక్రమ తవ్వకాల వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు ఉన్నట్టు తెలుస్తోంది. వీరి అండతోనే స్థానికంగా ఉన్న కొందరు నేతలు తవ్వకాలు చేపట్టి హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దందాలో స్థానిక నేతల నుంచి పైస్థాయి నేతలకు, అధికారులకు నెలనెలా భారీ మొత్తంలో ఆమ్యామ్యాలు అందుతున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ, పోలీసులు దాడులు చేసి ట్రాక్టర్లు పట్టుకుంటే.. వెంటనే నేతలు రంగంలోకి దిగి అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. వినకపోతే.. పైస్థాయి అధికారులతో ఒత్తిడి తెచ్చి అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుకాసురుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రోజుకు ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండికొడుతున్నారు.

త్వరలో డీఎస్సీ

- 10 వేల ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ
- వారంలో ప్రకటన వెలువడే అవకాశం
- టెట్ ఫలితాల విడుదల.. 43 శాతం అర్హత
- 13 మార్కులు అదనంగా కేటాయింపు: గంటా



అమరావతి, మార్చి 19 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో త్వరలో 10 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) ఫలితాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జిల్లాల వారీగా ఖాళీల వివరాలను ఆర్థిక శాఖకు అందించామని, ఆర్థిక శాఖ నుంచి నివేదిక రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. ఈ వారంలోనే డీఎస్సీ ప్రకటన వెలువడే అవకాశముందని తెలిపారు.

టెట్‌లో 43 శాతం అర్హత

2013తో పోలిస్తే ఈసారి ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో 8 శాతం అదనంగా అర్హత సాధించారని గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 190 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 4,36,833 మంది ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా.. 4,36,829 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని.. వీరిలో 4,14,120 (92.67 శాతం)మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 43 శాతం అభ్యర్థులు అర్హత సాధించారని ఆయన వివరించారు. టెట్ ప్రాథమిక కీ ఫిర్యాదుల ఆధారంగా మొత్తం 13 మార్కులను అదనంగా కేటాయించామని మంత్రి గంటా తెలిపారు. మొత్తం 19,314 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 2604 మాత్రమే రీజనబుల్‌గా ఉన్నాయని చెప్పారు. పేపర్ వన్ అభ్యర్థులకు 5 మార్కులు, పేపర్ -2లో గణితం-సైన్స్ అభ్యర్థులకు 8 మార్కులు, సాంఘిక శాస్త్రం అభ్యర్థులకు 3 మార్కులు అదనంగా కేటాయించామని తెలిపారు. పేపర్-1లో 57.88 శాతం, పేపర్ -2లో గణితం-సైన్స్‌లో 37.26 శాతం, సాంఘిక శాస్త్రంలో 38.22 శాతం, పేపర్-3లో 42.60 శాతం అర్హత సాధించారని వెల్లడించారు. సగటున 25 శాతం అభ్యర్థులు 90 కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 84 మంది అభ్యర్థుల ఫలితాలను విత్ హెల్డ్‌లో ఉంచినట్టు మంత్రి గంటా పేర్కొన్నారు.

పవన్ యూటర్న్ ఏల?

- **ఆ రహస్యం ఏమిటో అందరికీ తెలుసు**
- **నాలుగేళ్లు ఆగి.. ఇప్పుడు విమర్శలా?**
- **కేసుల మాఫీ కోసం జగన్ తాపత్రయం**
- **దానికోసం రాష్ట్ర భవిష్యత్తు తాకట్టు**
- **కుట్ర రాజకీయాలను ఎండగట్టాలి**
- **అంబేద్కర్ విగ్రహాల వద్ద మానవహారాలు**
- **టీడీపీ ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్**



అమరావతి, మార్చి 19 (మనం ప్రతినిధి): ''పవన్ కల్యాణ్ యూటర్న్ ఎందుకు తీసుకున్నాడో ప్రజలందరికీ తెలుసు. నాలుగేళ్లుగా విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నాడు? వచ్చే ఎన్నికల్లో ద్రోహులెవరికీ డిపాజిట్లు కూడా రావు'' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. సోమవారం ఆయన టీడీపీ ఎంపీలు, పార్టీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తప్పుడు పనులు చేసే వారు దొంగాట ఆడుతున్నారని, రెడ్ హ్యాండెడ్‌గా ఫొటోలతో సహా దొరికిపోయారని పేర్లు ప్రస్తావించకుండా విమర్శించారు. కుట్ర రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు పిలుపునిచ్చారు. అన్ని నియోజక వర్గాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించి, ప్రత్యర్థుల కుట్రలను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని నేతలకు పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన ప్రచారం ఉధృతం చేసి వైసీపీ లాలూచీ రాజకీయాలు, బీజేపీ చేసిన మోసంపై కరపత్రాలు పంపిణీ చేసి కుట్ర రాజకీయాలను ఎండగట్టాలని ఎంపీలు, నేతలకు చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు.

న్యాయం కోరితే యుద్ధం చేస్తారా?

''కేంద్ర ప్రభుత్వం మీద అవిశ్వాసంపై అన్ని పార్టీల మద్దతు తీసుకుంటున్నాం. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. మన హక్కుల కోసం ఎంపీలు పోరాడుతున్నారు. ఇది కీలక సమయం. అందరూ అప్రమత్తంగా ఉండాలి. మనం రాష్ట్రానికి న్యాయం చేయాలనే అడుగుతున్నాం. అలా అడిగితే కేంద్రం యుద్ధం చేస్తుందా? ఏపీకి హోదా ఇస్తానని కాంగ్రెస్ కూడా ప్లీనరీలో చెప్పింది. మరి కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? కేసుల మాఫీ కోసం జగన్ బీజేపీతో లాలుచీ పడుతున్నారు. ఆరోజు కూడా టీడీపీ ఎంపీల చాటున లోక్ సభలో దాక్కున్నారు. ఒక పార్టీతో అవిశ్వాసం పెట్టించడం, మరో పార్టీతో గొడవ చేయించడం, సభ వాయిదా వేసుకునిపోవాలని కేంద్రం చూస్తోంది. ఇది లాలూచీ రాజకీయాలకు పరాకాష్ట. పీఎంఓలో విజయసాయిరెడ్డి తిష్ట. ఇంతకన్నా రుజువులు ఏమి కావాలి? వీళ్ల కేసుల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతారా? రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులపై రాజీపడే ప్రసక్తేలేదు. విభజన చట్టంలోని 19 అంశాలు, పార్లమెంట్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి''అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

స్టాక్ మార్కెట్‌పైనా ప్రభావం...

జాతీయ స్థాయిలో వివిధ పార్టీల అభిప్రాయాల గురించి లోక్ సభ పక్ష నేత తోట నరసింహం ముఖ్యమంత్రికి వివరించారు. టీఎంసీ, ఎస్పీ, ఇతర పార్టీ నేతలు మద్దతు ప్రకటించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రాంతీయ పార్టీ వైదొలగడం జాతీయ స్థాయిలో ఒక కుదుపు సృష్టించిందని, దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా పడిందని ఎంపీ గరికపాటి మోహన్‌రావు తెలిపారు. చంద్రబాబు తనకు జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి లేనట్లు మాట్లాడటం సబబుగా లేదని, ఈ పరిస్థితుల్లో అవసరమైతే జాతీయ రాజకీయాలలో క్రియాశీలకంగా మారతానని చెప్పాలని సూచించారు. టీడీపీ అవిశ్వాస తీర్మానంపై ఇతర పార్టీల ఎంపీ సంతకాలు కూడా తీసుకుంటున్నట్లు గల్లా జయదేవ్ తెలిపారు. సభ సజావుగా జరగడం లేదనే వంకతో వాయిదా వేసుకుపోవాలని కేంద్రం చూస్తోందని సీఎం రమేష్ అన్నారు.

అంబేద్కర్ విగ్రహాల వద్ద మానవహారాలు


మూడు పార్టీల లాలూచీపై రచ్చబండల వద్ద చర్చ జరుగుతోందని జూపూడి ప్రభాకర్‌రావు చెప్పారు. బీజేపీతో జగన్మోహన్ రెడ్డి మిలాఖత్‌పై దళిత కాలనీల్లో ప్రచారం ఉధృతం చేస్తామన్నారు. అవిశ్వాసంపై చర్చ జరగకుండా అడ్డుకోవాలని ఇతర పార్టీలను రెచ్చగొట్టడం రాజ్యాంగ వ్యతిరేకమని, కేంద్రం వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద మానవహారాలు ఏర్పాటు చేస్తామని వర్ల రామయ్య ప్రతిపాదించగా.. ముఖ్యమంత్రి అందుకు ఆమోదం తెలిపారు.

బీజేపీతో వైదొలగడం పట్ల ముస్లింల హర్షం

కేంద్ర మంత్రుల రాజీనామాల పట్ల దళితులు, ముస్లింలో మంచి స్పందన వచ్చిందని ఎమ్మెల్సీ సునీత పేర్కొన్నారు. సోమవారం హిందూ దినపత్రికలో వచ్చిన సంపాదకీయంలో టీడీపీ పోరాటం గురించి ప్రముఖంగా పేర్కొన్నట్లు ఎంపీ కేశినేని నాని చెప్పారు. 1000 మోటార్ సైకిళ్ళతో బైకు ర్యాలీలు నిర్వహించినట్లు వివిధ నియోజక వర్గాల ఇన్‌చార్జులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ..ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రతి నియోజక వర్గంలో సైకిల్ ర్యాలీలు, బైక్ యాత్రలు చేపట్టాలన్నారు.

చంద్రబాబుకు 25 మార్కులే

- **తెలంగాణ కేసీఆర్‌కు నూటికి 60 మార్కులు**
- **లోకేశ్ అవినీతిపై టీడీపీ ఎమ్మెల్యేలే చెప్పారు**
- **ప్రభుత్వంలో అవినీతి సీఎంకు తెలుసు**
- **నేను చెప్పినా ఆయన సరిగా పట్టించుకోలేదు**
- **టీడీపీ.. బీజేపీ సంబంధాలు ఎప్పుడూ సరిలేవు**
- **జాతీయ మీడియాతో జనసేన అధినేత పవన్**



న్యూఢిల్లీ, మార్చి 19: ప్రభుత్వ పరిపాలన విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాను నూటికి 25 మార్కులే వేస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అవినీతిపై ఆయన మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలన విషయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఎంతో మెరుగంటూ.. ఆయనకు నూటికి 60 మార్కులు వేశారు. అవినీతి గురించి చంద్రబాబుకు తాను స్వయంగా చెప్పినా ఆయన సీరియస్‌గా పట్టించుకోలేదని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ అంశాలపై ఆయన జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వ్యాఖ్యలు చేశారు.

బాబుకు చెబుతూనే ఉన్నా

తెలుగుదేశం ప్రభుత్వంలో అవినీతి గురించి తాను ఉన్నట్టుండి ఇప్పుడే ఏమీ మాట్లాడటం లేదని, గత నాలుగేళ్లుగా ఈ అంశాన్ని చంద్రబాబుతో ప్రస్తావిస్తూనే ఉన్నానని ఆయన అన్నారు. కానీ ఆయన మాత్రం దీనిగురించి ఏనాడూ సీరియస్‌గా పట్టించుకోలేదని మండిపడ్డారు. తన ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి గురించి చంద్రబాబుకు పూర్తిగా తెలుసని స్పష్టం చేశారు. ఏపీ ప్రజలందరికీ కూడా ఆ విషయం తెలుసని, తాను కూడా బయటివాడిని కాను కాబట్టే తనకూ తెలిసిందని వ్యాఖ్యానించారు. దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు తనవద్దకు వచ్చి ప్రభుత్వంలో అవినీతి గురించి ఫిర్యాదు చేశారని, ఈ విషయాన్ని వాళ్లు ముఖ్యమంత్రికి చెప్పలేక తనను చెప్పమన్నారని ఆయన తెలిపారు. దాంతో తాను కూడా చెప్పడానికి ప్రయత్నించినా, ఫలితం లేకపోయిందని.. అందుకే తాను ఇప్పుడు బయటకు మాట్లాడాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రైవేటు కాంట్రాక్టర్లకు కట్టబెట్టడంలో ఏవో స్వార్థ ప్రయోజనాలున్నాయని ఆయన ఆరోపించారు. ఇవే విషయాలను ప్రధాని మోదీ వద్ద ప్రస్తావించొచ్చు కదా అని మీడియా ప్రతినిధుల అడగ్గా.. తనకు ప్రధానమంత్రి మోదీతో చాలా సన్నిహిత సంబంధాలున్నా.. కొన్ని పరిమితులు కూడా ఉన్నాయన్నారు. తాను ఎంపీని కాను కాబట్టి అన్నీ మాట్లా డలేనన్నారు. కానీ ఇప్పుడు తాను టీడీపీ అవినీతిపై మాట్లాడుతుంటే బీజేపీ వాళ్లు తనతో అలా మాట్లాడించినట్లు టీడీపీ ఆరోపిస్తోందన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ కూడా తన వెనుక చంద్రబాబు ఉన్నారని ఆరోపించారని.. రెండూ అవాస్తవమేనని తెలిపారు. తాను ఎవరి మాటా వినడంలేదని, ప్రజల మాట మాత్రమే వింటున్నానని అన్నారు.

బీజేపీతో పొత్తు ఉండదు

బీజే పీ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వాళ్లు ఆ పార్టీని అస్సలు నమ్మడం లేదని పవన్ చెప్పారు. అందువల్ల తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశమే లేదన్నారు. ప్రత్యేక హోదా డిమాండు భావోద్వేగాలతో కూడుకున్నదని, అలాగే రాష్ట్రానికి కూడా చాలా అవసరాలున్నాయని చెప్పారు. యూపీలోని బుందేల్‌ఖండ్ తరహాలో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులున్నాయని, వాటి పరిస్థితి మెరుగు పరచాలంటే కేంద్రం నుంచి మరిన్ని నిధులు అవసరమని వివరించారు. ప్రత్యేక హోదా అన్న పేరుతో చేస్తారో.. మరేదైనా పేరుతో చేస్తారో తమకు అనవసరమని.. కానీ హోదా మాత్రం ముఖ్యమని చెప్పారు. ప్రధానంగా తమకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం రావాలన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకునే ప్రసక్తి లేదని తెలిపారు. ప్రస్తుతానికి తాము ఒంటరిగానే వెళ్తున్నామని, ఎన్నికల సమయం వచ్చిన తర్వాత పొత్తు పెట్టుకోవాలా.. అవసరం లేదా అన్న విషయం ఆలోచిస్తామని అన్నారు.

థర్డ్ ఫ్రంట్ అవసరమే

దేశంలోని చాలా రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ సమస్యలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ విఫలమయ్యాయని.. అందుకే థర్డ్ ఫ్రంట్ అవసరమని పవన్ తెలిపారు. అయితే ప్రాంతీయ పార్టీలు జాతీయ అంశాలను గురించి కూడా ఆలోచించాలని అన్నారు. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి థర్డ్ ఫ్రంట్ గురించి చర్చించానని, అయితే ఇంకా పూర్తి వివరాలు మాట్లాడలేదని ఆయన చెప్పారు.



త్వరలో 'ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్'ల భర్తీ

- **పోస్టుల మంజూరుకు సత్వర చర్యలు: మంత్రులు**

హైదరాబాద్, మార్చి 19(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఉన్న వివిధ కోర్టుల్లో అవసరమైన ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ల పోస్టులు మంజూరు చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రుల సమక్షంలో సోమవారం సచివాలయంలోని హోంమంత్రి కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. క్యాడర్ ప్రాసిక్యూటర్ పోస్టుల మంజూరు, భర్తీకి కొంత సమయం అవసరమైన నేపథ్యంలో ప్రస్తుతం నియామకం చేస్తున్న టెన్యూర్ ప్రాసిక్యూటర్ నియామకానికి మరింత పటిష్టమైన విధానాన్ని అవలంభించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆఫీసులో అవసరమైన మినిస్టీరియల్ సిబ్బంది, ఫర్నీచర్, కంప్యూటర్లు, సిబ్బందికి ఇంటర్నెట్, ఫోన్ ఇతర సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌కు సూచించారు. ఇప్పటికే వివిధ కోర్టులకు ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ల పోస్టుల మంజూరుకోసం చేసిన ప్రతిపాదనలకు వీటిని జత చేసి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయానికి తగిన వసతిలేని కారణంగా అనువైన ప్రభుత్వ భవనాన్ని సమకూర్చుకోవాలని మంత్రులు సూచించారు.

మహారాష్ట్రలో తెలుగు పండుగ

- **పుణె ఆంధ్ర సంఘం ఉగాది సంబరాలు**
- **సినీ నటుడు చంద్రమోహన్‌కు సత్కారం**
- **ఎక్కడున్నా సంస్కృతిని రక్షించుకోవాలని పిలుపు**




పుణె, మార్చి 19: మహారాష్ట్రలో తెలుగు సంవత్సరాది వేడుకలు ఘనంగా జరిగాయి. పుణెలో స్థానిక తెలుగు వారంతా కలిసి ఉగాది సంబరాలు కనులపండువగా చేసుకొన్నారు. ఇక్కడి నవీ సంఘ్వీలోని నిలపూలే రంగమందిర్‌లో విళంబి ఉగాది వేడుకలను పుణె ఆంధ్ర సంఘం ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సినీ నటుడు చంద్రమోహన్, గౌరవ అతిథిగా సామాజికవేత్త, వారణాసి నేత్ర కేంద్ర సంస్థాపకుడైన వారణాసి రామచంద్ర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు ప్రజలంతా ఇక్కడ చేరి తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకున్నారు. తొలుత అతిథులు, వేడుకలకు వచ్చిన ప్రసాంధ్రులకు సంఘం అధ్యక్షుడు శేషగిరిరావు షడ్రుచుల ఉగాది పచ్చడిని అందించారు. అనంతరం చిన్నారుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం మల్లాది వెంకట గోపాల కృష్ణ పంచాగం శ్రవణం చేశారు. ఈ సందర్భంగా పునె ఆంధ్ర సంఘం 75వ వార్షి కోత్సవ ప్రత్యేక ఉగాది సంచికను చంద్ర మోహన్ ఆవిష్కరించారు. సంఘం తరపున అతిథులును అధ్యక్షుడు శేషగిరిరావు తదితరులు ఘనంగా సత్కరించారు. చంద్రమోహన్ మట్లాడుతూ.. తాను కూడా వలస వెళ్లిన తెలుగువాడినేనని, ఎక్కడికి వెళ్లినా మనం ఎక్కడున్నా మనం మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలని చెప్పారు. చివరిగా ముగింపు ప్రసంగం చేసిన సంఘం ఉపాధ్యక్షుడు మోహన్ నాయుడు.. త్వరలో తెలుగు సాహిత్య పీఠాన్ని పుణెలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.


మనం
www.manamnews.com

కార్పొరేట్
corporate

10 | హైదరాబాద్ | మంగళవారం | 20 | మార్చి | 2018







కొనసాగిన పతనం

33,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్.. 10,100 పాయింట్ల దిగువకు నిఫ్టీ


ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' సోమవారంనాడు దాదాపు 253 పాయింట్లు నష్టపోయి 33,000 పాయింట్ల స్థాయికి దిగువన ముగిసింది. మెటల్, టెలీకాం, బ్యాంకింగ్ రంగ షేర్ల అమ్మకాల వల్ల వరుసగా ఐదవ సెషన్‌లోనూ పతనాన్ని కొనసాగించింది. కరెంట్ అకౌంట్ లోటు వ్యత్యాసం పెరగడం, అమెరిక్ ఫెడ్ వడ్డీ రేటును పెంచే అవకాశం ఉండడంతో మార్కెట్లలో ఉత్సాహం సన్నగిల్లింది. 30 షేర్ల 'సెన్సెక్స్' 252.88 పాయింట్లు కోల్పోయి 32,923.12 పాయింట్ల వద్ద ముగిసింది. 'సెన్సెక్స్' 2017 డిసెంబరు 6న 32,597.18 పాయింట్ల వద్ద ముగిసింది. అంత బలహీన స్థితిలో 'సెన్సెక్స్' మరలా ముగియడం తిరిగి ఇదే మొదటిసారి. 'సెన్సెక్స్' గత నాలుగు సెషన్లలో 741.94 పాయింట్లు నష్టపోయింది.

విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజి (ఎన్.ఎస్.ఇ) సూచి (50 షేర్ల) 'నిఫ్టీ' కూడా సోమవారం 10,100 పాయింట్ల స్థాయి దిగువకు పడిపోయింది. అది 100.10 పాయింట్లు నష్టపోయి 10,094.25 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్ నుంచి విదేశీ నిధులు తరలిపోయాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ వారం వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడానికి అవకాశం ఉండడంతో విదేశీ మదుపు సంస్థలు షేర్లను అమ్మేశాయి. టాటా స్టీల్ షేర్ ధర 4.24 శాతం క్షీణించగా, భారతీ ఎయిర్‌టెల్ 4.16 శాతం నష్టపోయింది.

ప్రపంచ స్టాక్ మార్కెట్ల సంకేతాలు కూడా బలహీనంగానే ఉన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం ముందు ఆచితూచి అడుగులేయడానికే మదుపరులు మొగ్గు చూపారు. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగనున్నాయని చాలా మంది భావిస్తున్నారు. ''ప్రపంచ మార్కెట్లలో తీవ్ర హెచ్చు తగ్గుల వల్ల దేశంలో స్టాక్ మార్కెట్ గమనం కూడా మందగొడిగానే సాగింది. అమెరికాలో వడ్డీ రేటు 25 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. బాండ్ల ప్రతిఫలాలు

ప్రపంచ సంకేతాలూ బలహీనమే

హెచ్చు స్థాయిల్లో కొనసాగుతున్నాయి. ఇక వాణిజ్య ఉద్రిక్తతలకు సంబంధించిన ఆందోళన అక్కడి మదుపరులు లాభాల స్వీకరణకు దిగేట్లు చేసింది. మళ్ళీ మన దేశం విషయానికి తిరిగి వస్తే, కరెంట్ అకౌంట్ లోటు పెరగడం వల్ల రూపాయి బలహీనపడింది. మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించేట్లు చేసింది'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. ''ద్రవ్య లోటు పెరగడం, రాజకీయ రంగంలో తాజా పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను నీరుగార్చాయి'' అని ఢిల్లీలోని ఎన్.ఎస్.ఇ. స్టాక్ బ్రోకర్ మనోజ్ కొరారియా చెప్పారు.



కరెంట్ అకౌంట్ లోటు

డిసెంబరు త్రైమాసికంలో కరెంట్ అకౌంట్ లోటు (సి.ఎ.డి) జి.డి.పి.లో 2 శాతానికి పెరిగి, 13.5 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉందని శుక్రవారం ట్రేడింగ్ వేళలు ముగిసిన తర్వాత విడుదలైన ఆర్.బి.ఐ. డాటా వెల్లడించడంతో మొత్తంమీద మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగానే కొనసాగింది. ఏడాది క్రితం అదే కాలంలో ఆ లోటు 1.4 శాతంగా ఉంది.

క్షీణించిన రూపాయి

డాలరుతో రూపాయి మారకం విలువ ఇంట్రా-డేలో 19 పైసలు క్షీణించి, రూ. 65.13గా ఉండడం కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

21న ఢిల్లీలో బ్యాంకు

యూనియన్ల ర్యాలీ

కోల్‌కతా: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి)లో ఇటీవల చోటుచేసుకున్న మోసం, ఇతర బ్యాంక్ కుంభకోణాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని తొమ్మిది ట్రేడ్ యూనియన్ల గొడుగు సంస్థ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు.ఎఫ్.బి.యు) డిమాండ్ చేసింది. ''దేశం నుంచి పరారైన ఇద్దరు వజ్రాల వర్తకులు సూత్రధారులుగా ఉన్న ఇటీవలి పి.ఎన్.బి మోసంపై జె.పి.సి.తో సమగ్ర దర్యాప్తు జరిపించాలని మేం డిమాండ్ చేస్తున్నాం. హర్షద్ మెహతా కుంభకోణం తర్వాత, 1992లో జె.పి.సి. దర్యాప్తు జరిపించినట్లుగానే, దీనిపైనా సంయుక్త కమిటీ నియమించాలి'' అని యు.ఎఫ్.బి.యు పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ్ ఖాన్ చెప్పారు. ఆర్.బి.ఐ ఈ బ్యాంకులపై ''సరైన పర్యవేక్షణలో విఫలమైంది'' అని ఆయన అన్నారు. ఆ కారణంగానే ఈ రకమైన కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని, దిగువ స్థాయి ఉద్యోగులను బలి పశువులను చేస్తున్నారని ఆయన విమర్శించారు. పి.ఎన్.బి. జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌లను ఆధారం చేసుకుని చెల్లింపులు జరపడంలో ఉపయోగించిన 'స్విఫ్ట్' సాఫ్ట్‌వేర్‌కి ఆర్.బి.ఐ ఆమోదం ఉన్నట్లేనాని యూనియన్ సందేహం వ్యక్తం చేసింది. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వివిధ సమస్యలను వెలుగులోకి తెస్తూ మొత్తం తొమ్మిది ట్రేడ్ యూనియన్లు మార్చి 21న పార్లమెంట్ ఎదుట ర్యాలీ నిర్వహించనున్నాయి. ''అపారమైన స్థాయిల్లో ఉన్న (బ్యాంకుల) నిరర్థక ఆస్తులు'', కుంభకోణాలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకురానున్నాయి. ప్రతిపాదిత ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ బిల్లును కూడా యు.ఎఫ్.బి.యు వ్యతిరేకిస్తోంది. ఆ బిల్లులోని 'బెయిల్-ఇన్' క్లాజు వల్ల బ్యాంకుల్లోని ప్రజల సొమ్ముకు భద్రత కొరవడుతుందని భావిస్తున్నారు.

కరెంట్ అకౌంట్ లోటు పెరగనుందని అంచనా




న్యూఢిల్లీ: భారతదేశపు కరెంట్ అకౌంట్ లోటు (సి.ఎ.డి) ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి)లో దాదాపు 1.7 శాతంగా ఉండగలని భావిస్తున్నారు. ఒక దేశం నుంచి ఎగుమతయ్యే వస్తువులు, సేవల విలువకన్నా, దిగుమతయ్యే వస్తువులు, సేవల విలువ ఎక్కువగా ఉంటే దాన్ని కరెంట్ అకౌంట్ లోటుగా భావిస్తారు. ఇది దేశ వర్తక కొలమానం. క్యాపిటల్ అకౌంట్ దేశ విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల్లో ఎలా ఒక అంశమో, అలా ఒక దేశానికి చెందిన విదేశీ లావాదేవీలకు కరెంట్ అకౌంట్ ప్రాతినిధ్యం వహిస్తుంది. ముడి చమురు ధరలు అధికంగా ఉండడమే కరెంట్ అకౌంట్ లోటుకు చాలా వరకు కారణమని భావిస్తున్నారు. 2017 డిసెంబరు త్రైమాసికంలో కరెంట్ అకౌంట్ లోటు జి.డి.పి.లో 2 శాతానికి పెరిగింది. దాంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి, వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా కరెంట్ అకౌంట్ లోటు అంచనాను బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ పెంచింది.

ఆ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసుల అగ్ర సంస్థ 2017-18 ఆర్థిక సంవత్సరంలో సి.ఎ.డి. అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచి 1.7 శాతంగా పేర్కొంది. అలాగే 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను 20 బేసిస్ పాయింట్లు పెంచి, జి.డి.పి.లో 1.9 శాతంగా ఉండగలదని పేర్కొంది. డిసెంబరు త్రైమాసికంలో కరెంట్ అకౌంట్ లోటు జి.డి.పి.లో 2 శాతానికి పెరిగి 13.5 బిలియన్ డాలర్లుగా ఉందని, అంతకుముందు ఏడాది అదే కాలంలో అది 8 బిలియన్ డాలర్లుగా లేదా 1.4 శాతంగా మాత్రమే ఉందని, హెచ్చు వాణిజ్య లోటుతో ఈ పరిస్థితి తలెత్తిందని రిజర్వ్ బ్యాంక్ శుక్రవారంనాడు విడుదల చేసిన డాటా వెల్లడించింది. సమష్టి ప్రాతిపదికన చూస్తే, 2017 ఏప్రిల్-డిసెంబరు కాలంలో, జి.డి.పి.లో సి.ఎ.డి రెండింతలకన్నా ఎక్కువగా 1.9 శాతంగా ఉంది.

''రానున్న రోజుల్లో, విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల విషయంలో భారత దేశం మూడు రకాల ఒత్తిడులను ఎదుర్కోవచ్చు. ముడి చమురు ధరలు అధికంగా ఉండి, కరెంట్ అకౌంట్ లోటును సాపేక్షంగా చూస్తే హెచ్చు స్థాయిలోనే ఉంచుతాయి. ఈక్విటీ మార్కెట్ మూల్యాంకనాలు అధికంగా ఉండడం వల్ల ఈక్విటీలలోకి వచ్చే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల మదుపు మొత్తాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్ (ఎం.ఎస్.సి.ఐ)లోకి 'ఎ' షేర్లు ప్రవేశిస్తుండడం వల్ల చైనా మార్కెట్లోకి విదేశీ నిధుల ప్రవాహం పెరగవచ్చు'' అని ఆ నివేదిక వెల్లడించింది. అయితే, జనవరిలో 16.3 బిలియన్ల డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు ఫిబ్రవరిలో కాస్త మెరుగుపడి 12 బిలియన్ డాలర్లుగా ఉందని కూడా నివేదిక పేర్కొంది. ''దీనివల్ల మార్చి త్రైమాసికంలో సి.ఎ.డి 7 బిలియన్ డాలర్లకు పరిమితం కావచ్చు'' అని అది తెలిపింది.

సుజలాన్‌కు దక్కిన రెండు ఆర్డర్లు



హైదరాబాద్: భారతీయ సౌర శక్తి సంస్థ (సెకి) బిడ్డింగ్ ప్రాసెస్ కింద రెండు (300 మెగావాట్లు, 200 మెగావాట్లు) ప్రాజెక్టులను చేజిక్కించుకున్నట్లు పునరుత్పాదక ఇంధన కంపెనీ సుజలాన్ సోమవారంనాడు ప్రకటించింది. 'సెకి' మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులు సుమారు 30 లక్షల గృహాలకు విద్యుచ్ఛక్తి సమకూర్చనున్నాయి. ఏటా సుమారు కోటి టన్నుల సిఓటూ ఉద్గారాలను అరికట్టనున్నాయి. ''మొత్తం 500 మెగావాట్ల విద్యుదుత్పాదనకు సంబంధించిన ఈ రెండు ప్రాజెక్టులు సాంకేతిక విజ్ఞానపరంగా అధునాతనమైన, నవకల్పనలతో కూడిన మా ఉత్పత్తులు, సేవల పట్ల కస్టమర్లకున్న విశ్వాసానికి తార్కాణంగా నిలుస్తున్నాయి. పునరుత్పాదక ఇంధన వనరుల్లో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని కస్టమర్ల విభాగాల నుంచి ఆసక్తి పెరుగుతోంది. వాతావరణ మార్పు రిస్కులను తగ్గించేందుకు తోడ్పడాలన్న తపనతో, అందరికీ సరసమైన ధరలకు పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి విద్యుత్ సదుపాయాన్ని సమకూర్చాలన్న లక్ష్యంతో వారు ముందుకు వస్తున్నారు'' అని సుజలాన్ గ్రూప్ ప్రధాన కార్యనిర్వహణాధికారి జె.పి. చలసాని ఒక ప్రకటనలో తెలిపారు.

''బిడ్డింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో, పరిశ్రమ ఏటా 8-10 గిగావాట్ల చొప్పున వృద్ధి చెందనుంది. దాన్ని మరింత పెంచేందుకు మా కస్టమర్లతో చేయి చేయి కలిపి పనిచేయడానికి మేం నిబద్ధులమై ఉన్నాం. సంప్రదాయసిద్ధమైన, ఇంధన ప్రాబల్య విద్యుత్ వ్యవస్థ నుంచి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు భారతదేశ పరిణామ క్రమానికి చేయూత ఇవ్వనున్నాం'' అని ఆయన చెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో సుజలాన్ రెండు దశాబ్దాలకు పైనుంచి ఉంది. భారతదేశమంతటా 11 గిగావాట్ల పవన విద్యుదుత్పాదన ఆస్తులకు సుజలాన్ సంరక్షకురాలిగా ఉంది. ''అఖిల భారత ఉనికి, సమగ్ర ప్రాడక్ట్ పోర్ట్‌ఫోలియో, సంస్థాగతమైన, బలమైన పరిశోధన, అభివృద్ధి, అత్యుత్తమ సేవలతో భారతదేశంలో పునరుత్పాదక ఇంధన వనరుల విద్యుత్తుకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందుకు సుజలాన్ సన్నద్ధంగా ఉంది'' అని ఆయన పేర్కొన్నారు.

సునీల్ నయ్యర్ చేతికి

సోనీ ఇండియా పగ్గాలు



న్యూఢిల్లీ: సోనీ ఇండియా నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా సునీల్ నయ్యర్ నియమితులయ్యారు. సోనీ ఇండియాకి ఎం.డిగా ఒక భారతీయుడిని నియమించడం ఇదే మొదటిసారి. ఈ నియామకం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది. ''నయ్యర్, ఈ నూతన పాత్రలో కంపెనీ మొత్తంమీద వృద్ధికి నేతృత్వం వహించడంతోబాటు, ఈప్రాంతం లోపల కంపెనీ లాభదాయకతకు బాధ్యత వహిస్తారు. సమీకృత వ్యాపార, మార్కెటింగ్ వ్యూహాన్ని ముందుకు నడిపిస్తారు. అన్ని విభాగాల్లోనూ మార్కెట్ పనితీరులో ఉత్కృష్టతను తీసుకొస్తారు'' అని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కెనిచిరో హిబీ స్థానంలో సునీల్ నయ్యర్ నియమితులయ్యారు. సోనీ ఇండియా ఎం.డి.గా కెనిచిరో హిబీ 2012 నుంచి వ్యవహరిస్తున్నారు. ఆయన ఏప్రిల్ 1 నుంచి సోనీ బ్రెజిల్ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపడతారు.

రిఫండు సమస్యకు పరిష్కారం



న్యూఢిల్లీ: వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) వ్యవస్థ కింద పన్నుల రిఫండులో జాప్యాలపై ఫిర్యాదు చేస్తూ వస్తున్న ఎగుమతిదార్ల కష్టాలను నూతనంగా ప్రవేశపెడుతున్న ఇ-వాలెట్ యంత్రాంగం సమర్థంగా పరిష్కరించగలదని వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. ఇ-వాలెట్ యంత్రాంగం కింద, ఎగుమతిదార్ల పాత చరిత్రను ఆధారం చేసుకుని కొంత మొత్తం వారి ఖాతాలకు జమ అవుతుంది. ఉత్పాదక సామగ్రిపై పన్నులు చెల్లించడానికి వారు ఆ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు ఈ అంశంపై కృషి చేస్తున్నట్లు సురేశ్ ప్రభు వెల్లడించారు. ''ఈ సమస్యకు ఇ-వాలెట్ (యంత్రాంగం) ద్వారా మాత్రమే సరైన పరిష్కారం దొరుకుతుంది. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇ-వాలెట్ నిజంగానే ఈ సమస్యను పరిష్కరిస్తుంది. దీని వల్ల ఎగుమతిదార్లు ముందు చెల్లించి, తర్వాత రిఫండులు కోరే బాధ తప్పుతుంది'' అని ఆయన అన్నారు. పన్నుల రిఫండులో జాప్యం వల్ల చర మూలధనం సర్దుబాటు కావడం లేదని ఎగుమతులు దెబ్బతింటున్నాయని ఎగుమతిదార్లు చెబుతున్నారు. ఎగుమతిదార్లకు రిఫండులో ఇప్పటికి ఎనిమిది నెలల పైనుంచి జాప్యం చోటుచేసుకుంది. కస్టమ్స్ శాఖకి, జి.ఎస్.టి. నెట్‌వర్క్‌కి ఎగుమతిదార్లు సమర్పించిన ఫారాలలో తేడాపాడాలున్నాయని రెవిన్యూ శాఖ వాదిస్తోంది.

నూతన పరోక్ష పన్నుల వ్యవస్థ కింద క్లైమ్ చేసిన సుంకాల రిఫండులో జాప్యం వల్ల సుమారు రూ. 20,000 చిక్కుకుపోయాయని ఎగుమతిదార్లు లబోదిబోమంటున్నారు. జి.ఎస్.టి.కి ముందు ఎగుమతిదార్లకు సుంకాల నుంచి మొదట్లోనే మినహాయింపులు లభించేవి. కానీ, ఇప్పుడు వారు మొదట చెల్లించి, తర్వాత రిఫండు కోరవలసి వస్తోంది. జి.ఎస్.టి. రిఫండుల అంశం గురించి చర్చించేందుకు వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో ప్రధాన మంత్రి కార్యాలయం ఇంతకుముందు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎగుమతిదార్ల పన్ను రిఫండుకు అక్టోబరు 1 నుంచి ఇ-వాలెట్ పథకాన్ని అమలుపరచాలని ఈ నెల మొదట్లో జరిగిన జి.ఎస్.టి. కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. ఇదిఇలాఉండగా, ఎగుమతిదార్లకు పెండింగ్‌లో ఉన్న రిఫండులను వెంటనే మంజూరు చేసేందుకు సి.బి.ఇ.సి. ఫీల్డ్ ఫార్మేషన్లు శనివారం నుంచి 'జి.ఎస్.టి. రిఫండు పక్షాన్ని' ప్రారంభించాయి. లిక్విడిటీ సమస్యను పరిష్కరించడంలో ఇ-వాలెట్ సహాయపడవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్.ఐ.ఇ.ఓ) పేర్కొంది. ఎగుమతిదార్లు దాన్ని రన్నింగ్ ఎకౌంట్‌గా ఉపయోగించుకోవచ్చు. సుంకాలు చెల్లించవలసివచ్చే సరఫరాలను చేపట్టినప్పుడు ఇ-వాలెట్ నుంచి నగదు డెబిట్ అవుతుంది. ఎగుమతులకు సంబంధించిన ఆధారాన్ని అందుబాటులో ఉంచగానే నగదు క్రెడిట్ అవుతుంది.

'ఆ వాటా మేం కొంటాం'

- బినానీ సిమెంట్ కైవసానికి 'కంఫర్ట్ లెటర్' జారీ చేయనున్న అల్ట్రా టెక్



న్యూఢిల్లీ: బినానీ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ, రుణాల భారంతో కుంగిపోయిన, దివాలా ప్రొసీడింగులు ఎదుర్కొంటున్న బినానీ సిమెంట్ లిమిటెడ్ (బి.సి.ఎల్)లో 98 శాతం వాటా కొనుగోలు చేసేందుకు బినానీ ఇండస్ట్రీస్‌తో ఒక ఒప్పందానికి వచ్చినట్లు అల్ట్రా టెక్ సిమెంట్ సోమవారం వెల్లడించింది. బినానీ సిమెంట్ దివాలా ప్రొసీడింగులను నిలిపివేసేందుకు బినానీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కి రూ. 7,266 కోట్ల మేర సౌకర్య లేఖను జారీ చేయనున్నట్లు బి.ఎస్.ఇకి అల్ట్రా టెక్ నివేదించింది. ''ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ కోడ్ ప్రొసీడింగులను విరమించుకునే పక్షంలో బి.సి.ఎల్‌లో 98.47 శాతం వాటా కొనుగోలు చేసేందుకు బి.ఐ.ఎల్‌తో కంపెనీ ఒక వాణిజ్య అవగాహనను సూత్రప్రాయంగా ముగించుకుంది'' అని స్టాక్ ఎక్ఛ్సేంజికి సమర్పించిన పత్రంలో అల్ట్రా టెక్ సిమెంట్ పేర్కొంది. బి.ఐ.ఎల్‌కి రూ. 7,266 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు సౌకర్య లేఖను జారీ చేసేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్లు కంపెనీ వెల్లడించింది. బి.సి.ఎల్‌ను కైవసం చేసుకునేందుకు దానికి రుణాలిచ్చిన సంస్థల కమిటీ (సి.ఓ.సి)కి ఈ మేరకు ఒక పరిష్కార ప్రణాళికను సమర్పించినట్లు తెలిపింది. బినానీ ఇండస్ట్రీస్ రుణదాతల నుంచి తీసుకున్న అప్పులను తీర్చేందుకు నిధులు కావాలని కోరుతూ అల్ట్రా టెక్ సిమెంట్‌ను ఆశ్రయించింది. బినానీ సిమెంట్‌లోని మొత్తం వాటాను అమ్మేందుకు సిద్ధమేనని ఐ.బి.సి ప్రొసీడింగులలో అంగీకరించింది. సౌకర్య లేఖను జారీ చేయవలసిందిగా అల్ట్రా టెక్ సిమెంట్‌ను కోరింది. దాన్ని చూపించి ఐ.బి.సి ప్రొసీడింగులను బినానీ ఇండస్ట్రీస్ నిలిపివేయించనుంది.


'యాక్సిస్ బ్యాంక్ గ్యారంటీలు స్వీకరించవద్దు'

AXIS BANK

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ జారీ చేసే బ్యాంక్ గ్యారంటీలను స్వీకరించకూడదని టెలికాం శాఖ (డాట్) ఆదేశించింది. దేశంలో మూడవ అతి పెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్ ఇంతకు ముందు జారీ చేసిన గ్యారంటీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని టెలికాం శాఖ పేర్కొంది. ఈ మేరకు అది మార్చి 16న ఒక ఆఫీస్ మెమొరాండం జారీ చేసింది. ''ఎయిర్‌సెల్ గ్రూప్ కంపెనీల తరపున జారీ చేసిన బ్యాంక్ గ్యారంటీని నిలబెట్టుకోవడంలో యాక్సిస్ బ్యాంక్ విఫలమైంది. ఇది భారత ప్రభుత్వంతో ఉన్న నమ్మకం, కాంట్రాక్టుకు సంబంధించి తీవ్ర ఉల్లంఘన కిందకు వస్తుంది'' అని 'డాట్' పేర్కొంది. ఒప్పందం ప్రకారం అంగీకరించిన అంశాలను నెరవేర్చేందుకు టెలికాం కంపెనీలు సాధారణంగా బ్యాంక్ గ్యారంటీలను సమర్పిస్తూ ఉంటాయి. ఒప్పందంలో పేర్కొన్న వాటిని నెరవేర్చడంలో విఫలమైతే, ప్రభుత్వం బ్యాంక్ గ్యారంటీని నగదుగా మార్చుకోవచ్చు. ఎగవేతదారును శిక్షించే సాధనంగా అది ఉపయోగపడుతుంది. ఈ బ్యాంక్ గ్యారంటీలను బ్యాంకులు లేదా ఇతర రుణ ప్రదాన సంస్థలు జారీ చేస్తాయి. ఈ గ్యారంటీని ఏ సంస్థ తరపున సమర్పిస్తున్నారో ఆ సంస్థ చెల్లించడంలో విఫలమైతే, ఆ మొత్తాన్ని తాము చెల్లిస్తామని వాగ్దానం చేస్తాయన్న మాట. ''భారతీ ఎయిర్‌టెల్ తరపున బ్యాంక్ గ్యారంటీలు సమర్పించా''మని యాక్సిస్ బ్యాంక్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ''ఎగువ పేర్కొన్న గ్యారంటీల చెల్లింపు, ప్రస్తుతం, టెలికాం వివాదాల పరిష్కార, అప్పిల్లేట్ ట్రైబ్యునల్ (టి.డి.ఎస్.ఎ.టి) ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుం''దని, అందుకే చెల్లించలేకపోయామని ఆ ప్రతినిధి చెప్పారు. ఆ బ్యాంక్ గ్యారంటీ ఎయిర్‌సెల్‌కు కాక భారతీ ఎయిర్‌టెల్ కోసం జారీ చేశారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. ఎయిర్‌సెల్ స్పెక్ట్రంను భారతీ ఎయిర్‌టెల్ ఉపయోగించుకుంటున్నదానితో ముడిపడిన అంశమిది. యాక్సిస్ బ్యాంక్ జారీ చేసే కొత్త బ్యాంక్ గ్యారంటీలను ఆమోదించవద్దనే ఆదేశాలు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, ఎయిర్‌సెల్‌తో సహా అందరు ఆపరేటర్లకు వెళ్ళాయి.

ఐఆర్బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి


రూ. 2043 కోట్ల ఆర్డరు



న్యూఢిల్లీ: ప్రభుత్వ నిర్వహణలోని ఎన్.హెచ్.ఎ.ఐ నుంచి గుజరాత్‌లో రూ. 2,043 కోట్ల విలువైన రహదారి నిర్మాణ ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ఐ.ఆర్.బి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ సోమవారంనాడు వెల్లడించింది. ఈ ఆర్డరు కింద వడోదర కిమ్ ఎక్స్‌ప్రెస్‌వేలో 355 కిలోమీటర్ల నుంచి 378.74 కిలోమీటర్ల వరకు (పడ్రా నుంచి వడోదర-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేలో వడోదర సెక్షన్ వరకు) ఎనిమిది లేన్‌ల రహదారిని నిర్మించవలసి ఉంటుంది. ఈ ప్రాజెక్టుతో కలుపుకొని కంపెనీ వద్ద ప్రస్తుతం సుమారు రూ. 12,000 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. వాటిని మూడేళ్ళ లోగా పూర్తి చేయవలసి ఉంటుంది. కంపెనీ షేర్ ధర బి.ఎస్.ఇలో రూ. 220.70 వద్ద కోట్ అవుతోంది.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 20 మార్చి 2018

శ్రీరామునిలో ఆదర్శతత్త్వం, ఆరాధ్యతత్త్వం రెండూ ద్యోతకమవుతాయి. రాముడు పాటించిన ధర్మాలను గ్రహించి పాటిస్తే అది ఆదర్శతత్త్వం. రాముణ్ణి దైవంగా ఆరాధిస్తే ఆరాధ్యతత్త్వం. రామ అని పరబ్రహ్మమునకు పేరు. రామ అనే రెండక్షరాలు తారకమంత్రం అన్నమాట యజుర్వేదం చెప్పింది. తారకం తరింపచేసేది. సారం అని అర్థం. రామ మంత్రాన్ని 'తార తారతర తారక మంత్రం'గా వేదం అభివర్ణించింది. పంచాక్షరి, అష్టాక్షరీ మహామంత్రాలలోని జీవాక్షరాల సంపుటి రామనామం. దేవీ నవరాత్రులు, గణపతి నవరాత్రుల మాదిరిగా శ్రీరామ నవరాత్రులను మనవారు పాటిస్తారు.



ఆదిదేవో మహాబాహుః హరః నారాయణః ప్రభుః
సాక్షాద్రామో రఘుశ్రేష్ఠః శేషో లక్ష్మణ ఉచ్యతే

ఆదిదేవుడైన శ్రీమహావిష్ణువే రామచంద్రప్రభువుగా, ఆదిశేషుడు లక్ష్మణునిగా ఆవిర్భవించారని రామాయణ పట్టాభిషేక ఘట్టంలోని ఈ శ్లోకం తెలియచేస్తోంది. అయినప్పటికీ రాముడు ఎప్పుడూ తాను అవతారమూర్తినని ప్రకటించలేదు. 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం' అని మాత్రమే చెప్పుకున్నాడు. కారణం రావణుడు సంపూర్ణ మానవుడి చేతిలో మాత్రమే మరణిస్తాడు కనుక. ఋషులు, దేవతలు రామావతార పరమార్థాన్ని ఎరిగినవారు కనుక ఆయనను అవతార కాలంలోనూ పూజించారు. అవతార సమాప్తి తరువాత కూడా పూజించారు.

శ్రీరామ జయరామ సీతా రామా!

నాలుగు నవరాత్రులు

పరాశర సంహితలో శ్రీరామపూజావిధానం విపులంగా ఉంది. శ్రీరాముడికి నాలుగు నవరాత్రులు ఇష్టమని, ఆ నవరాత్రులలో ఆయనను పూజిస్తే సకల శుభాలు, కైవల్యం కూడా లభిస్తుందని అందులో ఉంది. ఆశ్వయుజ మాసం, చైత్రమాసం, వైశాఖమాసం, మాఘమాసం. – ఈ నాలుగు మాసాలలో శ్రీరామనవమితో కూడిన చైత్రమాసం ఉత్తమమైనది. విజయదశమితో కూడిన ఆశ్వయుజ మాసానికి శ్రీరామపూజలో రెండోస్థానం ఇచ్చారు. నాలుగు మాసాలలోనూ శుక్ల పాడ్యమి నుంచి నవమి వరకూ శ్రీరాముని అర్చించి, సీతారామకల్యాణం జరిపించినవారికి ఇంద్రపదవి లభిస్తుందని వశిష్ఠుడు, బృహస్పతి చెప్పారు. చైత్రమాసంలోని శుక్లపక్ష నవమినాడు శ్రీరాముని పూజించి, కల్యాణం చేసి తరించమని సూతసంహితలో కూడా ఉంది. భగవంతునికి జన్మతిథినాడే కల్యాణం జరిపించాలని బృహస్పతి వచనం. అందుకే శ్రీరాముడు పుట్టిన నవమీతిథినాడే సీతాకల్యాణం చేస్తారు.



శ్రీరామ పూజావిధి

వసంత నవరాత్రులలో శ్రీరాముని పూజించడానికి కొన్ని నియమాలున్నాయి. ఫాల్గుణ మాసంలోని అమావాస్యనాడు పూజకు కావాల్సిన సామాను తెచ్చుకోవాలి. పాడ్యమినాడు ఒకపీటమీద కొత్తవస్త్రం పరిచి దానిమీద రెండు కిలోల బియ్యం పోయాలి. శ్రీరాముని సీతాలక్ష్మణ హనుమత్ సమేతంగా నిలబెట్టాలి. అంటే విగ్రహం కానీ, పటంకానీ మంటపంపై పెట్టాలి. ఒక చెంబును కలశంగా ఉంచి అందులో శ్రీరామప్రతిష్ఠ చేయాలి. షోడశోపచారాలు చేయాలి. ఈ విధంగా తొమ్మిదిరోజులు శ్రీరామార్చన చేయలేనివారు నవమినాడు చేసుకుంటే చాలు.

సంపదలు కావాలనుకుంటే శ్రీరాముని గన్నేరు పూలతో పూజించి, దానిమ్మపళ్లు నైవేద్యం పెట్టాలి. పదవి కావాలనుకుంటే సంపంగి పూలతోనూ, మారేడు ఆకులతోనూ పూజించి అరటిపళ్లు, కొబ్బరికాయ నైవేద్యం పెట్టాలి. సకల శుభాలు కలగాలనుకుంటే తొమ్మిదిరోజులపాటు మందారం మొదలైన పుష్పాలతో శ్రీరాముని పూజించి అన్నం నివేదన చేయాలి.

శ్రీరామనవమి విధులు

ప్రతివ్యక్తి తల్లి కడుపులో తొమ్మిది నెలలు ఉండి ఆ తరువాత జన్మిస్తాడు. అందుకే జన్మకి గర్భవాస నరకమని పేరు. ఆ నరకం రాకుండా ఉండాలంటే అనగా పునర్జన్మ లేకుండా ఉండాలంటే వసంతనవరాత్రులు తొమ్మిదిరోజులపాటు యథాశక్తి రాముని పూజించి సంపూర్ణ వాల్మీకి రామాయణాన్ని పారాయణ చేయాలని పరాశరులవారు చెప్పారు. తరచుగా వచ్చే రోగాల నుంచి బయటపడడానికి, భార్యాభర్తల మధ్య ఐకమత్యం కలగడానికి శ్రీరామ నవమినాడు పానకం, వడపప్పు నివేదన చేసి కొంత ప్రసాదంగా స్వీకరించి మిగిలినది భక్తులకు పంచిపెట్టాలని శౌనక సంహితలో ఉంది.



శ్రీరామ కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల బియ్యాన్ని పెళ్లి కావలసిన స్త్రీ పురుషులు శిరస్సులపై చల్లితే వారికి వివాహయోగం కలుగుతుంది. ఆ కల్యాణపు బియ్యాన్ని ఇంటిలోని బియ్యపు డబ్బాలో పోసుకుంటే జీవితంలో అన్నానికి కరవు రాదని బృహస్పతి స్మృతి చెబుతోంది. ముత్యాల తలంబ్రాలు పూజామందిరంలో దాచుకున్నా, ఆభరణాలుగా ధరించినా, ఇతరులకు ఇచ్చినా సకల సంపదలు లభిస్తాయి. శ్రీరామనవమినాడు చేసే అన్నదానం నరకభయం నుంచి రక్షిస్తుంది.

– వద్దిపర్తి పద్మాకర్
త్రిభాషా మహాసహస్రావధాని

భద్రాద్రి రామయ్య కల్యాణం

యస్తు భద్రనగే పుణ్యే జపం కుర్యాత్తు భక్తితః
సహస్ర గుణితం పుణ్యం తస్యభూయాద్ధరాతలే

భద్రాచల క్షేత్రంలో ఎవరైతే భక్తితో శ్రీరామమంత్రాన్ని జపిస్తారో ఆ జపానికి వెయ్యిరెట్లు ఫలం లభిస్తుంది అని పరాశర సంహిత చెప్పింది. శ్రీరామక్షేత్రాలలో భద్రాచలం విలక్షణం. అవతారం చాలించిన తరువాత వైకుంఠ నారాయణుడు మళ్లీ శ్రీరామరూపాన్ని ధరించి, అర్చామూర్తిగా వెలిసిన అద్వితీయ రామక్షేత్రం ఇదే. అందుకే ఈ క్షేత్రంలో శ్రీరాముడు నాలుగుచేతులలో శంఖ–చక్ర, ధనుర్బాణాలను ధరించి శ్రీరామనారాయణునిగా నాన్యతో దర్శనీయమైన వైభవంతో ప్రకాశిస్తున్నాడు. భద్రాద్రిలో సీతారామకల్యాణం శ్రీరామనవమి పర్వదినాన జరుగుతుంది. అష్టమి తిథితో కూడని నవమి తిథినాడు మాత్రమే శ్రీరామనవమిని ఆచరించడం సంప్రదాయం. ఒకవేళ సూర్యోదయానికి అష్టమి ఉన్నట్లయితే దశమినాడే శ్రీరామనవమిని పాటిస్తారు

భద్రాద్రిలో కల్యాణోత్సవం... వసంత నవరాత్రి ప్రయుక్తంగా నిర్వహిస్తారు. సప్తమి నుంచి ఆహ్నికం మొదలవుతుంది. పౌర్ణమినాటికి పూర్ణాహుతి జరుగుతుంది. ద్వాదశారాధనలతో ముగిసే బ్రహ్మోత్సవాలు ఇవి. వసంత నవరాత్రులకు, బ్రహ్మోత్సవాలకు మధ్యలో జరిగే కమనీయమైన సేవ భద్రాద్రి కల్యాణంలో ఎన్నెన్నో విశేషాలు ఉన్నాయి. భద్రగిరి సీతారామ కల్యాణంలో మూడు మాంగల్యాలు ఉంటాయని శ్రీరామ భక్తులందరికీ తెలిసిన విషయమే. కల్యాణంలో మరో సంప్రదాయం ఏమిటంటే గులాం కలిపిన గులాబీరంగు అక్షతలను వినియోగిస్తారు. తెలుగువారికే సొంతమైన జీలకర్ర, బెల్లం, తలంబ్రాలు పోసుకోవడం వంటివి కల్యాణ ప్రకరణ శాస్త్రానికి విరుద్ధం కాని రీతిలో సీతారామకల్యాణంలో చేరింది. అలాగే 'వారణ మాయిరం' అనే తమిళ పాశురాలతో జరిగే బంతులాట కూడా సంప్రదాయ సిద్ధమైన వేడుకే. సామాన్యుని హృదయంలో సీతారాముల కల్యాణానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇతర దేవతామూర్తుల కల్యాణాలలో భక్తి ప్రపత్తులే ఉంటాయి. కానీ సీతారాముల కల్యాణంలో ప్రేమానురాగాలు పరిఢవిల్లుతాయి. అందునా భద్రాచల కల్యాణంతో భక్తులకు అనుబంధం ఎక్కువ. 24 వైదికములైన అంశాలతో మూడుగంటలపాటు నయన మనోహరంగా భద్రాద్రి సీతారాముల కల్యాణం జరుగుతుంది.

– డా. కె. పూర్ణప్రజ్ఞాభారతి

గీతరామాయణం – 4

అభినవపోతన వానమామలై వరదాచార్యులు మరాఠీ భాష నుండి తెలుగులోకి అనువదించారు. ఆచార్యుల వారి సహజపాండిత్య ప్రతిభతో శ్రీరామకథ సర్వజనామోదం పొందింది.

కిష్కింధకాండ



వనవాస మనుభవించుచు నుంటిని నేనును రామా
ఆద్యంతము విన్నావియ్యది హనుమతోడ శ్యామా
దుఃఖితుడే దుఃఖితునకు వెతనుపకరించు చాలా

సుగ్రీవుడు చక్కని మాట చెప్పాడు. దుఃఖంలో ఉన్నవాడికి సాయం చేయడానికి మరో దుఃఖంలో ఉన్నవాడే ముందుకు వస్తాడు. చక్కగా సుఖభోగాలు అనుభవిస్తున్న వాడికి దుఃఖోపజీవుల వెతలు పట్టవు. వాలిని చెట్టుచాటు నుంచి చంపిన రాముడు అతనితో అన్నాడు గదా...

రూపొందిన మదరూపుడ వీవు
తగినశిక్ష నీకగు నీ చావు
విషయాంధుల తుదిగతి ఈనోవు
మృగయు చేతిలోనగు పశుమరణము

వేటగాని చేతిలో మరణించిన పశువా నీకిదే తగిన అంటూనే శ్రీరాముడు వాలి తమ్ముడు సుగ్రీవుడు కిష్కింధకు రాజును చేశాడు. అతని కొడుకు అంగదుణ్ణి యువరాజును చేశాడు.

అంజని సుతుడీయన యతిబలుడు
ఇతడనిలుకును సుతు డంశజుడు
బలహతి దిగ్గజముల గూల్చునితడు
బలవంతుడు ధీమంతుడు

సముద్రం లంఘించడానికి ఎవ్వరికీ శక్తిలేకపోయింది. జాంబవంతుడు పరిస్థితిని గుర్తించి హనుమంతునికి శక్తిని గుర్తు చేశాడు. హనుమా ఆత్మనిశ్చయము చేసుకో. ఈ కపిగణం అంతా నీ సరిసాటికాదు. వామనుని వలె నీ పదం పైకి లేపు. సముద్రాన్ని ఒక్క ఉదుటన లంఘించు అంటూ పురికొల్పాడు.

– ముకుందప్రియ

మారేడు దళం

తొలి వ్యాఖ్య


తెలుగువారి పుణ్యపేటి బమ్మెర పోతన. ఆయన కలంనుంచి జాలువారిన ప్రతి అక్షరం రససింధువే. పోతన కవితామాధుర్యాన్ని చవిచూడని తెలుగువాడు లేడు. భాగవతంతో పాటు ఆ సహజకవి రచించిన మరో కృతి వీరభద్ర విజయము. దక్షయజ్ఞ విధ్వంసం కోసం శివుని జటాజూటం నుంచి జన్మించిన వీరభద్రుని విజయగాథను ఈ కావ్యంలో పోతన రూపుకట్టించాడు. మహాభాగవతంలోని పద్యాలు అనేకం ప్రార్థనా శ్లోకాలుగా స్థిరపడ్డాయి.అలాగే వీరభద్ర విజయంలో శివస్తోత్రాలుగా పారాయణ చేయదగ్గ స్థాయిలో ఉంటాయి. అలాగే పోతన శైలిలోని సహజ మధుర సుందర పద్యాలను ఈ కృతిలో చూడవచ్చు. దీనిని మొదట 1960లో వావిళ్లవారు ముద్రించారు. మళ్లీ ఇన్నేళ్లకు కాశీభొట్ల సత్యనారాయణ వీరభద్ర విజయానికి అందమైన వ్యాఖ్యను రచించారు. ఔచిత్య సుందరంగా, పాఠకమనోజ్ఞంగా రచనలు చేయడం కాశీభొట్ల రచనాశైలి. అందుకు తగ్గట్లుగానే వీరభద్ర విజయంలోని అంతరార్థాలు, భావాలను విశ్లేషిస్తూ సమగ్ర సుందర వ్యాఖ్యానం అందించారు. ఇది వీరభద్ర విజయానికి తొలి వ్యాఖ్యానం. పోతన కవితా రసాన్ని అందరూ తనివి తీరా గ్రోలేందుకు వీలైన రీతిలో కాశీభొట్ల వారి వ్యాఖ్య ఉంది.



**బమ్మెర పోతన 'వీరభద్ర విజయము'
వాఖ్యానం : కాశీభొట్ల సత్యనారాయణ,
పేజీలు : 384, వెల : రూ. 225, ప్రతులకు :
ఎస్.ఆర్. బుక్ లింక్స్, దానయ్య వీధి,
మాచవరం, విజయవాడ తో పాటు అన్ని
ప్రముఖ బుక్ హౌస్ లూ.**

దైవవాణి

సంస్మరణ



నా దాసుడు నన్ను స్మరించినప్పుడు, నా సంస్మరణ కోసం అతని పెదాలు కదిలినప్పుడు నేను అతని దగ్గరలోనే ఉంటాను అని అల్లాహ్ సెలవిచ్చారు. దగ్గరలోనే ఉంటానంటే అతన్ని దైవం తన పరిరక్షణలోకి తీసుకున్నాడని అర్థం. దైవధ్యానం అనేది మానసిక ఏకాగ్రతతో మాత్రమే కాకుండా నోటితోనూ జరగాలి. ప్రతి విషయంలో దైవ సంస్మరణను ముఖ్యాంశంగా పాటించే విశ్వాసికి దైవం నిత్య సన్నిహితుడవుతాడు.

ఒక పల్లెటూరి వ్యక్తి మహాప్రవక్త (స) వద్దకు వచ్చి, నేను నిత్యం పఠించుకోవడానికి ఏదైనా సద్వచనం నేర్పండి అని అర్థించాడు. దానికి ఆయన ''లా ఇలాహ ఇల్లల్లాహు వహ్ దహూ లాషరీకలహూ అల్లాహు అక్బర్ కబీరా వల్ హద్దులిల్లాహి కసీరా వ సుబ్ హానల్లాహి రబ్బిల్ ఆలమీన్ లాహౌల వలా కువ్వత ఇల్లా బిల్లాహిల్ అజీజుల్ హకీమ్'' అని ధ్యానించు అని ఉపదేశించారు. ఇది విని అతడు తిరిగి అడిగాడు. అల్లాహ్ కు సంబంధించినంత వరకు ఇది సరే ఇక నేనేమి అర్థించాలి? అని. అప్పుడు ప్రవక్త, ''అల్లాహుమ్మగ్ ఫర్ లీ వర్ హమ్ నీ వహ్దిని వర్ జుక్ నీ – అని అర్థించు'' అని ఉపదేశించారు.

మొదట నేర్పిన సద్వచనానికి అర్థం... అల్లాహ్ తప్ప వేరే దైవం లేనే లేడు. ఆయన కేవలం ఒక్కడే. దైవత్వంలో ఆయనకు సహవర్తులు ఎవరూ లేరు. అల్లాహ్ ఎంతో గొప్పవాడు. స్తోత్రములు, అభివందనాలు ఆయనకే. అల్లాహ్ సకల విధాల లోటుపాట్లకు, లోపాలకు అతీతుడు. ఆయన పరిశుద్ధుడు, సర్వలోకాలను పాలించేవాడు, పోషించేవాడు ఆయనే. అల్లాహ్ తప్ప ఇతరులెవ్వరి వద్ద కూడా ఎలాంటి శక్తిసామర్థ్యాలు లేవు. ఆయన సర్వాధిపత్యం కలవాడు. వివేకము విజ్ఞానమూ కలవాడు సర్వోన్నతుడైన ఆయనే.

రెండోసారి నేర్పిన సద్వచనానికి అర్థం... అల్లాహ్! నా అపరాధాలను మన్నించు. నాపై నీ కారుణ్యాన్ని కురిపించు. నన్ను నడిపించు. నాకు నా ఉపాధిని ప్రసాదించు.

– ముహమ్మద్ లియాఖత్ ఉద్దీన్

ధర్మ సందేహం

ఒక్కసారి శ్రీరామ అంటే వెయ్యిసార్లు విష్ణునామాన్ని జపించిన ఫలితం కలుగుతుందా?

శ్రీరామ రామ రామేతి – మూడుసార్లు రామనామం చెబితే వెయ్యిసార్లు విష్ణునామస్మరణ చేసిన ఫలితం కలుగుతుందని చెప్పారు.

రామ అంటే 'ర అ మ' అనే మూడు బీజాక్షరాల సంపుటి. మంత్రశాస్త్రంలో ర అంటే అగ్నిబీజం అంతరంగాన్ని శుద్ధి చేస్తుంది. అ అంటే సూర్యబీజం... జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది, మ అంటే చంద్రబీజం... శాంతి, ఆనందాలనిస్తుంది. రామనామం జపించినందువల్ల ఆ మూడు బీజాక్షరాల శక్తి అంటే శుద్ధి, జ్ఞానం, శాంతి, ఆనందాలు లభిస్తాయి. శ్రీచక్రం తొమ్మిది ఆవరణలు కలిగినది. వాటిలో మొదటి మూడూ అగ్ని ఆవరణలు. తరువాతవి సూర్య చంద్ర ఆవరణలు. రామ అనే మంత్రాన్ని ధ్యానిస్తే శ్రీచక్రాన్ని అర్చించిన ఫలితం వస్తుంది. కుండలినీ చక్రంలో మూలాధారం నుంచి మొదలుపెట్టి మొదటి రెండూ అగ్ని, తరువాతవి వరుసగా సూర్య, చంద్ర మండలాలుగా భావించాలి. రామ మంత్రాన్ని జపం చేస్తే మనకు తెలియకుండానే కుండలినీ శక్తి జాగృతం అవుతుంది.



రెండు అంకెల మధ్య ఏమీ లేకపోతే గుణకారం జరిగింది గణితం చెబుతోంది. రామ అనే రెండక్షరాల మధ్య గుణకారం జరుగుతోంది. ఓం నమోనారాయణాయ అనే అష్టాక్షరిలో ఐదో అక్షరం 'రా', నమశ్శివాయ అనే పంచాక్షరిలో రెండో అక్షరం 'మ'. రామ అనేసరికి 5X2 పదిసార్లు నామోచ్చారణ జరిగింది. మూడుసార్లు 'రామ రామ' అనమన్నాడు శివుడు. దానర్థం 10 X 10 X 10 = 1,000 అవుతుందనే కదా! రామనామమే తారకమంత్రం. దానిని ఉపాసించి భక్తులందరూ మోక్షంపొందారు.

సమాధానం: డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

మనం స్పోర్ట్స్
మంగళవారం 20 మార్చి 2018
www.manamnews.com

డీకే (దినేశ్ కార్తీక్) అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేశాడు. ఒక్క మ్యాచ్‌తో హీరో అయిపోయాడు. చివరి బంతికి అద్భుతం చేసి ప్రపంచ క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నాడు. అయ్యో ....ఓడిపోతామా అనుకుంటున్న తరుణంలో కొట్టిన ఆ సిక్స్‌తో ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కావాల్సిన ఐపీఎల్ మూడ్‌ను ముందే తెచ్చేశాడు. భారత్‌కు మరచిపోలేని విజయాన్నందించి మరో మహేంద్రుడయ్యాడు. టి 20ల్లో విజయాలందించగల మరో మొనగాడు భారత్‌కు దొరికాడు.



శభాష్.. దినేష్



కోహ్లీ ఉంటే ఎంత బావుండేది... ఓటమి తప్పదా.. డికే (దినేశ్ కార్తీక్) ఇప్పుడేం చేస్తాడో.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య క్రికెట్ ప్రేమికుడి మదిని తొలిచిన ప్రశ్నలు ఇవి. థ్రిల్లర్‌కే థ్రిల్లర్‌లా అనిపించిన ఈ మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకున్న తరుణంలో అసాధారణ సిక్స్ కొట్టి శ్రీలంక టి20 సిరీస్‌కు అపూర్వమైన ముగింపు ఇచ్చి దటీజ్ కార్తీక్ అని ప్రూవ్ చేశాడు. ఎక్కడా తొణకుండా.. ఏమాత్రం భయం లేకుండా కొట్టిన ఆ సిక్స్ ఇప్పట్లో భారత్ అభిమానులెవరూ మరచిపోలేరు. ఆ సిక్సేకాదు.. ఈమ్యాచ్‌లో డీకే ఇన్నింగ్స్ కూడా మెమరబుల్.

ఛేజింగ్‌లో చివరి బంతికి సిక్స్ కొట్టే టెంపో మ్యాచ్ చాలా రోజుల తర్వాత అభిమానులకు కనువిందు చేసింది. ఐపీఎల్ హోరులో కొట్టుకుపోతే తప్ప ఈ ఆదివారం నాటి మ్యాచ్‌లో కార్తీక్ కొట్టిన షాట్ క్రికెట్ ప్రేమికులు పదే పదే గుర్తుంచుకుంటారు. జస్ట్ ఎనిమిదంటే ఎనిమిది బంతులు.. మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లు మొత్తంగా 29 పరుగులు చేసి ట్రై సిరీస్ ఫైనల్ కథను మార్చేసిన హీరో అయ్యాడు. అప్పుడెప్పుడో మియాందాద్ చివరి బంతికి సిక్స్ కొడితే ఇప్పుడు మళ్లీ కార్తీక్ అలాంటి షాట్‌తోమ్యాచ్ విన్నర్ అయ్యాడు. భారత అభిమానులే కాదు శ్రీలంక అభిమానులు కూడా పండగ చేసుకునేలా చేసి మొనగాడయ్యాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన కార్తీక్ వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్‌గా జట్టుకు సేవలందించాడు. ధోనీ జట్టులో ఉండటంతో దినేశ్ కార్తీక్‌కు ఛాన్స్ దక్కటం కష్టమే అయ్యేది. ఒక వేళ జట్టులో చోటు దక్కినా తనకంటే ముందే మ్యాచ్ ఫినిష్ చేసే బ్యాట్స్‌మెన్ ఉండటమో.. లేక తనదాకా బ్యాటింగ్ రాకపోవటమో అలవాటైపోయింది. 2006 నుంచి నిన్నటి మ్యాచ్ వరకూ దినేశ్ కార్తీక్ ఆడిన టి20లు కేవలం 19 మాత్రమే. వెస్టిండీస్‌తో నిరుడు కింగ్స్‌మేడ్‌లో జరిగిన మ్యాచ్‌లో చేసిన 48 రన్స్ కార్తీక్‌కు టి20ల్లో హయ్యస్ట్ స్కోరు. అందుకేనేమో టిట్వంటీ ట్వంటీల్లో ఏమైనా జరగొచ్చుకున్న ఓపీనియన్‌ను మరో సారి ప్రూవ్ చేశాడు. మళ్లీ అవకాశం వస్తుందో రాదో అని కసికొద్దీ ఆడి అసాధారణ రీతిలో బంగ్లా టైగర్లకు రివర్స్ పంచ్ ఇచ్చాడు. దేశవాళీ టోర్నీల్లో టన్నుల కొద్దీ రన్స్ చేసిన దినేశ్ కార్తీక్‌కు ఇన్నింగ్స్ ఓపెన్ చేయగల సత్తా కూడా ఉంది. అయితే తనకంటూ ఓ రోజు రాకపోదా అంటూ ఇన్నాళ్లూ ఎదురు చూశాడు. బంగ్లాపై కిల్లర్ ప్లేయర్ అయ్యాడు. తన పవర్ ఏమిటో చూపెట్టాడు. 2019 ప్రపంచ కప్ కోసం యువ ప్రయోగాలు చేస్తున్న భారత సెలెక్టర్లకు దినేశ్ కార్తీక్ ఓ ఆయుధంలా దొరికినట్టే. ఇప్పుడు కేవలం టి20లకే పరిమితమైన ధోనీ అప్పటి దాకా ఉంటాడో లేడో తెలియని పరిస్థితి మొదలైంది. ఈ తరుణంలో కొత్త వికెట్ కీపర్ల కంటే అనుభవజ్ఞుడైన దినేశ్ కార్తీక్‌కు అవకాశమివ్వటమే సరైన ఎంపికవుతుది కూడా. ఐపీఎల్‌లో ఓ సారి ఖరీదైన ఆటగాడు కూడా అయిన కార్తీక్ ఇక ఏప్రిల్ మొదటి వారంలో మొదలయ్యే కొత్త సీజన్‌లో ఎలాంటి మెరుపులు మెరిపించబోతున్నాడో ముందే చెప్పేశాడు. కొలంబో ఇన్నింగ్స్ లో కార్తీక్ సాధించిన స్ట్రైక్ రేట్ (362.50) కూడా తిరుగులేనిదే. ఇప్పటి వరకూ యువరాజ్ సింగ్ టిట్వంటీల్లో హయ్యస్ట స్ట్రైక్ రేట్‌తో టాప్ పేస్‌లో ఉండగా.. యువరాజ్ సరసన తాజాగా దినేశ్ కార్తీక్‌చేరాడు ఇక టి20ల్లో హయ్యెస్ట్ స్ట్రైక్ రేట్ సాధించిన మూడో ఆటగాడిగానూ కార్తీక్ రికార్డుల్లోకెక్కాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు స్మిత్ 414.28 స్ట్రైక్ రేట్‌తో ఫస్ట్ ప్లేస్‌లో ఉంటే.. యువరాజ్ సింగ్ రెండో ప్లేస్‌లో, కార్తీక్ మూడో స్థానంలో ఉన్నారు.

ఎప్పటి నుంచో ఆ షాట్లను ప్రాక్టీస్ చేస్తున్నా

ఎక్స్‌ట్రా కవర్ మీదుగా సిక్స్ కొట్టి భారత్‌కు టి20టోర్నీ ఫైనల్లో మరపురాని విజయాన్నందించిన కార్తీక్ తన విన్నింగ్ షాట్ గురించి వివరించాడు. ఆ షాట్లను చాలా కాలం నుంచి ప్రాక్టీస్ చేస్తున్నాని చెప్పాడు. 'ప్రస్తుతం నేనున్న స్థానంలో సంతోషంగా ఉన్నా, కొన్ని నెలలుగా మద్దతు ఇస్తున్న ఫ్యాన్స్‌కు నా థ్యాంక్స్' అని కార్తీక్ మ్యాచ్ ముగిశాక చెప్పాడు. యువ కువలతో కూడిన జట్టుతో ఈ టోర్నీలో మెరుగ్గా రాణించటమేనన్నాడు. ఇక ఇలా ఇన్నింగ్స్ ప్రశాంతంగా ముగించటం ధోనీ నుంచి చూసి నేర్చుకున్నానని దినేశ్ కార్తీక్ అన్నాడు. ఒత్తిడిలో క్రీజ్‌లో అడుగు పెట్టి అద్భుతైన షాట్లతో అలరించి మ్యాచ్‌ను టర్న్ చేసిన ఈ మొనగాడు చెబుతున్నాడు.

కొత్తచరిత్ర

టార్గెట్ ఛేజింగ్‌లో భారత్ తరపున అంతర్జాతీయ టి20ల్లో చివరి బంతికి సిక్స్ కొట్టి జట్టను గెలిపించిన ఆటగాడు కార్తీక్ ఒక్కడే. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కార్తీక్ చివరి బాల్ సిక్స్ కొట్టి కార్తీక్ ఆ ప్రత్యేకతను సాధించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో టార్గెట్ ఛేజింగ్‌లో చివరిబంతికి సిక్స్ కొట్టి జట్టును గెలిపించిన భారత ఆటగాడిగానూ కార్తీక్ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు లక్ష్య ఛేదనలో భారత్ తరపున అంతర్జాతీయ టీ20 క్రికెట్లో చివరి బంతికి సిక్స్ కొట్టి జట్టును గెలిపించిన ఆటగాడే లేడు. నిన్న బంగ్లాతో జరిగిన మ్యాచ్లో దినేశ్ కార్తీక్ ఆ ప్రత్యేకత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో లక్ష్య ఛేదనలో చివరి బంతికి సిక్స్ బాది జట్టుకు విజయం అందించిన ఐదో ఆటగాడిగానూ కార్తీక్ రికార్డు సృష్టించాడు. 2010లో టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంకకు చెందిన చమర కపుగెదర.. భార త్‌పై, 2012లో ఇంగ్లాండ్ ఆటగాడు ఇయాన్ మోర్గాన్.. భారత్‌పై 2013లో పాకిస్థాన్ ఆటగాడు జుల్ఫికర్ బాబర్.. వెస్టిండీస్‌పై 2014లో టీ20 ప్రపంచకప్లో నెదర్లాండ్స్‌పై జింబాబ్వే ఆటగాడు ఊసి సిబాండ మాత్రమే ఇప్పటి వరకు చివరి బంతిని సిక్స్ కొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. గతంలో అంతర్జాతీయ క్రికెట్‌లో జావెద్ మియాందాద్ (పాకిస్థాన్), రియాన్ మెక్‌లారెన్ (దక్షిణాఫ్రికా), నాథన్ మెక్‌కల్లమ్ (న్యూజిలాండ్), లాన్స్ క్లుసెనెర్ (దక్షిణాఫికా) చందర్‌పాల్ (వెస్టిండీస్)లు మాత్రమే ఇన్నింగ్స్ చివర్లో సిక్స్ కొట్టి మ్యాచ్‌ను గెలిపించారు.

వెల్డన్ టీమిండియా

- భారత జట్టుపై మాజీల ప్రశంసలు

బంగ్లాదేశ్‌తో ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్లో చివరి బంతి వరకు పోరాడిన భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చివరి బంతికి సిక్స్ కొట్టి భారత్‌కు మరపురాని విజయాన్ని అందించాడు దినేశ్ కార్తీక్. ఈ మ్యాచ్లో దినేశ్ కార్తీక్ మెరుపు ఇన్నింగ్స్, భారత్ సాధించిన విజయానికి అభిమానులు, మాజీ, ప్రస్తుత క్రికెటర్లు అభినందలు తెలిపారు. టీమిండియా అద్భుతంగా ఆడిందని, దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ సూపర్ అంటూ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అభినందించాడు. ఇక ఒత్తిడిని జయించిన కార్తీక్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడంటూ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసించాడు. దినేశ్ కార్తీక్ వెల్డన్...కెప్టెన్ రోహిత్ శర్మకూ కూడా నా అభినందనలు అంటూ హర్భజన్ సింగ్ ట్వీట్ చేశాడు. టీమిండియా మరచిపోలేని విజయాల్లో ఇదొకటని మాజీ క్రికెటర్ మురళీ విజయ్ అన్నాడు.



ఆ సిక్స్ చూడలేకపోయా: రోహిత్

చివరి బంతికి సిక్స్ కొట్టి దినేశ్ కార్తీక్ మ్యాచ్‌ను గెలిపిస్తే ఆ అద్భుతమైన షాట్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ చూడలేకపోయాడట. డ్రసింగ్ రూమ్‌లో ప్యాడ్లు కట్టుకుంటున్నందున ఆ షాట్‌ను చూడలేకపోయానని రోహిత్ శర్మమ్యాచ్ అయ్యాక చెప్పాడు. 'ఆఖరి రెండు బంతుల్లో ఐదు పరుగులు చేయాలి, ఐదో బంతికి విజయ్‌శంకర్ రనౌట్ అయ్యాడు. ఇంకో బంతి మిగిలి ఉంది స్ట్రైకింగ్‌లో కార్తీక్ ఉన్నాడు. ఎలాగైనా ఫోర్‌కొడతాడు, దీంతో మ్యాచ్ డ్రా అవుతుంది, సూపర్ ఓవర్ ద్వారా ఫలితం దక్కుంది, అందుకే డ్రస్సింగ్ రూమ్‌లో ప్యాడ్లు కట్టుకుంటున్నా.. ఈలోగా కార్తీక్ సిక్స్‌తో మ్యాచ్ ముగించాడు' అని రోహిత్ శర్మ చెప్పాడు.

భారత్ గెలుపు... శ్రీలంక ఫ్యాన్స్ సంబరాలు

దినేష్ కార్తీక్ అద్భుత ఆటతీరుతో ముక్కోణపు టోర్నీ ఫైనల్ మ్యాచ్లో బంగ్లాదేశ్‌పై టీమిండియా విజయం సాధించింది. దీంతో టీమిండియా ఆటగాళ్ల సంబరాలు చేసుకున్నారు. అయితే టీమిండియాతో పాటు శ్రీలంక అభిమానులు కూడా బంగ్లాపై గెలుపుపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మైదానంలో ఓ శ్రీలంక అభిమానైతే ఏకంగా టీమిండియా అభిమానిని ఎత్తుకుని తిప్పి ఆనందంలో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. క్రికెట్ గెలిచిందంటూ శ్రీలంక, టీమిండియా అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ టోర్నీలో శ్రీలంకపై బంగ్లాదేశ్ గెలిచింది. ఆ సందర్భంగా మైదానంలో నాగిని డ్యాన్స్ చేస్తూ బంగ్లా ఆటగాళ్లు ప్రవర్తించిన తీరు శ్రీలంక అభిమానులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీంతో ఫైనల్ మ్యాచ్లో వారంతా టీమిండియాకు మద్దతుగా నిలిచారు. టీమిండియా గెలవడంతో శ్రీలంక అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

మ్యాచ్ ఫిక్సర్ అనలేదు: జహాన్

షమీని కలిసానంటున్న పాకిస్తానీ ఫ్రెండ్



కోల్‌కతా: టీమిండియా పేస్ బౌలర్ షమి వివాదం కొత్త మలుపు తీసుకుంది. షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు తాను అనలేదని భార్య హసీన్ జహాన్ తెలిపారు. పది రోజుల క్రితం షమికి పలువురు మహిళలతో సబంధాలున్నాయని, మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని జహాన్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొనడం గమనార్హం. 'షమిపై నేను ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేయలేదు. నాకు క్రికెట్ గురించి ఏమాత్రం అవగాహన లేదు. అలాంటిది నేను అలా ఎలా ఆరోపణలు చేస్తాను. అంతేకాదు నాపై అత్యాచారం జరిగిందని కూడా నేను అనలేదు. మీడియాలో ఏవేవో వార్తలు వస్తున్నాయి. కావాలంటే నా ఎఫ్ఐఆర్ కాపీ చూసుకోండి. ఎప్పుడైతే మా ఇద్దరికీ పెళ్లి అయ్యిందో అప్పుడే మాకు సమస్యలు మొదలయ్యాయి. గత రెండేళ్ల నుంచి విడాకులు కావాలని కోరుతున్నాడు. ఒకవేళ ఇప్పుడు నాకు షమి క్షమాపణలు చెప్పి, తప్పులన్నింటినీ ఒప్పుకున్నట్లైతే అంతా మంచే జరుగుతుంది. లేదంటే ఇక తామిద్దరం కోర్టులోనే కలిసేది' అని ఆమె స్పష్టం చేసింది. షమి మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడ్డాడని, ఈ క్రమంలోనే దుబాయ్‌లో పాకిస్తాన్‌కు చెందిన అలీబ్షా అనే మహిళ నుంచి డబ్బులు తీసుకున్నట్టు హసీన్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ ప్రారంభించిన బీసీసీఐ జహీన్‌ను ప్రశ్నించింది.

కలిసింది నిజమే..

టీమిండియా పేసర్ మహమ్మద్ షమి మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడ్డాడని, పాకిస్థాన్కు చెందిన అలీబ్షా అనే అమ్మాయి నుంచి డబ్బులు తీసుకున్నాడని షమి భార్య హసీన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై అలీబ్షా మీడియాతో మాట్లాడింది. హసీన్ చేసిన ఆరోపణలను కొట్టిపారేసింది.

'నేను ఇన్‌స్టాగ్రామ్‌లో షమి ఫాలోవర్లలో ఒకర్ని. అతని కున్న లక్షలాది అభిమానుల్లో ఒకదాన్ని. గత ఏడాది ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం నేను మొదటిసారి షమికి మెసేజ్ చేశాను. దుబాయ్‌లో మేమిద్దరం కలిసి రూమ్ తీసుకున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. షమిని దుబాయ్‌లో కలిసింది నిజమే. కానీ, ఇదో సాధారణమైన మీటింగ్. ఆ రోజు షమిని కలిసేందుకు నేను నా సోదరితో ఇంటి నుంచి నేరుగా హోటల్‌కు వచ్చాను. షార్జాలో నా సోదరి ఉంటుంది. అక్కడి నుంచే వచ్చాను. షమి దుబాయ్ వచ్చిన మరుసటి రోజు ఉదయం అతడితో కలిసి నేను బ్రేక్ ఫాస్ట్ చేశాను. అంతేకానీ, మా ఇద్దరి మధ్య ఎలాంటి నగదు లావాదేవీలు జరగలేదు. అబద్దాలు చెప్పే అలవాటు లేని ఓ వ్యక్తి దేశానికి ద్రోహం చేస్తాడని ఎలా అనుకుంటున్నారు. ఎక్కడికి వచ్చి ఈ విషయం చెప్పమన్నా ధైర్యంగా చెబుతా. ఎవరికీ భయపడేది లేదు' అని అలీబ్షా తెలిపింది.



చాహల్‌కు సెకండ్ ర్యాంక్

దుబాయ్: శ్రీలంకలో ముగిసిన టి20 సిరీస్‌లో రాణించిన భారత స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, వాషింగ్టన్ సుందర్‌లు తాజా ఐసీసీ ర్యాంకుల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు. తాజాగా ఐసీసీ ప్రకటించిన టి20 బౌలర్ల ర్యాంకుల్లో చాహల్ 12 స్థానాలు ఎగబాకి రెండో స్థానంలో నిలవగా, వాషింగ్టన్ సుందర్ 151వ ర్యాంక్ నుంచి 31వ ర్యాంక్‌లో నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్న సుందర్ 496 ఐసీసీ పాయింట్లు సంపాదించగా, చాహల్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా 706 పాయింట్లు సంపాదించి తొలి సారి రెండో స్థానానికి చేరుకున్నాడు. నిదహాస్ కప్ ముక్కోణపు సిరీస్‌లో ఇద్దరూ ఎనిమిది వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. బంగ్లా బౌలర్ రూబెల్ హుస్సేన 40 స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకోగా భారత బౌలర్ ఉనద్కత్ 26 స్థానాలు మెరుగుపరుచుకుని 52వ స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరు బౌలర్లు ఆదివారం ముగిసిన ట్రై సిరీస్‌లో ఏడు వికెట్లు పడగొట్టారు. శ్రీలంక బ్యాట్స్‌మెన్ కుశాల్ పెరీరా 204 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఐసీసీ తాజా ర్యాంకుల్లో 20వ స్థానంలో నిలిచాడు. ఆల్ రౌండర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన షకిబుల్ హసన్ ఒక ర్యాంక్ దిగజారి మూడో స్థానంలో నిలిచాడు. శ్రీలంక ఆల్‌రౌండర్ తిసారా పెరీరా ఒక ర్యాంక్ ఎగబాకి మూడో స్థానంలో నిలిచాడు. ఇక సిక్స్‌తో మ్యాచ్ ఫినిష్ చేసిభారత జట్టుకు ట్రోఫీని అందించిన దినేశ్ కార్తీక్ 125 స్థానం నుంచి 95 వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.



ఈసారికి వదిలేయండి

ఓటమికి కారణమవుతానని ఊహించలేదు: హుస్సేన్

కొలంబో: ఫైనల్ మ్యాచ్ ఓట మిపై బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హుస్సేన్ పశ్చాతాపం వ్యక్తం చేశాడు. తాను ధారాళంగా పరుగులివ్వడంతోనే తమ జట్టు ఓటమి పాలైందని, ఈ విషయంలో అభిమానులు క్షమించాలని విజ్ఞప్తి చేశాడు. ఓటమికి తానే కారణమవుతానని ఊహించలేదని ఈ బంగ్లా బౌలర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమ జట్టు విజయానికి దగ్గరగా వచ్చిందని, కానీ చివరకు తన వల్లే ఓడిపోయిందన్నాడు.

ముంబై జట్టులో మెక్లెనగన్

ముంబాయి: ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యే ఐపీఎల్ 11 సీజన్‌లో ఆడే ముంబై జట్టులో న్యూజిలాండ్ ఆటగాడు మిచెల్ మెక్లెనగన్ చేరాడు. ఈ ఏడాది జనవరి చివరి వారంలో నిర్వహించిన వేలంలో ఆస్ట్రేలియా ఆటగాడు జాసన్ బెహ్రెన్డార్ఫ్‌ను రూ.1.5 కోట్లకు ముంబయి ఇండియన్స్ దక్కించుకుంది. ఐతే, జాసన్ ప్రస్తుతం తీవ్ర వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు.



దీంతో బెహ్రెన్డర్ఫ్ ఏకంగా ఈ ఏడాది ఐపీఎల్ మొత్తం టోర్నమెంట్‌కు దూరం కావాల్సి వచ్చింది. దీంతో జాసన్ స్థానంలో న్యూజిలాండ్ పేసర్ మిచెల్ మెక్లెనగన్ జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. గత మూడు సీజన్లలో మిచెల్ ముంబయి ఇండియన్స్‌కు ఆడగా.. ఈ ఏడాది వేలంలో అతడిని ఎవరూ తీసుకోలేదు. ఏప్రిల్ 7 నుంచి ఈ ఏడాది ప్రారంభమయ్యే ఐపీఎల్ సీజన్‌కు జాసన్ అందుబాటులో ఉండటంలేదని ఐపీఎల్ టెక్నికల్ కమిటీకి తెలిపిన ముంబయి ఫ్రాంఛైజీ ఆ స్థానంలో మరో ఆటగాడిని తీసుకునేందుకు అనుమతి కోరింది.

రికార్డుల మోత

కొలంబో: నిదహాస్ ట్రోఫీలో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ పోరులో భారత ఆటగాళ్లు రికార్డుల మోత మోగించారు.

- టీ20ల్లో చివరి బంతిని సిక్సర్ కొట్టి జట్టును గెలిపించిన తొలి ఆటగాడు దినేశ్ కార్తీక్
- టీ20ల్లో 7వేల పరుగు మైలురాయిని చేరుకున్న మూడో భారత ఆటగాడిగా రోహిత్ శర్మ
- భారత జట్టు ఇప్పటి వరకు మూడు టీ20 టోర్నీలను గెలుచుకుంది. ఏ ఫార్మాట్‌లోనైనా భారత్‌కు ఇదే అత్యధికం.
- టీ20 ఫైనల్స్‌లో 50కి పైగా పరుగులు చేసిన నాలుగో కెప్టెన్ రోహిత్ శర్మ
- టీమిండియా బౌలర్ వాషింగ్టన్ సుందర్ ఈ సిరీస్‌లో 8 వికెట్లు తీసుకున్నాడు. 20 ఏళ్ల లోపు వయసున్న బౌలర్ ఇన్ని వికెట్లు తీసుకోవడం ఇదే తొలిసారి.
- బంగ్లాదేశ్‌తో ఇప్పటి వరకు ఆడిన 8 టీ20ల్లోనూ భారత్ విజయం సాధించింది.
- ఇండియా ఇప్పటి వరకు 61 టీ20ల్లో విజయం సాధించింది. 74 టీ20 విజయాలతో పాక్ ముందుంది.
- టీ20 సిరీస్/టోర్నమెంట్ ఫైనల్‌లో 167 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం ఇదే తొలిసారి. 2016లో కోల్‌కతాలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో విండీస్ 156 పరుగుల విజయ లక్ష్యాన్ని అందుకుంది.

డబుల్ గోల్డ్‌పై శరత్ గురి



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ శరత్ కమల్ వచ్చే నెల్లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో డబుల్ స్వర్ణంపై గురిపెట్టాడు. ఇంతకు ముందు జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు భారత్‌కు అందించిన శరత్ గోల్డ్ కోస్ట్ పోటీల్లోనూ సత్తా చూపెడతానంటున్నాడు. ఏప్రిల్ నాలుగు నుంచి 15 వరకు కామన్‌వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరుగుతాయి. 2006 మెల్‌బోర్న్‌లో తొలి సారి కామన్‌వెల్త్ గేమ్స్‌లో ఆడిన 35 ఏళ్ల శరత్ కు ఇదే చివరి కామన్‌వెల్త్ క్రీడలు కాబోతున్నాయి. గోల్డ్‌కోస్ట్ పోటీల్లో టీమ్ విభాగంలోనూ, సింగిల్స్ విభాగంలోనూ భారత్‌కు పతకాలు అందించటమే లక్ష్యంగా పెట్టుకున్న శరత్ ఇటీవల జరిగిన ఖతర్ ఓపెన్‌లో ప్రపంచ ఏడో ర్యాంక్ ఆటగాడు కికో నివాను ఓడించి సంచలనం సృష్టించాడు. ' సింగిల్స్, డబుల్స్, మెన్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో పతకాలు గెలుచుకునేందుకు అవకాశముంది, ముఖ్యంగా కామన్‌వెల్త్ పోటీల్లో ఈ సారి పురుషుల విభాగంలో బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది' అని చెప్పాడు. పదేళ్ల నుంచి టాప్ 100 ర్యాంకుల్లో కొనసాగుతున్న శరత్ ఈ సారి కామన్‌వెల్త్ పోటీలకు సుదీర్ఘ కసరత్తే చేశాడు. ప్రస్తుతం ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకుల్లో శరత్ 77వ స్థానం సంపాదించాడు. గ్లాస్కోలో నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ కామన్‌వెల్త్ పోటీల్లో భారత్ ఒక్క రజత పతకం మాత్రమే గెలుచుకుంది. గ్లాస్గోలో ఆశించిన రీతిలో రాణించలేకపోవటం ఈ సారి భారత్‌పై ఒత్తిడి పెంచిందని శరత్ అంటున్నాడు. ఈ కామన్‌వెల్త్ క్రీడల కోసం యూరప్‌లో సుదీర్ఘ శిక్షణ పొందిన భారత జట్టు సోమవారం భారత్‌కు చేరుకుంది.

ఫైనల్లో ఫెదెరర్‌పై డెల్ పొట్రో విజయం



ఇండియన్ వెల్స్: వరల్డ్ నంబర్ వన్ రోజర్ ఫెదరర్ ఇండియన్ వెల్స్ మాస్టర్ టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్లో పరాజయం పాలయ్యాడు. 2018లో ఇది ఫెదెరర్‌కు తొలి ఓటమి. అర్జెంటీనాకు చెందిన డెల్ పొట్రో 6-4, 6-7 (8-10), 7-6(7-2) స్కోరుతో ఫెదెరర్‌ను చిత్తుచేశాడు. ఈ ఓటమితో వరుసగా ఆరోసారి టైటిల్ గెలుచుకోవాలనుకున్న ఫెదరర్ ఆశలకు బ్రేక్ పడింది. ఫెదెరర్ పై గెలిచిన పొట్రోకు ఇది తొలి మాస్టర్స్ టైటిల్.



ఫెదెరర్ ర్యాంక్ పదిలం

ఇకా తాజా ర్యాంకుల్లో రోజరర ఫెదరర్ నంబర్ వన్ ర్యాంక్ నిలబెట్టుకున్నాడు. ఇండియానా ఓపెన్ టెన్నిస్ టోర్నీలో పరాజయంతో సంబంధం లేకుండానే 9,660 పాయింట్లతో ఫెదరర్ నంబర్ వన్ ర్యాంక్‌లో నిలిచాడు. ఇక తాజగా ఫెదరర్‌ను ఓడించిన పెట్రో ఆరో ర్యాంక్‌కు ఎగబాకాడు. 2012 అక్టోబర్ 29 తర్వాత గత నెల్లో టాప్ ర్యాంక్ దక్కించుకున్న ఫెదరర్ తర్వాత ఈ ర్యాంకుల్లో స్పెయిన్ స్టార్ నాదల్ రెండో స్థానంలో ఉన్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.